అపరాధ పరిశోధన

రు. 7.50 | ఫిబ్రవరి '88 |



Blank Page

సంపుటి: 46
సంచిక 1

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

ఫిబ్రవరి, 1988

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-233

[ఫలితాలు]

డిసెంబరు '87 నెల "అపరాధ పరిశోధన పోటీ-233" కి సరియైన సమాధానాలు:

1. చరణ్‌సింగ్.
2. శ్రీలంకలో.
3. ఆదిలాబాద్.
4. వెస్టిండీస్.
5. కరంటుకోత.

పై జవాబుల ప్రకారం ముగ్గురు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి వచ్చే నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ కె.ఏ.వి. కృష్ణశ్రీరావు,
B/o కె. దుర్గాప్రసాద్ (బిజినెస్)
గవరవీధి,
మహారాజాప్రభుత్వ వైద్యాలయం ఎదురుగా,
విజయనగరము-531 202.

(2) శ్రీ యం. శంకర్‌రెడ్డి,
గాంధీచౌక్ రోడ్,
బెల్లంపల్లి-504 251. (ఆదిలాబాదు జిల్లా.)

(3) శ్రీ పోతు రామచందర్,
రూం నెం: 7/బి.ఎఫ్.,
వాడచి చావల్, దీపక్ సినిమా దగ్గర,
ఎన్.ఎం. జోషిమార్గ్,
బొంబాయి-13.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. నేలమాళిగ—వసుంధర
24. క్రైమ్ డైరెక్టర్—డి.వి.వి. సత్యనారాయణ
50. కాటేసిన మృత్యువు—బొమ్మిడి అచ్చారావు
71. నేరస్థుడి తీర్పు—జొన్నలగడ్డ రామలక్ష్మి
89. ఫాలనేత్రం (సీరియల్)—వి.యస్. రావ్
132. వెండిమబ్బులు—వి. రాజేశ్వరి
147. సాక్షి—ఫణిబాబు
153. చోరలీల—వసుంధర
172. మహాప్రస్థానం వ్యాన్—రంగబాబు
179. మిస్ మిస్టరీ (సీరియల్)—వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. బ్రతికొచ్చిన హతుడు—వసుంధర
40. ఇంటర్వ్యూహం—వి. యస్. రావ్
110. విమాన దోపిడి—భీమవరపు పురుషోత్తం
127. రెడ్ బాక్స్—సుంకరి రాంప్రసాద్
156. ఎడారి కోయిల (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

నేలమాళిగ

వసుంధర

వామనరావు, వైకుంఠం పక్క పక్క యిళ్ళలోనే ఉంటున్నారు. ఇద్దరికీ దూరపు బంధుత్వం కూడా ఉంది. అయినా ఎందుకో చాలాకాలం నుంచి మాట్లాడు

కోరు. అలాగని ఆ యింటిమీద కాకి ఈ యింటిమీద వాల కూడదన్న సిద్ధాంతమూ లేదు. ఇద్దరూ అంటీ ముట్టనట్లుగా ఉంటారంతే!

వామనరావుకూళ్ళో రెండు కిరాణా, రెండు ఫ్యాన్సీ-దుకాణా లున్నాయి. డబ్బు బాగా సంపాదించాడు. సంపాదిస్తున్నాడు. ఆయన కిద్దరు కూతుళ్ళు, ఓ కొడుకు. ఓ కూతురికీ, కొడుక్కీ కూడా పెళ్ళిళ్ళైపోయాయి. ఇక మిగిలింది పద్దెనిమిదేళ్ళ రాజేశ్వరి. దానికోసం సంబంధాలు చూస్తున్నాడు తండ్రి.

నిజానికి మరో రెండేళ్ళదాకా రాజేశ్వరి పెళ్ళి చేయాలని వామనరా వనుకోలేదు. కానీ వైకుంఠం కొడుకు గణేష్ రాజేశ్వరిని ప్రేమిస్తూ ఆమె చుట్టూ తిరుగుతున్నాడు. అతడిలో ఏమి మాయ ఉందో ఏమో— రాజేశ్వరి కూడా అతణ్ణి ప్రేమించడం ప్రారంభించింది.

విషయం తెలిసిన వామనరావు కూతుర్ని మందలించాడు. ఫలితంగా రాజేశ్వరి వీలైనంత రహస్యంగా గణేష్‌ని కలుసుకోసాగింది. అందుకే రాజేశ్వరికి త్వరగా మంచి సంబంధం చూసి పెళ్ళి చేయాలని వామనరా వనుకుంటున్నాడు.

అసలు గణేష్‌నే ఆయన అల్లుడిగా చేసుకోవచ్చు. కుర్రాడు బాగుంటాడు. రాజేశ్వరి కీడూ జోడూలా కనబడతాడు. కానీ వచ్చిన యిబ్బందల్లా అతగాడెప్పుడూ గాంబ్లింగ్‌హౌసుల్లో గడుపుతూంటాడు. అక్కడ బాగా డబ్బు సంపాదిస్తాడని వినికిడి. ఇంతవరకూ ఏ నేరమూ చేయలేదు కానీ అతణ్ణి గురించి పట్టుబడని నేరస్థుడని వామనరా వనుకుంటాడు.

పోనీ తండ్రి సంప్రదాయం చూద్దామా అనుకుంటే

వైకుంఠం చేసేది కమిషన్ వ్యాపారం. వ్యాపారంలో అతడి పెట్టుబడి కనబడదు. ఏం చేస్తున్నాడో కూడా సరిగా తెలియదు. కానీ డబ్బు బాగా సంపాదించాడు. సంపాదిస్తున్నాడు. ఆయన పద్ధతుల గురించి చాలామందికి సదభిప్రాయం లేదు. అలాంటివాడితో వియ్యమందడం వామనరావు కిష్టంలేదు.

ప్రస్తుతం వైకుంఠం పక్షవాతంతో మంచం పట్టాడు. ఇది జరిగి ఆర్నెల్లయినా, పక్కింట్లోనే వున్న వామనరావొక్కసారి కూడా ఆయన్ను చూడ్డానికి వెళ్ళలేదు. కానీ ఈ రోజు వెళ్ళక తప్పలేదు.

ఎందుకంటే వైకుంఠం ఆయన్ను పిలిచాడు.

వామనరావు వెళ్ళి వైకుంఠాన్ని పలకరించి—ఆయనకు జబ్బు చేసిందన్న విషయం తనకు వారం రోజుల క్రితం మాత్రమే తెలిసిందనీ, వద్దామంటే వీలుపడడం లేదనీ అన్నాడు.

ఆయన కేవలం మర్యాద కోసం ఆ మాట లన్నాడు.

వైకుంఠం అతి కష్టంమీద కూడబలుక్కుని మాట్లాడుతున్నాడు. ఆయన వామనరావుతో—"వ్యాపారంలో లక్ష పనులుంటాయి. మీరు రాకపోయినందుకు నేనేమీ అనుకోలేదు. నేను మిమ్మల్ని పిలవడానికి కారణం మా అబ్బాయి! వాడు మీ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు—" అన్నాడు.

"ఈ పెళ్ళి నా కిష్టంలేదు—" అన్నాడు వామనరావు ఖచ్చితంగా.

"ఈ పెళ్ళికి మీ యిష్టం అడ్డురాదు. అమ్మాయి కూడా వాడంటే ఇష్టపడుతోంది. మీరు వేరే బలవంతం పెళ్ళి చేసినా అన్నింటినీ కాదని ఆ సంబంధం కూడా తెంచుకుని

మావాడి దగ్గరకు వచ్చేస్తానంటోంది....—" అన్నాడు వైకుంఠం.

"చూస్తాను—అదెలా వీలుపడుతుందో!"

"చూసి చేసేదేమీలేదు—శత్రుత్వాన్ని పెంచుకోవడం తప్ప...." అన్నాడు వైకుంఠం.

"అయితే నన్నేం చేయమంటారు?"

"నిదానించండి. మా వాడిలో లోపాలేమిటో చెప్పండి. అవి నిజంగా లోపాలే అయితే వాడు సవరించుకుంటాడు. లోపాలు కాకపోతే మీరు పెళ్ళికి ఒప్పుకోండి—" అన్నాడు వైకుంఠం.

"అతడు జూదరి—...." అన్నాడు వామనరావు.

"కొందరికి అసాధారణ శక్తులు అవలీలగా పట్టుబడతాయి. మా వాడలాంటివాడు. జూదంలో వాడు ధర్మరాజునే కాదు, శకునిని కూడా నెగ్గగలడు. కానీ ఎక్కడా మోసం చేయడు. మోసముంటే పట్టేస్తాడు. ప్రభుత్వం చట్టసమ్మతమని అంగీకరించిన చోటనే వాడు జూదమాడుతున్నాడు—...." అన్నాడు వైకుంఠం.

"జూదమాడడం మంచి అలవాటు కాదు. అలాంటివాడు—ఎలాంటి నేరాలైనా చేయడానికి సిద్ధపడతాడు. ఏదో ఒకరోజున అతడు చెరసాలపాలు కాకతప్పదు—" అన్నాడు వామనరావు.

"మీరు జూదం గురించి మాట్లాడుతున్నారు. అంతకంటే చెడ్డది దొంగతనం. కానీ పుట్టుకతోనే నా కది కళగా పట్టుబడింది. ఆ కళను నేను సామర్థ్యం నిరూపించుకుందుకే తప్ప స్వప్రయోజనానికి వాడుకోలేదు—...."

"దొంగతనం కళ యెలా అవుతుంది? అది నేరం...."

"నడిరోడ్డుమీద ఎవరినైనా పిడిగుద్దులతో రక్తం వచ్చేలా కొడితే అది అమానుషం. నేరం. అదే ఒలింపిక్సులో బాక్సింగ్ పేరిట చేస్తే అది వినోదం. ఆట—అలాగేదొంగతనం నాకు సంబంధించినంతవరకూ కళ...."

"ఈ కళ తెలిసినవారితో సంబంధ బాంధవ్యాలు నా కిష్టముండవు—"

"ఎందుకని?"

"చెప్పానుగా—దొంగతనం చేసేవారు నా దృష్టిలో కళాకారులు కాదు—దొంగలు!"

వైకుంఠం ఎలాగో కష్టపడి నవ్వగలిగాడు—"నా కళను నేను స్వార్ధానికి ఉపయోగించుకుని ఉంటే మీ పక్కన యిలా మేడ కట్టుకుని ఉండేవాణ్ణి కాదు. ఏ మహానగరం నడిబొడ్డునో పాలరాతి మేడ కట్టేవాణ్ణి. అందులో నెమలి సింహాసనంమీద కోహినూరు వజ్రం పొదిగిన కిరీటం ధరించి కూర్చునేవాణ్ణి."

"అంటే?"

"నేను చేస్తున్న కమిషన్ వ్యాపారం—నిజాయితీకి నిదర్శనం—"

"నా కర్థంకాలేదు—...."

"నేను తలచుకుంటే బ్యాంకులు కొల్లగొట్టగలను. లాకర్లలో డబ్బు దోచగలను. మ్యూజియాల్లో అపూర్వ వస్తువులు సంగ్రహించగలను. అవేమీ చేయలేదు నేను. అందుకు కారణం నా నిజాయితీ—....నా సామర్థ్యం మరొకడికుంటే—అదంతా దొంగతనానికే వినియోగపడేది—...."

"మీరు దొంగ—మీ అబ్బాయి జూదరి—మీతో వియ్యమెలా అందగలను?...." అన్నాడు వామనరావు.

"మా గణేష్ కూడా దొంగతనంలో అత్యంత ప్రతిభా వంతుడు. అర్జునుడికి అభిమన్యుడిలా—వాడు నా కొడు కయ్యాడు. అయితే జీవితంలో వాడింతవరకూ ఒక్క దొంగతనం కూడా చేయలేదు. ధనసంపాదనకు జూదాన్నే ఎన్నుకున్నాడు. అదీ న్యాయమార్గంలో—...."

"నాకు నచ్చదు మీ మార్గం!"

"వామనరావుగారూ—మిమ్మల్ని మీరు మోసగించు కుంటున్నారు తప్ప దొంగతనమంటే మీకూ యిష్టమే! వ్యాపారంలో మీరు సాధించే ప్రగతి—దొంగతనం కార ణంగా కాదా?" అన్నాడు వైకుంఠం.

"ఇలాంటి వితండవాదనలు నాకు నచ్చవు. వ్యాపా రంలో ప్రజాసేవ వుంది—" అన్నాడు వామనరావు.

"అయితే శేఠ్ చందనదాసుని మోసగించి రెండు మణులు తీసుకోవడంలో యెలాంటి ప్రజాసేవ వుంది?" అన్నాడు వైకుంఠం.

వామనరావు తడబడ్డాడు.

నాలుగేళ్ళ క్రితం జరిగిన విషయమది.

చందనదాసుకి అర్జంటుగా నాలుగులక్షలు కావలసి వచ్చాయి. అతడికి డబిచ్చే నాధుడు దొరక్క వామనరావు నాశ్రయించాడు. తాకట్టుకి ఎనిమిది మణులిచ్చాడు. ఒక్కొక్క మణీ లక్షయాభై వేల రూపాయల విలువ చేస్తుంది. ఆ మణులు చందనదాసింట తర తరాలుగా ఉంటున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి నాయన విక్ర యించడు.

చందనదాసుకి వామనరావు డబ్బిచ్చాడు. అప్పుడాయ నకి దుర్బుద్ధి పుట్టింది. అందుక్కారణం ఓ స్మగ్లరు. పురా తనకాలపు మణులకు విదేశాల్లో విలువెక్కువ. ఒక్కొ

క్కటి నాలుగు నాలుగులక్షలు చొప్పున ఆ స్మగ్లరు రెండు మణులను వామనరావు వద్ద కొన్నాడు. ఆ రెండు మణుల స్థానంలో మామూలు మణుల నుంచాడు వామనరావు.

చందనదాసు డబిచ్చి మణులు తీసుకునేందుకు వచ్చాడు. అతడికి వెంటనే జరిగిన మోసం తెలిసిపోయి పెద్ద రగడ చేశాడు.

"నాకేమీ తెలియదు — నువ్విచ్చినవే తిరిగిచ్చాను. కావాలంటే పోలీస్ కంప్లయింటు చేసుకో—" అన్నాడు వామనరావు.

"ఈ మణులు వంశపారంపర్యంగా వస్తున్నాయి. ఇవి ఇన్‌కంటాక్సువారికి కూడా తెలియకుండా ఉంచుతున్నాం. నిన్ను నమ్మాను. మోసపోయాను. ఇది బయటెక్కడా చెప్పుకోలేను— ... ..." అన్నాడు చందనదాసు.

వామనరావు కరగలేదు.

చందనదాసు విచారంగా వెళ్ళిపోయాడు.

ఈ నేరం గురించి వామనరావెవరికి చెప్పలేదు. ఇంట్లో భార్యాబిడ్డలకు చెప్పలేదు. అటు చందనదాసూ ఎవరికీ చెప్పుకోలేదు.

మరి—వైకుంఠానికెలా తెలిసింది?

"చెప్పండి—మీరు చేసింది దొంగతనం కాదా?"

"నాకేమీ తెలియదు. మిమ్మల్ని మీరు సమర్థించుకునేందుకు నామీద నేరారోపణ చేస్తున్నారు—" అన్నాడు వామనరావు.

"ఆరోపణలు నా రక్తంలోనే లేవు. నిజాయితీ మా యింటి ప్రాణం. మా యింట్లో ఎవరొక పైసా సంపాదించినా అది పద్దు రాస్తాం. నేను కొన్న ప్రతి

వస్తువుకూ అకౌంటుంది. న్యాయంగా పన్ను కడుతూ ఇంత వాడి నయ్యాను ...."

వామనరావు నవ్వి—"నా నిజాయితీ గురించి మీకులా సంజాయిషీ యిచ్చుకోవాల్సిన అవసరంరాలేదు నాకు...." అన్నాడు.

"నాకు సంజాయిషీ భయంలేదు. అందుకే నా యింట్లో నేలమాళిగ లేదు. మీ యింట్లో నేలమాళిగ యెందు కున్నట్లో?"

"మా యింట్లో నేలమాళిగ ఉందా?" ఆశ్చర్యంగా అడిగాడు వామనరావు.

"మీ రాశ్చర్యాన్ని నటించవద్దు. మీ నేలమాళిగలో ఏమున్నాయో కూడా నాకు తెలుసు—...." అన్నాడు వైకుంఠం.

వామనరా వాశ్చర్యంగా ఆయనవంక చూశాడు. వైకుంఠం ముఖ్యంలో ఇప్పుడు కొత్త ఉత్సాహం కన బడుతోంది.

"ఏమున్నాయో చెప్పండి—తెలుకుంటాను—...."

"మీకు తెలిసింది చెప్పటం కన్నా—తెలియంది చెప్ప టంలో నాకు థ్రిల్లెక్కువుంది—" అన్నాడు వైకుంఠం.

"అంటే...."

"నేలమాళిగలో—గోడకు పొదిగిన బీరువాలో—ఒక పెద్ద నగలపెట్టె....అందులో ఒక చిన్న భరిణ.... అందులో వజ్రాలు పొదిగిన నాలుగుంగరాలు....ఇప్పు డక్కడ మూడే ఉన్నాయి...."

"వాట్!...." అన్నాడు వామనరావు తెల్లబోయి.

"అవును—మూడే ఉన్నాయిప్పుడు?"

"ఎవరు తీశారు?"

"ఎవరు తీసినా అది స్వార్థంతో కాదు...."

"ఎవరు తీశారు?" రెట్టించాడు వామనరావు.

"అయితే నేలమాళిగ ఉందని ఒప్పుకోండి. మిగతాది చెబుతాను—...."

"ఇంత తెలిసిన మీ ముందు ఒప్పుకోవడంలో తప్పు లేదు...." అన్నాడు వామనరావు నీరసంగా.

"ఆ నేలమాళిగలోకి మీకు తెలియకుండా ప్రవేశించడం మరెవరికీ సాధ్యం కాదు—ఆ ఉంగరం నా దగ్గరుంది—" అన్నాడు వైకుంఠం.

వామనరావు మ్రాన్పడిపోయాడు. పక్షవాతం తనకే వచ్చిందా అన్న అనుభూతి కలిగిందతడికి. అందులోంచి తేరుకున్నాక — "ఏదీ — చూపించండి—...." అన్నాడాయన.

అంతవరకూ ముడిచి వున్న కుడిచేతి గుప్పెట తెరిచాడు వైకుంఠం—"చూడండి!" అన్నాడు.

వామనరావు కళ్ళు జిగేల్మన్నాయి.

వైకుంఠం అరచేతిలో వజ్రపుటుంగర ముంది. కానీ అదెలా సాధ్యం?

వామనరావు ఊహలు పరిపరి విధాల పోయాయి.

"ఈ ఉంగరం మాదై ఉండదు. మాదే గనుక అయుంటే మీరిది యెందుకు తీసినట్లు?" అన్నాడు వామనరావు.

వైకుంఠం కుడిచేతి గుప్పెట మళ్ళీ మూసేసి—"నేను జబ్బు పడడానికి వారంరోజుల ముందు నేనిది మీ నేలమాళిగ నుంచి తెచ్చాను. నా సామర్థ్యాన్ని మీకు నిరూపించుకోవాలని నా అభిప్రాయం. మీలో లేని నిజాయితీ నాలో ఉంది. అసమర్థు డూరుకోవటం గొప్ప విశేషం

కాదు. సమర్థుడి శాంతమే గొప్పది. మీరు నా మాట విని రెండు అమాయక హృదయాలను కలిపి పుణ్యం కట్టు కోండి. వివాహం పెద్దల ఆశీర్వాదంతో జరిగితే—అది యిరు పక్షాల పిన్నలకూ మంచిది—" అన్నాడు.

"ఈ ఉంగరం మాదికాదు—" అన్నాడు వామనరావు చటుక్కున.

"ఇది మీది కాదని ఋజువు చేయండి. అప్పుడు నే నీ వివాహం జరక్కుండా చేస్తాను....—" అన్నాడు వైకుంఠం.

"అంటే?"

"మీ ఉంగరాలు మీ నేలమాళిగలోనే ఉన్నాయని మీ రనుకుంటున్నారు. మీ ఊహ తప్పని నే నంటున్నాను. నే నన్నది తప్పని ఋజువు చేస్తే—ఈ ఉంగరాన్ని కూడా మీకు బహూకరిస్తాను. గణేష్ వివాహం రాజేశ్వరితో జర క్కుండా ఆపుతాను...." అన్నాడు వైకుంఠం.

"ఉంగరం మాదే అయితే?"

"నా సామర్థ్యం మీరు తెలుసుకుంటారు. నాది సదుద్దే శ్యమే ననడానికి చిహ్నంగా ఈ ఉంగరం మీకు తిరిగిచ్చే స్తాను. పైసా కట్నం లేకుండా మీ అమ్మాయిని నా ఇంటి కోడల్ని చేసుకుంటాను...."

"మీరసలు నేలమాళిగలోనికి ఎలా వెళ్లారు?"

"అది రహస్యం...."

"రహస్యం కాదు—అసాధ్యం...."

"ఎవరికైనా అసాధ్యమేమో—నా క్కాదు. నా మాట లకు ఋజువు నా అరచేతిలో ఉంగరం—...."

"అసాధ్యాన్ని సాధ్యమెలా చేశారో నాకు చెప్పండి. మీ మాటలు నమ్ముతాను...."

"నేలమాళిగలోకి వెళ్ళి చూస్తే నా మాట ఎలాగూ నమ్ముతారు—...."

"అయితే ఆ రహస్యం చెప్పరా?

"ఆ రహస్యం మీకే కాదు, నా కథ రాస్తానంటే ఆ రచయిత కూడా చెప్పను—...." అన్నాడు వైకుంఠం.

వామనరావు లేచినిలబడి—"అయితే యిక సెలవు తీసుకుంటాను—" అన్నాడు.

"మంచిది. వెళ్ళిరండి. వివాహ విషయంలో నిర్ణయం తీసుకునేందుకు మీ కిరవై నాలుగుగంటలు మాత్రం వ్యవధి నిస్తున్నాను ..." అన్నాడు వైకుంఠం.

2

వైకుంఠంతో మాట్లాడి వచ్చాక వామనరావు దీర్ఘాలోచనలో పడిపోయాడు.

వైకుంఠం నిజంగా నేలమాళిగలోకి వెళ్ళగలిగాడా....?

ఆ నేలమాళిగలోకి వెళ్ళడం తనకే సులభం కాదు.

వామనరావు తండ్రి ప్రత్యేకంగా కట్టించాడది. అయిదేళ్ళ క్రితం దానిలో ప్రత్యేకమైన మార్పులు చేయించాడు తను.

నేలమాళిగ ఓ గదిలో ఉంది. ఆ గదిలో నేలమీద పలక ఒకటి ఎత్తితే వస్తుంది నేలమాళిగ. లోపలకు మెట్లుంటాయి.

వామనరావు కా యేర్పాటు నచ్చలేదు. చూడగానే నేలమాళిగకు ప్రవేశద్వారం ఎక్కడున్నదీ తెలిసిపోతుంది. అందుకని తండ్రి ఆ గదిలో నేలపై ఖరీదయిన తివాచీ పరిపించాడు.

కానీ వామనరావు-నేలలో మార్పులు ప్రవేశపెట్టాడు. గదిలో గచ్చు మార్పించి మొజాయిక్ పలకలు పరిపించాడు. పలకల డిజైన్‌లో కీ హోలుంటుంది. ఆ కీ హోల్‌ను ప్రత్యేకంగా తయారుచేసిన తాళంతో తాకితే పలక తెరుచుకుంటుంది. అయితే కీ హోల్ ప్రత్యేకంగా ఒకచోటే ఉండదు. గడియారంలో తేదీలు మారినట్లుగా—రోజు రోజుకీ కీ హోల్ స్థానం మారుతుంది.

గదిలో మొత్తం నూట ఇరవై ఎనిమిది కీ హోల్ డిజైన్లున్నాయి. అందులో ఏ కీ హోల్ నా రోజు తాకాలో అన్నది తెలుసుకునేందుకో రిమోట్ కంట్రోల్ స్విచ్ బోర్డుంది. అది చూడ్డానికి కాల్క్యులేటర్లా ఉంటుంది. ఆ సాధనాన్ని తీసుకుని ఆ గదిలోకి వెళ్ళి ఓ మీట నొక్కితే ఆ రోజుకు తాకవలసిన కీ హోల్ ప్రకాశవంతమౌతుంది. పొరపాటున తాళంతో మరో కీ హోల్‌ను తాకితే—ఆ రోజుకిక నేలమాళిగ తెరుచుకోదు.

కీ హోల్ ఎక్కడున్నా—తెరుచుకొనే పలక మాత్రం ఒక్కటే! ఒక ప్రముఖ ఎలక్ట్రానిక్ ఇంజనీరు సాయంతో వామనరావీ ఏర్పాటు చేయించాడు. అయిడియా వామనరావుది. డిజైన్ ఇంజనీరుది. ఆ ఇంజనీరు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నాడు.

"నేనే కావాలన్నా మీ యింట్లో దొంగతనం చేయలేను. అంత పక్కా ఏర్పాటిది. అయినప్పటికీ జాగ్రత్త కోసం—మీరో పని చేయండి. రిమోట్ కంట్రోల్‌ని, తాళాన్నీ వేరు వేరు ప్రదేశాల్లో ఇంచండి. మీరు తప్ప ఇంకెవ్వరూ నేలమాళిగను వాడకుండా చూడండి—" అన్నాడా యింజనీరు.

వామనరావు రెండింటినీ రెండు వేర్వేరు బ్యాంకు

లాకర్లలో ఉంచాడు. దాచేముందు ఇంజనీరు నడిగి—ఎక్కువకాలం వాడకపోయినా ఆ ఎలక్ట్రానిక్ పరికరాల కేమీ కాదని రూఢి చేసుకున్నాడు.

సాధారణంగా నేలమాళిగ ఉన్న గది నాయన తాళం వేసి ఉంచేవాడు. ఆ తాళం తనవద్దనే ఉంచుకునేవాడు.

ఇంట్లో నేలమాళిగ ఉన్న విషయం ఆయన పిల్లలకు తెలియదు. భార్యకు మాత్రం తెలుసు. తెలిసినా ఆమె నేలమాళిగను తెరవలేదు.

అలాంటిది వైకుంఠం ఆ నేలమాళిగ గురించి యెలా తెలుసుకున్నాడు? తెలుసుకున్నా ఎలా ప్రవేశించాడు?

వామనరావుకు బుర్ర పనిచేయడం మానేసింది.

ఆ రోజుకిక నేలమాళిగను తెరవడం తనవల్ల కాదు. ఎందుకంటే బ్యాంకులాకర్లు ఆపరేట్ చేసే టైమయిపోయింది.

వామనరావుకు స్థిమితంలేక తనొక్కసారి కూతుర్ని పిలిచి మాట్లాడాలనుకున్నాడు. సాయంత్రం ఆరింటికి రాజేశ్వరి కాలేజీ నుంచి తిరిగిరాగానే ప్రత్యేకంగా తన గదిలోకి పిలిచాడు.

"నువ్వు గణేశ్ నెందుకు ప్రేమిస్తున్నావు" అన్నాడాయన.

"తెలియదు—" అంది రాజేశ్వరి.

"గణేష్ నాన్న నన్ను పిలిచి—నా యిష్టం లేకపోయినా మీ పెళ్ళి జరుగుతుందన్నాడు. అందుకు నువ్వు సహకరిస్తావా?" అన్నాడు వామనరావు.

రాజేశ్వరి మాట్లాడలేదు.

"నువ్వు మాట్లాడకపోతే నీకు నా కంటే ఆ గణేష్ ఎక్కువనుకోవాలి. నీకిచ్చిన స్వతంత్రాన్ని దుర్వినియోగం

చేస్తున్నావనుకోవాలి. ఈ రోజునుంచీ నీ విల్లు కదల కూడదు—....”

“ఎందుకని?”

“కొంతకాలం పాటు నువ్వు, గణేశ్ కలుసుకో కూడదు—....”

రాజేశ్వరి నవ్వి—“నాన్నా! గణేశ్ నన్ను కలుసుకో కుండా మీ రాపలేరు—” అంది.

వామనరావు ముఖం ఎర్రబడింది—“ఎందు కావ లేను? నీకు నామీద గౌరవం లేకపోతే తప్ప—....?”

“నాన్నా! నాకు మీరంటే గౌరవం. మీ మాటలు విని నేను గణేశ్‌ను కలుసుకోవడం మానేశాను. కానీ అతడు కాలేజీలో నా క్లాసుకి వచ్చి యేదో సాకు చెప్పి నా టీచర్ని కన్విన్సుచేసి నన్ను బయటకు తీసుకుపోయేవాడు....” అంది రాజేశ్వరి.

“తీసుకుపోతే నువ్వేలా వెళ్లావు?”

“అతడిలో ఏదో సమ్మోహనశక్తి ఉంది. ఆ శక్తికి టీచరు, నా క్లాసమేట్సు, ఆఖరికి నేనుకూడా లోబడి పోయాం. ఇంకా విచిత్రమేమంటే—అతడు తరచుగా నన్ను కలుసుకుందుకు వచ్చినా—ఎవరూ మా సంబంధం గురించి తప్పుగా అనుకోవటంలేదు. మా వివాహం నిశ్చయమయ్యేవరకూ మా గురించి తప్పుడు ప్రచారం జరుగనివ్వనని గణేశ్ నాకు మాటిచ్చాడు—” అంది రాజేశ్వరి.

“సమ్మోహనశక్తి అన్నది నీ భ్రమ!” అన్నాడు వామనరావు. కూతురు మంచి వయసులో వుంది. అంద

మైన యువకుణ్ణి చూసి ఆకర్షించబడింది. అతడికి లేనీ పోనీ శక్తు లంటగడుతోంది.... ....అదీ ఆయన అభి ప్రాయం.

"నాన్నా! అతడి శక్తిని నేను కళ్ళారా చూశాను. ఒకసారి మేమిద్దరం సినిమాకు వెళ్లాం. టిక్కెట్లు లేవు. ఎనిమిదిరూపాయల టికెట్ బ్లాకులో ఎనభై రూపాయ లమ్ముతూంటే దానిక్కూడా పెద్ద క్యూ వుంది గణేశ్ ఏం మంత్రం వేశాడో-ఆ అమ్మేవాడు-అన్ని లాభాలూ వదలుకుని మాకు టికెటు ఎనిమిది రూపాయలకే యిచ్చే శాడు...."

"ఊఁ!...." అన్నాడు వామనరావు యింకా చెప్ప మన్నట్లు.

"ఒకసారి స్టార్ హోటలుకు వెళ్లాం. కావలసింది తిని బయటకు వచ్చేశాం. అక్కడ అంతా గణేశ్‌కు సలాములు చేశారు...

ఒకసారిద్దరం బీచికి వెళ్ళాం. నలుగురమ్మాయి లతడి చుట్టూ చేరి ప్రేమకబుర్లు చెప్పారు. ముందుగా ఏర్పాటు చేసుకున్నాడా అంటే వాళ్ళలో నాకు తెలిసిన అమ్మాయి కూడా వుంది. మగాళ్ళను చూస్తేచాలు దాని బుర్ర భూమి లోకి దిగిపోతుంది. చాలా భయం దానికి. ఆ అమ్మాయి చేత అప్పటికప్పుడు నేనడిగిన డైలాగులన్నీ చెప్పించాడు గణేశ్...."

"ఊఁ! అయితే నువ్వు ఆ గణేశ్‌గాడితో సినిమాలకీ, హోటళ్ళకీ, బీచిలకీ తిరుగుతున్నావన్నమాట. ఇదన్న మాట నామీదున్న గౌరవం...."

"నాలుగురోజులు కాలేజీకి సెలవులొస్తే యిల్లు కదల

లేదు నేను. అప్పుడు గణేశ్ మనింటికొచ్చి మీ అనుమతి తీసుకుని నన్ను బయటకు తీసుకుని వెళ్ళాడు— ....” అంది రాజేశ్వరి.

“అబద్ధం!”

“కావాలంటే అమ్మ నడగండి....” అంది రాజేశ్వరి.

“అమ్మ చెప్పినా నేనిది నమ్మను. మీరంతా కలిసి ఏదో నాటకమాడుతున్నారంటాను ఆ గణేశ్‌గాడికీ నీకూ పెళ్ళి జరుగనివ్వను. నువ్వు వాణ్ణి మరిచిపో—” అరిచి నట్లుగా అన్నాడు వామనరావు.

“నాన్నా! ఇన్నివిన్నా గణేశ్ గొప్పతనం తెలియలేదా మీకు?” అంది రాజేశ్వరి.

“ఏమిటే వాడి గొప్పతనం?”

“గణేశ్‌లో అద్భుతశక్తు లున్నాయన్నది తిరుగులేని నిజం. అలాంటి గణేశ్ తన శక్తుల్ని దుర్వినియోగం చేయకుండా ఉండడం సామాన్యం కాదు—” అంది రాజేశ్వరి.

“అద్భుతశక్తులు నీవంటి ఆడపిల్లల్ని మోసం చేయ డానికి పనికివస్తాయి. మరెందుకూ పనికి రావు. అందుకే వాడా శక్తులు నీకు చూపిస్తున్నాడు— ....” అంటూ ఎగిరి పడ్డాడు వామనరావు.

“ఇంతకీ నన్నెందుకు పిలిచినట్లు....?” అంది రాజేశ్వరి.

“గణేశ్‌ని మర్చిపో—” అన్నాడు వామనరావు.

“నా శక్తికొద్దీ ప్రయత్నిస్తాను. మీ శక్తికొద్దీ ఆపండి” అని వెళ్ళిపోయింది రాజేశ్వరి.

వామనరావు ఆశ్చర్యంగా — “నా కూ తు రే నా

యిది! నా శత్రువు కొడుకును పొగుడుతోంది!" అను కున్నాడు.

3

మర్నాడు వామనరావు రెండు బ్యాంకులకూ వెళ్ళి లాకర్లలోంచి రిమోట్ కంట్రోలు, తాళం తీసుకున్నాడు. ఆ రెండూ యధాస్థానంలో ఉండడం చూసి ఆయన తేలిగ్గా నిట్టూర్చాడు.

నేలమాళిగ ఉన్నగది తాళం కూడా భద్రంగా ఉంది దానినెవరూ మారు తాళంతో తెరవడానికి ప్రయత్నించి నట్లులేదు.

ఆ గది తాళంచెవి దేవుడి మందిరంలో ఉంటుంది— దేవుళ్ళ విగ్రహాలమధ్య! ఆ తాళాన్ని వామనరావు భార్య తప్ప ఇంకెవరూ తాకనైనా తాకరు. భర్త కావాలన్నప్పు డామె స్నానంచేసి పూజావిధులు నిర్వర్తించి ఆ తాళం తీసిస్తుంది. తనకాతాళం కావాలని ముందురోజే చెప్పడం వల్ల వామనరావు భార్య ఆ తాళాన్నాయన కుదయమే యిచ్చేసింది.

వామనరావు గదితాళం తెరిచాడు.

ఎయిర్‌కండిషన్డు గది.

నేలంతా శుభ్రంగా ఉంది. కీహోల్సు డిజైన్లున్న మొజాయిక్ ఫ్లోరింగ్—తమాషాగా అందంగా కనబడు తోంది.

వామనరావు గది తలుపులు లోపల్నుంచీ వేసేశాడు. ఎందుకో ఆయనకు శరీరం వణికింది.

ఎవ్వరికీ తెలియదనుకుంటున్న ఆ నేలమాళిగ రహస్యం వైకుంఠానికి తెలిసిపోయింది. ఎవ్వరూ

ప్రవేశించలేరనుకుంటున్న ఆ నేలమాళిగలోనికి వైకుంఠం ప్రవేశించినంటున్నాడు.

"అదెలా సాధ్యం?" అన్నదే ఆయన ఆలోచన.

వామనరావు రిమోట్ కంట్రోల్‌తో కీహోల్‌ను కనిపెట్టి తాళంతో దాన్ని తాకి నేలమాళిగ ప్రవేశ ద్వారాన్ని తెరిచి మెట్లుదిగి లోపల ప్రవేశించాడు. మెట్లకు పక్కనే తడుముకుంటూ స్విచ్ వేశాడు.

నేలమాళిగ ప్రకాశవంతమయింది.

వామనరావు వెంటనే తనక్కావలసిన బీరువాదగ్గరకు వెళ్ళాడు. దానికి నంబరు సిస్టం తాళం ఉంది. అందులో వరుసగా ఆరు నంబర్లు తిప్పాడు. బీరువా తెరుచుకుంది.

ఆయన హడావుడిగా ఉంగరాలకోసం చూశాడు. నాలుగుండవలసిన చోట మూడే ఉంగరాలున్నాయి.

అంటే వైకుంఠం నిజమే చెప్పాడన్నమాట!

కానీ—అదెలా సాధ్యం?

వామనరావాలోచిస్తూండగానే ఎక్కణ్ణించో సన్నగా మూలుగులా వినిపించింది. ఆయన ఉలిక్కిపడి అటు చూశాడు.

నేలమాళిగలో ఒక వ్యక్తి పడుకుని ఉన్నాడు. గోడ వారగా ఉన్న మూలాన అతణ్ణి వామనరావు గుర్తించ లేదు.

వామనరావు చటుక్కున బీరువామూసి ఆ వ్యక్తిని సమీపించి చూసి ఆశ్చర్యపోయాడు.

అతడు గణేశ్!

"నువ్విక్కడికెలా వచ్చావు?" అన్నాడు వామనరావా శ్చర్యంగా.

మాట్లాడే ఓపికలేదన్నట్లు గణేశ్ సైగచేశాడు. వామన రావతణ్ణి పరీక్షించి మనిషి బాగా నీరసంగా ఉన్నట్లు గ్రహించాడు. ఆ సమయంలో ఆయనలో మానవత్వం మేలుకుంది. అతణ్ణి మోసుకుని నేలమాళిగలోంచీ బయటకు వచ్చాడు. నేలమాళిగ ప్రవేశద్వారం మూసి—గణేశ్‌కి శీతలోపచారాలు చేశాడు. కొద్దిగా ఫలరసం పుచ్చుకున్నాక గణేశ్‌లో కాస్త ఓపిక వచ్చింది.

"ఎలా వచ్చావిక్కడికి? వచ్చిన వాడివెందుకు తప్పించుకోలేకపోయావు?" అన్నాడు వామనరావు.

"నాన్న మీ నేలమాళిగలోంచీ ఓ వజ్రపుటుంగరం తెచ్చాడు. అది చూసిన రాజేశ్వరి అలాంటిది తనకీ ఒకటి కావాలంది. నాన్ననడిగితే అదివ్వనన్నాడు. నేనే వెళ్ళి తెచ్చుకుంటానంటే—నీకు వెళ్ళడం మాత్రమే వచ్చు తిరిగి రావడం చేతకాదు. అది నేర్చుకునేదాకా వెళ్ళకు—అన్నాడాయన.

నేర్చుకుందామనుకునేలోగా నాన్నకు పక్షవాతం వచ్చింది. కొంతకాలం ఆయన జబ్బు హడావుడితో సరిపోయింది. రాజేశ్వరి ఉంగరం గురించి వారంరోజుల క్రితం మళ్ళీ అడిగింది. నేను నాన్నడిగితే—తను బాగా స్థిమితపడేదాకా తిరిగివచ్చే ఉపాయం నేర్పలేననీ ప్రస్తుతానికా ఉంగరం గురించి మర్చిపోమనీ అన్నాడు.

ఆయన మాట లెక్కచేయకుండా మూడురోజుల క్రితం నేలమాళిగలో ప్రవేశించాను. వెళ్ళినవాణ్ణి వెనక్కురాలేనా అనుకున్నాను కానీ రాలేకపోయాను. తిండీ తిప్పలూ లేక నీరసించి పడిపోయాను. సమయానికి దేవుడిలావచ్చి మీరు రక్షించారు—" అన్నాడు గణేశ్.

నేలమాళిగలో తన కొడుకు చిక్కుకుపోతాడని తెలిసే

వైకుంఠం తన్ను వాళ్ళింటికి పిలిచి ఉంగరం విషయంలో తనను సవాలు చేశాడని వామనరావు గ్రహించాడు.

"నా కొడుకు అభిమన్యుడిలాంటివాడు—" అని వైకుంఠం అనడం ఆయనకు గుర్తుకొచ్చింది.

గణేశ్ వామనరావు దగ్గిర సెలవు తీసుకుంటూ— "మీరు నా ప్రాణాలు రక్షించారు. మీ మనసుకు కష్టం కలిగించే పనేదీ చేయనని మాటిస్తున్నాను" అని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఓ గంటలో వామనరావు వైకుంఠం ఇంటికి వెళ్ళాడు—తన కూతుర్ని వాళ్ళింటికోడలిగా చేసుకోమని చెప్పడానికి!

ఆ తండ్రీ కొడుకుల అద్భుత శక్తులపై ఆయనకూ నమ్మకం కుదిరినట్లుంది. □

ట్రైనింగ్!



క్రైమ్ డైరెక్టర్

ఓ.వి.వి.సత్యనారాయణ

ఇన్‌స్పెక్టర్ రంజిత్ తన యింట్లో ఫైల్ చూసుకుంటు న్నాడు. మర్నాడు ఒక ముఖ్యమైన కేసు కోర్టులో విచారణ

వుంది. అతను రేపు కోర్టులో తాను చెప్పబోయే విషయాలను మరోసారి మననం చేసుకుంటూ లోపాలను పరిశీలించి సరిదిద్దుతున్నాడు.

గోడగడియారం పన్నెండు గంటలు కొట్టింది.

రంజిత్ ఫైల్స్ మూసి టీపాయ్‌మీద పెట్టి బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని పక్కమీదకి చేరాడు.

అతని భార్య పుట్టింటికి వెళ్ళింది!

రంజిత్ లైట్ ఆర్పబోతోంటే ఫోన్ అరవసాగింది.

రిసీవర్ అందుకుని 'హలో' అన్నాడు. పకపక నవ్వు విన్పించింది.

"ఇన్‌స్పెక్టర్ రంజిత్ స్పీకింగ్" అన్నాడు విసుగ్గా.

ఆ నవ్వు ఆగలేదు. క్రమేపీ ఏడ్పుగా మారింది. తర్వాత 'వద్దు....నన్ను చంపొద్దు....ప్లీజ్'అన్నమాటలు, పెద్దగా గావుకేక విన్పించాయి.

వెంటనే ఫోన్ డిస్కనెక్టు చేశాడు రంజిత్. అతని ఇంటికి గరల్స్ హాస్టల్ దగ్గిరే! ఇలా ఫోన్లు చెయ్యడం అమ్మాయిలకి పరిపాటి. తనకది అలవాటే!

అతను టీపాయ్‌మీద గ్లాసు అందుకుని మంచినీళ్ళు త్రాగాడు. లైట్ ఆర్పి పడుకున్నాడు. వెంటనే అతనికి నిద్రపట్టింది.

మరోగంటకి ఫోన్ అతన్ని నిద్రలేపింది. మత్తుగా రిసీవర్ తీసి 'హలో' అన్నాడు. మళ్ళీ అదే నవ్వు!

'వద్దు....నన్ను చంపొద్దు....నాకు చావాలని లేదు.... ప్లీజ్—నన్ను చంపకండి....'

రంజిత్ కోపంగా 'పోలీసులతో పరాచికాలు వద్దు. అది మీ భవిష్యత్తుకు మంచిదికాదమ్మాయిలూ' అన్నాడు.

తరువాత ఫోన్ డిస్కనెట్ చేశాడు. లైటార్పి పడుకున్నాడు.

2

మరో రెండురోజులు గడిచాయి.

రాత్రి సమయంలో వచ్చే ఫోన్‌కాల్స్ ఆగలేదు. మొదట సిల్లీగా తీసుకున్న రంజిత్ అయిదవరోజువకూడా అదే కాల్ వచ్చేసరికి ఊరుకోలేకపోయాడు.

ఏక్స్ఛేంజికి ఫోన్‌చేసి ఏ నెంబరునుంచి కాల్‌వచ్చిందో తెలుసుకున్నాడు. డైరెక్టర్‌లోంచి ఆ నెంబరుగల ఫోన్ ఉన్న ఇంటి అడ్రసును నోట్‌చేసుకున్నాడు.

మరునాడు ఆ అడ్రస్‌గల ఇంటికి వెళ్ళాడు రంజిత్. తాళంకప్ప తలుపుకు వ్రేలాడుతూ ఆహ్వానించింది.

ఆ ఇంటికి కొద్ది దూరంలోగాని ఇళ్ళులేవు. ఇంట్లో వాళ్ళు బయటకు వెళ్ళారా? లేక ఎవరూ లేరా? ఇంట్లోని ఆడవాళ్ళ సంగతిని తెలుసుకోవటం ఎలా?

ఒకసారి ఇంటిచుట్టూ తిరిగి వచ్చాడు. మళ్ళీ వద్దాంలే అని స్కూటర్ స్టార్ట్ చేయబోతుండగా ఒక రిక్షా ఆగింది ఇంటిముందు. అందులోనుండి ఎనభై ఏళ్ళాయన దిగాడు. రిక్షాకి డబ్బులిచ్చి పంపేసి రంజిత్‌ని అనుమానంగా చూస్తూ "ఏం కావాలి? ఎవరు మీరు?" అని అడిగాడు.

"సూర్యనారాయణ అంటే మీరేనా?"

"కాదు మా అబ్బాయి. ఏం? పోలీసులతో మా వాడికి పనేమిటి?" అన్నాడాయన రంజిత్‌ని ఎగాదిగా చూస్తూ.

రంజిత్ ఒక్కక్షణం ఆలోచించి అసలు విషయం చెప్పకూడదని నిర్ణయించుకున్నాడు.

"ఇక్కడ మా ఫ్రెండ్‌కోసం ఇల్లుని వెతుకుతున్నాను. మీ వాటాలో ఉందేమో కనుక్కోమని ఎవరో అంటే

వచ్చాను" అన్నాడు.

"లేదు. మరోచోట కెళ్ళండి" అని వెళ్ళిపోయా డాయన. రంజిత్ తిరిగి స్టేషనుకు వచ్చేశాడు.

3

ఆరోజు రాత్రి అదే ఫోన్....

రంజిత్ కోపాన్ని అణుచుకొని "చూడమ్మా. నువ్వు చూస్తే ఏదో సాంప్రదాయకమైన ఇంటికి చెందినదాని వన్పిస్తూంది. ఇలాంటి కొంటె అల్లరి చేయడం మంచిది కాదు. నీకు నావలన ఏదైనా సహాయం కావలిస్తే చెప్పు. చేస్తాను. అంతేకాని బాధ్యతలతో సతమతమయ్యే మా లాంటి వారిని అర్ధరాత్రి పడుకోనివ్వకుండా డిస్టర్బ చెయ్యడం భావ్యంకాదు" అన్నాడు శాంతంగా.

అవతల ఏడుపు ఆగిపోయింది. ఆ తర్వాత విన్పించింది 'ఏడూ....డేష్....పన్నెండు....డేష్....ఇరవై ఆరు బార్ రెండూ....బార్....ఏ.'

రంజిత్ ఆ నెంబరును వెంటనే నోట్ చేసుకుంటూ "అసలు విషయం చెప్పక ఈ గొడవేమిటి" అన్నాడు చికాకు గొంతులో ధ్వనించేలా. మళ్ళీ ఆ నెంబరును రిపీట్ చేసి ఫోన్ పెట్టేసింది అవతలామె.

రంజిత్ పడుకున్నాడు కాని నిద్రపట్టలేదు.

ఆమె చెప్పినది ఒక ఇంటినెంబరు అని తెలుసతనికి. ఎందుకామె అలా ఫోన్ చేస్తున్నది?

ఆమె ఏదేనా ఆపదలో ఉందా? ఆ ఇంట్లో వాళ్ళు తనకి హాని చేయబోతున్నారని గ్రహించి తనకు తెలియజేస్తోందా? తను ఉన్న ఇల్లు, తన పేరు చెప్పకుండా, నేరుగా పోలీస్ సహాయం తీసుకోదలుచుకోకుండా రహస్యంగా ఉండాలనా?

మరి ఆమె ఫోన్ చేసిన ఇల్లు!

మళ్ళీ లేచి ఎక్స్ఛేంజ్‌కి ఫోన్‌చేసి వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

అదే నెంబరు—అంటే అదే ఇల్లన్నమాట.

ఆమె చెప్పిన ఇంటి నెంబరు, ఆ ఫోన్‌గల ఇంటి నెంబరు ఒకటికాదు, ఆ విషయం అతను ముందే గ్రహించాడు.

మరి ఈ వ్యవహారం అంతా ఏమిటి?

రంజత్‌కి నిజంగా చికాకెత్తింది.

చాలాసేపటికి కాని అతను నిద్రపోలేదు

4

ఆ డోర్ నెంబరున్న ఇంటిముందు స్కూటర్ ఆపాడు రంజిత్. గేటు తీసుకుని లోపలికి వెళ్ళాడు.

ఒక యువకుడు ఎదురొచ్చాడు. తన పోలీస్ వేషం అతన్ని భయపెట్టిందని గ్రహించాడు రంజిత్.

ఇంటి బయట 'శ్రీనివాసరావు, మూవీ డైరెక్టర్' అని ఉండడాన్ని గుర్తుకు తెచ్చుకొని 'శ్రీనివాసరావు గారు కావాలి' అన్నాడు ఆ యువకునితో.

ఆ యువకుడు నమ్రతగా "సారీ సర్! ఆయన లొకేషన్స్ కోసం రాజమండ్రి వెళ్ళారు" అన్నాడు.

"ఈ ఇంట్లోనుండి మాకు ఫోన్ వచ్చింది. ఆవిడతో మాట్లాడాలి."

"ఆవిడ అంటున్నారు. మీతో మాట్లాడింది స్త్రీయా సార్"

"యస్"

"సారీసర్ ఈ ఇంట్లో ఆడవాళ్ళు ఎవరూ లేరు సార్"

"ఆయన ఎప్పుడు వస్తారు"

"నిన్ననే రావాలి. కాని రాలేదు. ఈరోజు రావచ్చు"

"ఇంతక్రితం ఒక అమ్మాయి ఈ ఇంట్లోకి వచ్చింది"

"సినిమా వేషాలకోసం రికమండేషన్లు పట్టుకుని చాలా మంది వస్తారు సార్. అయినా ఇందాకా వచ్చినది పని మనిషి సార్"

"నువ్వు ఇక్కడ ఏం పనిచేస్తున్నావ్"

"ఇంటి వ్యవహారాలన్నీ నేనే చూస్తాను"

రంజిత్ ఇక ఏ ప్రశ్నలు వేయకుండా బయటకు వచ్చేశాడు.

అక్కడినుండి నేరుగా ముందురోజు వెళ్ళిన ముసలాయన ఇంటికి కొంతదూరంలో స్కూటర్ ఆపి దిగాడు. ఆ ఇంటి గురించి అక్కడ ఎవరినైనా ఎంక్వయిరీ చేద్దామని అతని ఉద్దేశ్యం.

ఎదురుగా కూరలు అమ్ముతున్న కుర్రాడు కన్పించేసరికి ఐడియా వచ్చి "ఆ ఇంట్లో కూరలు తీసుకున్నారా" అని అడిగాడు ఇల్లుని చూపించి.

"ఇందాకానే ఇచ్చాను సార్" అన్నాడు వాడు భయంగా.

"రోజూ ఈ వీధిలో అమ్ముతావా?"

"అవును సార్! ఎందుకు సార్!"

వాడి భయానికి నవ్వుకుని "ఏం లేదులే. రోజూ ఆ ఇంట్లోవాళ్ళకి అమ్ముతున్నావా?"

"సాధారణంగా రెండురోజుల కోసారి తీసుకుంటారండి" అన్నాడు వాడు.

"ఆ ఇంట్లో వాళ్ళగురించి నీకేమన్నా తెలుసా?"

"తెలీదుసార్" అన్నాడు వాడు నొచ్చుకుంటూ.

"ఫరవాలేదులే. మరి కూరలు ఎవరు తీసుకుంటారు ఆ ఇంట్లో."

"ఆ ముసలాయన తీసుకుంటాడు. లేకపోతే ఆయన కొడుకనుకుంటా తీసుకుంటాడు."

"మరి ఆడవాళ్ళెవరూ తీసుకోరా?"

"అసలు ఆడవాళ్ళెవరూ ఆ ఇంట్లోంచి బయటికి రాగా నేను చూడలేదు సార్."

"అసలు ఆ ఇంట్లో ఆడవాళ్ళు లేరేమో!" రంజిత్ సాలోచనగా అన్నాడు.

"ఎందుకు లేరుసార్! లోపలినుండి నేను చాలాసార్లు మాటలు విన్నాను. అయినా ఆ తీగమీద చీరలు చూడలేదాండి మీరు."

వాడి ప్రశ్నకు రంజిత్ నవ్వి "నువ్వెళ్ళు" అని స్కూటర్ స్టార్ట్ చేశాడు.

ఆ కేసుపట్ల అతనికో ఐడియా కల్గింది.

5

"కానిస్టేబుల్ సమీరని పిలు."

సమీర వచ్చి సెల్యూట్ చేషింది.

"ప్లీజ్ టేక్ యువర్ సీట్"

అలా రంజిత్ అన్నాడంటే ఏదో చర్చించే విషయం ఉందని ఆమెకి తెలుసు కనుక మాట్లాడకుండా కూర్చుంది.

రంజిత్ విషయమంతా టూకీగా ఆమెకి చెప్పి చేయవలసిన పని వివరించాడు.

రంజిత్ ఫోన్‌తీసి ఒక నంబరుకు డయల్ చేశాడు. రింగ్ అయ్యాక సమీరకి ఇచ్చాడు.

అవతలవైపు మాట్లాడగానే "శ్రీనివాసరావుని పిలు" అంది ఆమె.

"ఆయన ఊర్లో లేరు"

"ఊరినుండి వచ్చాడని తెలుసు. ఫోన్ దగ్గరకు

రమ్మను. లేకపోతే చాలా ఇబ్బందిలో పడతాడని చెప్పు."

శ్రీనివాసరావు లైన్‌లోకి వచ్చాడు.

"నీకెన్నిసార్లు చెప్పాలి? నాతో పరాచికాలు ఆడకు" అని అవతలివైపు విన్పించేసరికి ఉలిక్కిపడి తమాయించు కుందామె.

"నాతో గొడవ పెట్టుకోవడం ప్రమాదం శ్రీనివాస రావ్" అంది గంభీరంగా.

"షటప్! నువ్వు ఎంత గొంతులు మార్చి మాట్లాడినా గుర్తించగలను. నీ బెదిరింపులకు లొంగను."

"లేకపోతే ఫలితం అనుభవిస్తావ్."

"నా భార్య డైరీ వ్రాయదు. ఒకవేళ వ్రాసినా నీకు పంపదు. పంపినా నాకు భయంలేదు."

"బుకాయించి లాభంలేదు. నీకు డైరీ ముఖ్యమో లక్ష రూపాయలు ముఖ్యమో తేల్చుకో" అంది అతని మాటల్ని అర్థం చేసుకుంటూ సమీర.

"ఓహో ....రేటు కూడా ఫిక్స్ చేసుకున్నావన్నమాట. సరే విను! పైసా ఇవ్వను. నువ్వేం చేసుకొంటావో చేసుకో! నా భార్య క్లాసుమేటువని చెప్పుకున్నావు కాబట్టి వదిలేస్తున్నాను. మరోసారి ఇలాంటి ప్రయత్నం చేశావా నిన్ను పోలీసులకు పట్టిస్తాను."

"ఆల్‌రైట్! రేపు నీ భార్యది హత్యా? ఆత్మహత్యా? అనే హెడ్డింగుతో న్యూస్ వస్తుంది. మిగిలిన విషయా లన్నీ ఎలావున్నా రాణి తండ్రి నిన్ను గడప తొక్క నివ్వడు. ఆలోచించుకో."

ఒక్క క్షణం అవతలవైపు నిశ్శబ్దం.

ఆ సంభాషణని వింటున్న రంజిత్ ఆమె తెలివితేటల్ని మనసులో మెచ్చుకున్నాడు. సమీర కరాటే వంటి విద్యల్లో

ఆరితేరినదని మాత్రమే అతనికి తెలుసు. ఆమె తెలివి తేటల్ని, సమయస్ఫూర్తిని ప్రత్యక్షంగా గమనించా డతను.

కేసులో ఇంప్రూవ్‌మెంటు కన్పించేసరికి రంజిత్‌కి మరింత ఉత్సాహం వచ్చింది. ఫోన్‌లో మాటలు విన సాగాడు జాగత్తగా. "సరే? నీకు కావలసినది లక్ష రూపాయలేగా! మా ఇంటికి వచ్చేయ్ ఇస్తాను."

"నన్ను తక్కువగా అంచనా వేస్తున్నావ్ శ్రీనివాస రావ్! పానగల్‌పార్క్ గేట్ దగ్గరకు సరిగ్గా రేపు సాయంత్రం ఆరున్నరకు రావాలి. మనమధ్య పోలీసులొద్దు. రిమంబర్" అంటూ ఫోన్ పెట్టేసింది.

"సో....శ్రీనివాసరావుని ఎవరో అమ్మాయి బ్లాక్ మెయిల్ చేస్తోందన్నమాట. బాగుంది. ఆ ఫోన్ నేను చేసి ఉంటే ఇంత ఇన్ఫర్‌మేషన్ మనకి దొరికేదికాదు. నీ చేత ఫోన్ చెయ్యడం, ఎవరో అమ్మాయి బ్లాక్‌మెయిలు చెయ్యడం కాకతాళీయంగా కోయిన్సైడు అయ్యాయి" అన్నాడు రంజిత్.

"రేపు శ్రీనివాసరావ్ డబ్బు తీసుకుని వస్తే అతను నేరం చేసినట్టే" అంది సమీర. రంజిత్ తల వూపాడు.

"అతను పోలీసుల సహాయం తీసుకొంటాడేమో!"

రంజిత్ తల అడ్డంగా తిప్పి "తీసుకోడని నా నమ్మకం" అన్నాడు.

"అసలు శ్రీనివాసరావుమీద మీకు అనుమానం ఎందుకు కలిగింది?...."

రంజిత్ సవివరంగా ఆమెకు చెప్పసాగాడు:

ఆ మధ్య శ్రీనివాసరావుకు తమిళ నటి కమలారాణికి సంబంధాలున్నాయని, తాను డైరక్ట్ చేసే సినిమాలలో

ఆమెనే హీరోయిన్‌గా పెట్టాలని తన నిర్మాతలని ఒత్తిడి చేస్తున్నాడని ఒక సినిమా పత్రికలో నాకు చదివినట్టుగా గుర్తు. అఫ్‌కోర్స్ అది గాసిప్స్ వ్రాసే పత్రికే! కానీ నేనీ మధ్య అబ్జర్వ్‌చేశాను. గాసిప్స్‌గా వచ్చినవి చాలా వరకూ నిజమైన సందర్భాలున్నాయి.

ప్రస్తుత విషయమే తీసుకొంటే ఈమధ్య శ్రీనివాసరావు డైరెక్ట్‌చేస్తున్న సినిమాలలో ఎక్కువ హీరోయిన్‌గా రాణి వుంటోంది. త్వరలో శ్రీనివాసరావు సొంతంగా తీయబోయే చిత్రంలో కూడా ఆమెయే హీరోయిన్.

ఇక ఆరునెలల క్రితం శ్రీనివాసరావు భార్య కామెర్ల వ్యాధితో మరణించిందని మనకి తెలుసుకదా! నాకు వచ్చిన కాల్స్‌నిబట్టి నాకో విషయం అవగాహన అయింది. శ్రీనివాసరావు తన భార్యని హత్యచేశాడు. ఆ విషయం మరొకామె పసిగట్టింది. ఆమె శ్రీనివాసరావుని బ్లాక్ మెయిల్ చేస్తోంది. ఇక్కడ తేలవలసినది మనకి ఫోన్ చేసింది ఆమెయేనా అని."

"అది తేలడంవలన లాభం ఏమిటి?"

"ఇద్దరూ ఒకరే అని తెలితే ఆమె బ్లాక్‌మెయిలర్ కాదని తేల్తుంది."

"అదెలా?"

"నాకు ఫోన్‌చేసినామె ఇంటి పరిస్థితిని పూర్తిగా గమనించాను. ఆమెది ఒక ఆర్థడాక్స్ ఫ్యామిలీ. ఆమెకి శ్రీనివాసరావు విషయం తెలిసింది కనుక ఒకప్రక్క అతన్ని బెదిరించి పీక్ చేస్తోంది. మరో ప్రక్క నన్ను మూవ్ చేస్తోంది.

"ఆర్థడాక్స్ ఫ్యామిలీ లేడీకి అసలీ హత్య విషయం

ఎలా తెలుసని?" రంజిత్ నవ్వాడు.

"యూ ఆర్ రైట్! కాని ఆమె ఈ శ్రీనివాసరావు భార్యకు ఫ్రెండ్ కావచ్చుగా. ఆమె నిజంగా బ్లాక్‌మెయిలర్ అయివుంటే ఈపాటికి అతనికి ఆ డైరీ అందేది. ఆమెకి డబ్బు దక్కేది."

"ఇదంతా కేవలం ఊహ మాత్రమే నన్నమాట...."

"ఊహలతోటే కేసులు ముందుకు నడుస్తాయి."

"నిజమే. అసలీ శ్రీనివాసరావు హత్య చేశాడా? చేసి ఉంటే ఎలా నిరూపించగలం?"

"అదే కష్టమైన విషయం. శ్రీనివాసరావు భార్య సహజంగా మరణించలేదన్నది డౌట్‌లెస్. ఆమె చనిపోయి చాలాకాలం అయింది. ఇప్పుడు ఆధారాలు, సాక్ష్యాలు ఏముంటాయని?"

"ఒకవేళ నిజంగానే డైరీ ఆ అమ్మాయి దగ్గర ఉందేమో!"

"ఉండవచ్చు. అదీ ఆలోచిద్దాం. మనవైపు మన ప్రయత్నం చేద్దాం."

"మరో డౌట్. అసలీ శ్రీనివాసరావుకి భార్యని చంపాల్సిన అవసరమేముందోనని...."

"కమలారాణి తండ్రి పెద్ద పారిశ్రామికవేత్త. కోటీశ్వరుడు. శ్రీనివాసరావు మంచి నటుడు, డైరెక్టరు. అతను తీసిన క్రైమ్ చిత్రాలు ఇంచుమించుగా విజయం సాధించాయి. క్రైమ్ డైరెక్టరుగా అతనికి ఫీల్డ్‌లో పేరుంది. ఇంకా ముప్పై దాటని శ్రీనివాసరావు ఆ కోటీశ్వరుడ్ని ఆకట్టుకున్నాడనడానికి బెస్ట్ ఎగ్జాంపుల్ శ్రీనివాసరావు రేపు జనవరిలో ప్రారంభిస్తున్న సినీ స్టూడియోకి పెట్టుబడిదారుడు కమలారాణి తండ్రి కావటం."

"మీకు సినిమా పరిజ్ఞానం బాగా వుందే."

"నేను సినిమా పత్రికలని ఆసక్తిగా చదువుతాను. కనుకనే లాస్ట్ ఇయర్ ఒక మర్డర్ కేసులో ఇరుక్కున్న ఒక యాక్టర్‌ని నిర్దోషిగా తేల్చగలిగాను. ఎలాగో తెలుసా? అతను మర్డర్ జరిగిన టైములో ఒక శతదినోత్సవ సభలో ఉండడం. ఆ సభకు బందోబస్తు ఏర్పాటు చేసిన నేను ఆ సభలో అతన్ని చూడడం జరిగింది. జోక్ ఏమిటంటే ఈ విషయం కేసు సగంపైన నడిచేదాకా మాకు గుర్తులేదు. దేర్ టూ ఈ విషయం ఒక పాత పత్రిక తిరగేస్తూ నేను ముందుగా గమనించాను. మన డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేవాళ్ళు ప్రతీ విషయాన్ని తెలుసుకోవాలంటాను నేను" అని నవ్వాడు.

"నిజమే. అయితే సార్! డబ్బుకోసం శ్రీనివాసరావు తన భార్యని చంపాడంటారు."

"అనుకొంటున్నాను. ఆధారాలు దొరికేదాకా ఫైనల్ డెసిషన్‌కి రాకూడదు."

6

రంజిత్ శ్రీనివాసరావు కేసుని ఓ పట్టాన వదలదలుచుకోలేదు. వీలయినంత విషయాన్ని సేకరిస్తున్నాడు. రెండుగంటలవాకా వానా హైరానాపడి స్టేషన్‌కి వచ్చాడు. చూడాల్సిన చిన్న పనులు చూశాడు.

రెండు ఫ్యామిలీలమధ్య గొడవ....స్వంత తమ్ముడు తన్న అన్నగారిపై కేసు! అన్నగారు కొట్టాడుట.

రంజిత్ ఆ తమ్ముడికి నచ్చజెప్పబోయాడు. వినలేదు. మీ ఖర్మ అనుకుని "కేసు వ్రాసివ్వండి. ఆ రూమ్‌లోకి వెళ్ళండి" అన్నాడు.

మరొకటి పిక్‌పాకెటింగ్! జనాలు వాడ్ని చావగొట్టి

స్టేషన్‌కు తీసుకువచ్చారు. వస్తువులు దొరకనే దొరికాయి. ఆ పని గంగులుగాడిదని రంజిత్‌కి అర్థమైపోయింది. ఎవరో వెర్రివాడ్ని జనాలు పట్టుకొచ్చారు.

వాడ్ని అక్కడే ఉంచి, జనాలను సర్దుబాటు చేసి పంపాడు రంజత్. వాడికి ఇరవై లోపే వయసు! సన్నగా పీలగా ఉన్నాడు వాడికి దొంగతనంచేసే ఓపిక కూడా లేదు.

అంతలో ఒకామె యేడుస్తూ కానిస్టేబుల్‌ని తోసు కుంటూ వచ్చి రంజిత్ కాళ్ళమీద పడి "బాబూ! నా తమ్ముడ్ని వదిలేయండి. వాడేమీ చేయలేదు బాబూ!" అంది.

రంజిత్ లేచి విసుగ్గా "ఈవిడ్ని బయటకు పంపించు" సమీరా" అన్నాడు. సమీరా ఆమెని లేవదీసింది.

ఆమె మరింత ఏడ్వసాగింది. ఆమె ముఖం చూసిన రంజిత్‌కి హఠాత్తుగా ఆమె ముఖాన్ని ఎక్కడ చూశాడో గుర్తొచ్చింది.

"నీ పేరు ఏమిటి?"

"రావులమ్మ."

"ఏం చేస్తున్నావ్?"

"శ్రీనివాసరావుగారనే డైరెక్టర్‌గారింట్లో పని చేస్తు న్నాను."

"ఎన్నాళ్ళ నుండి?"

"నాలుగేళ్ళ నుండి బాబూ!"

రంజిత్ ఈ కాకతాళీయమైన సంఘటనలకి ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు. "శ్రీనివాసరావ్! నిజంగా నువ్వే హంతకుడివే అయితే నువ్వెంతటివాడివైనా నీకు శిక్ష వేయిస్తాను" అనుకున్నాడు మనసులో. మరో కానిస్టేబుల్ని

పిలిచి "గంగుల్ని తెచ్చి లోపలపడెయ్" అని ఆజ్ఞాపించాడు. వాడికోసారి బుద్ధి చెప్పకపోతే ఇలాంటి అమాయకులు శిక్షలనుభవిస్తారు.

"చూడు రావులమ్మా! నీ తమ్ముడు నేరం చేశాడనే వాళ్ళు రిపోర్టు చేశారు. అందుకని వాడిని విడుదల చెయ్యను" అన్నాడు రంజిత్.

రావులమ్మ మరోసారి ఏడవసాగింది.

"అరవకు. నే చెప్పిన పనిని చేస్తే నీ తమ్ముడ్ని వదిలేస్తాను. వాడు మూడునెలలవాకా ఏ వూరూ వెళ్ళకూడదు. వారానికోసారి స్టేషన్‌కు రావాలి. కేసు లేకుండా నేను చూస్తాను."

ఆమె ఆనందంగా తలూపింది కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ.

"మీ అయ్యగారు అమ్మగారిని కొట్టేవాడా?"

"కొట్టేవారండి! ఆయన అవుట్‌డోర్ షూటింగ్ కెళ్ళారంటే అమ్మగారికి పండగేనండి."

"ఎందుకు కొట్టేవాడాయన?"

"ఎందుకో తెలవదండి! కాని అమ్మగారు చిత్రహింసలు పడేవారండి. కనీసం తన బాధని చెప్పుకోవాలని కూడా ఆమెకి తెలవదండి. నాకు కూడా చెప్పేవారు కాదండి. నేను చానాసార్లు చూసినానండి."

శ్రీనివాసరావు పాపం పండిందన్నమాట! రంజిత్ ఆమెని పంపించేశాడు. "సమీరా! ఈమెని కోర్టులో తగిన సాక్ష్యం ఇచ్చేలా ట్రైనప్ చెయ్యాలి నువ్వు. మిగిలినవి నేను చూసుకుంటాను" అన్నాడు.

"ఓకే సార్!" అంది సమీరా ఉత్సాహంగా.

"సాయంత్రం పానగల్ పార్కుకి వెళ్లాలా సార్!"

అని అడిగింది మళ్ళీ. ఆమెని కూర్చోబెట్టి చేయవలసింది వివరంగా చెప్పసాగాడు.

7

పానగల్ పార్కు....

సమయం ఆరు దాటింది.

గేట్ దగ్గిర కారు ఆగగానే సమీర కారువద్దకు వెళ్ళి బాక్ సీట్లో శ్రీనివాసరావుని చూసి కారెక్కింది. కారు ముందుకు కదిలింది.

"ఏదీ డైరీ....?" అని అడిగాడు శ్రీనివాసరావు చేయి చాపి.

చేతిసంచీలోని ఒక డైరీని తీసి చూపించి "డబ్బు తెచ్చావా!" అని అడిగింది.

"షటప్! నీకు మర్యాద అసలు తెలియదా?" అన్నాడు శ్రీనివాసరావు.

"నోర్ముయ్? హత్యలు చేసేవాడికి కూడా మర్యాద కావాలన్నమాట...." అంది సమీరా మరింత కోపం నటిస్తూ.

"ఏమన్నావ్" అని ఆమె చెంప పగలగొట్టాడతను. అంత సులభంగా అతను ఇరిటేట్ అవడంతో ఆమె సంతోషించింది. ఊహించని రీతిలో అతని మెడమీద ఒక కిక్ ఇచ్చింది. ఆ దెబ్బకు నక్షత్రాలను దర్శించుకున్నాడు అతను ఒక పెద్ద కేకతో.

ఆ అరుపుకు డ్రైవరు కంగారుపడి వెనక్కి తిరిగిచూసి కారుకు సడన్ బ్రేక్ వేశాడు.

వెనుక వస్తున్న కార్లు వరుసగా ఒకదాని కొకటి గుద్దుకొనటంతో పెద్ద గలాభా జరిగింది.

పథకం ప్రకారం వెనుక వస్తున్న పోలీసులు జోక్యం

కల్పించుకుని డ్రైవర్ని, సమీరని, శ్రీనివారావుని కారుతో సహా స్టేషన్కు తీసుకునివచ్చారు.

శ్రీనివాసరావుకి మైకంవదిలి తాను పోలీస్స్టేషన్లో ఉన్నట్లు తెలుసుకున్నాడు.

"నన్నిక్కడికి ఎందుకు తీసుకువచ్చారు?"

"మీ భార్య పేరు శ్వేత కదూ!"

"అవును. ఆ విషయం యెందుకు?" అసహనంగా అడిగాడు శ్రీనివాసరావు.

"మీ భార్య ఎందుకు చనిపోయింది?"

"ఆ విషయాన్ని ఆమెని పుట్టించిన దేవుడ్ని అడగాలి. ఎలా చనిపోయిందో మాత్రమే నాకు తెలుసు."

"అది చెప్పండైతే."

"కామెర్లవలన చనిపోయింది."

"మీ ఫ్యామిలీ డాక్టరు పేరేమిటి?"

"డాక్టర్ రామనాధన్."

"ఐ.సీ. ఆమె యెవరు?" రంజిత్ సమీరని చూపిస్తూ అడిగాడు.

"నాకు తెలియదు" విసురుగా అన్నాడు శ్రీనివాసరావు.

"మరి ఆమె మీ కారులో ఎందుకుంది?"

"వాడ్డూ యూ మిన్? జాలి తలచి లిఫ్ట్ యివ్వడం తప్పంటారా?"

"తప్పు లేదు. మరి ఆమె మిమ్మల్ని యెందుకు కొట్టింది?"

"లిఫ్ట్ అడిగితే ఎక్కమన్నాను. కాని నన్ను కొట్టి నా డబ్బు దొంగిలించబోయింది. సమయానికి మీ పోలీసులు సేవ్ చేసినందుకు థాంక్స్."

"ఆమె మిమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఒప్పుకుంది."

"నో....నో....ఆమె నన్ను బ్లాక్‌మెయిల్ చెయ్యడమేమిటి? ఎందుకుట?"

"మీరు మీ భార్యని చంపారట. ఆ విషయం ఆమెకి తెలుసుట."

శ్రీనివాసరావు గట్టిగా నవ్వాడు. "ఇదేప్పే జోక్. ఇంకా యేం చెప్పింది? అందుకు ఆధారం ఏమిటట!"

"ఏం. ఆధారం ఉంటే హత్య చేశావని ఒప్పుకుంటారా?"

రంజిత్ ప్రశ్నకి శ్రీనివాసరావు ముఖం కందగడ్డ అయింది.

"సీ మిస్టర్ ఇనస్పెక్టర్. నా గురించి మీకు తెలుసా? నేనెవరినో మీకు తెలుసా" అని సీరియస్‌గా అడిగాడు.

"ఈ డైలాగ్‌ని విలన్‌చేత క్లైమాక్స్‌లో హీరోని అడిగిస్తారు మీరు సినిమాల్లో."

"బీ సీరియస్ ఇనస్పెక్టర్."

"అలాగా! నేనూ సీరియస్‌గా అడుగుతున్నాను. ఆమె మిమ్మల్ని బ్లాక్‌మెయిల్ చెయ్యడం నిజమేనా?"

శ్రీనివాసరావు సమీర వైపు చూసి "అదేం నిజంకాదు" అన్నాడు. రంజిత్ వెనుకనున్న సమీర "డబ్బులిస్తే నిజం చెప్పను" అన్నట్లుగా డైరీని సంచీలోనుండి కొద్దిగా చూపించి లోపలికి తోస్తూ సైగచేసింది.

శ్రీనివాసరావు అలాగే అన్నట్లు తలూపి "ఏమాత్రం నిజంకాదు" అన్నాడు మరోసారి.

"అలాగే! ఈ లక్షరూపాయలు మీ దగ్గర ఎందుకున్నాయి?"

''అలా ఉండడం నేరమా?''

''కాదు కాని మీ కేసు మాకు అనుమానంగా వుంది. మిమ్మల్ని అరెస్టు చేస్తాము.''

''ఎందుకని''

''బ్లాక్ మెయిలర్‌ని సపోర్టు చేస్తున్నందుకు.''

''ఆమె బ్లాక్ మెయిలర్ కాదే!''

''ఆమె మేము గాలిస్తున్న బ్లాక్ మెయిలర్స్‌లో ఒకరు''

శ్రీనివాసరావు ఇరుకున పడ్డాడు. ఏమి మాట్లాడాలో అతనికి తెలీలేదు. అయినా ధైర్యం తెచ్చుకున్నాడు.

''ఆమె బ్లాక్ మెయిలర్ అన్నది నిజం కావచ్చు. నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యడం లేదన్నది కూడా నిజమే.''

''అలాగా మరి ఆ విషయాన్ని ఒప్పుకుందామె.''

''మీరు ఒప్పించారు బలవంతంగా.''

''సరే.'ప్రమాదంలో చిన్నది' అనే చిత్రానికి షూటింగ్ ఎందుకు కేన్సిల్ చేసుకున్నారు? మీరీ సాయంత్రం పానగల్‌పార్క్ వైపుకెందుకొచ్చారు? ఈ రోజు ఆంధ్రా బ్యాంకునుండి లక్షరూపాయలు ఎందుకు విత్‌డ్రా చేశారు? ఈ ప్రశ్నలకి జవాబులు చెప్పాల్సివుంది. అంతేకాదు ఆ డబ్బు మీ వద్ద ఇప్పుడెందుకుందో కూడా చెప్పండి.''

''మిస్టర్ ఇనస్పెక్టర్. ఈ కారణాలనిబట్టి హంతకుని గా నన్ను అరెస్టు చేస్తారా?''

''మీరు క్రైం చిత్రాల డైరక్టర్ కదా! బ్లాక్ మెయిలర్ లతో చేతులు కలపడం ఎంత నేరమో మీకు తెలీదా?''

''చెప్పానుగా ఆమె ఎవరో నాకు తెలియదని. ఓకే. ఇనస్పెక్టర్ మీరు నా మీద కేసు బుక్ చేసుకోండి. నేను నా తరఫున లాయర్ని ఏర్పాటుచేసుకున్నాను. ఆయనకో సారి ఫోన్ చేసుకోనివ్వండి. మీ పద్ధతి చూస్తే నా భార్యని

నేనే హత్య చేయించానని ఒప్పించేలా ఉన్నారు''. అన్నాడు శ్రీనివాసరావు లేస్తూ.

8

రంజిత్ పడుకున్నాడు కాని నిద్రపట్టడంలేదు.

శ్రీనివాసరావు పరపతున్న మనిషి. డబ్బుల్ని విర జిమ్మి కేసుని మాఫీ చేసుకుంటాడు. అతని నేరాన్ని బయట పెట్టించడం ఎలా?

అతని పనిమనిషి కోర్టులో సాక్ష్యం చెబుతుంది. కాని శ్రీనివాసరావు భార్యని హత్య చేశాడన్నది ఆమె చెప్పదు. భార్యని అతను బాధించాడన్నది మాత్రమే ఆమె చెప్ప గల్గేది.

శ్రీనివాసరావు రేపు బెయిల్‌మీద విడుదలవుతాడు. తను చేసిన పనివలన శ్రీనివాసరావుని బోను ఎక్కించ గలడేకాని, అతను భార్యని హత్యచేసినట్లు నిరూపించ లేడు.

అసలు ఇంత రిస్కుని ఎందుకు తీసుకున్నాడు తను? ఒక నేరస్తుడు చట్టం దృష్టిలోనుండి తప్పించుకో కూడ దన్న నైతిక సూత్రానికి తాను కట్టుబడి పనిచేయడం వలన!

కాని శ్రీనివాసరావు హత్య చేయలేదేమో!

తనది కేవలం అనుమానమేమో. ఏవేవో ఊహించుకుని తను తొందరపడ్డాడేమో.

అదే నిజమైతే తను క్షమార్హుడుకాడు!

కాని—ఈ శ్రీనివాసరావు నేరం చేశాడన్నది నిజం. అది నిరూపణకావాలి. శ్రీనివాసరావు ఫ్యామిలీ డాక్టర్, పనిమనిషి ఇచ్చిన సాక్ష్యాలు క్షణంలో తలక్రిందులు కావచ్చు.

ఇప్పుడెలా!

ఈ విషయాన్ని ముందుగా ఆలోచించలేదు. సామాన్యుడు చిన్న నేరం చేసినా పెద్దదిగా పరిగణించే ఈ పోలీసు జులుం పెద్ద నేరాలు చేసిన ధనవంతుల్ని కొమ్ము కాస్తోందనేది తను చెప్పకూడని బహిరంగ రహస్యం. ఎంతో మంది చట్టంముందు నిర్దోషులుగా విడుదలై వచ్చేస్తున్న వారు బడా నేరస్తులే!

ఈ సమాజం ఆదరిస్తున్నది ఆ బడా నేరస్తుల్నే! ప్రతీ వాళ్ళు నీతిపాఠాలు వల్లించేవారే! కాని పబ్లిగ్గా జరిగే నేరాలని ఎత్తి చూపడానికి, సాక్ష్యాధారాలివ్వడానికి ముందు కొచ్చేవారు ఎందరు?

రంజిత్ తన ఆలోచనలకి తానే నవ్వుకున్నాడు.

ఈ ఆలోచనలు శ్రీనివాసరావుని నేరస్తుడిగా నిరూపిస్తాయా!

ఒకలా చేస్తే!

ఫలితం ఉండకపోవచ్చు.

పోనీ లాస్ట్ రిసార్ట్‌గా ట్రైచేద్దాం అనుకున్నాడు రంజిత్. వెంటనే ఫోన్ తీసి డయల్ చేసి "సూర్యనారాయణగారున్నారా?" అని అడిగాడు.

"లేరండి. మీరెవరు" అని అడిగిందొక తీయనిగొంతు.

"ఎస్సై రంజిత్‌ని మాట్లాడుతున్నాను" అన్నాడు.

"ఏమిటిపని?"

"మీరెవరో తెలుసుకోవచ్చా?"

"ఎందుకు బుద్ధుడుగారూ!"

ఉలిక్కిపడ్డాడు రంజిత్. తను కాలేజ్‌లో చదువుకునేటప్పుడు తనని అలా నిక్‌నేమ్‌తో పిలిచేవారు ఫ్రెండ్స్. కాని అలా పిలిచే అమ్మాయి ఎవరు?....ధీరజ! యస్....

ధీరజ....

"హలో ధీరజా! నువ్వా?"

"ఇప్పటికి గుర్తుకొచ్చానా బుద్ధూ! అంత టెన్షన్ పడుతూ అవస్థలు పడేకంటే ఈ పని ముందే చెయ్యొచ్చుగా"

"ఆలోచనరాలేదు అనుకోకు. నేను ఫోన్‌చేస్తే నీకు ఇబ్బంది అవుతుందని అనుకున్నాను".

"కొయ్! కొయ్! కోతలు. నీ కెందుకాపేరు పెట్టామో నీ కిప్పటికైనా తెలిసిందా?"

"సర్లే. అసలు విషయం చెప్పు".

"మీ కానిస్టేబుల్ సమీర నీకంటే కాస్త ముందుందిలే! నా స్నేహితురాలినని చెప్పి వచ్చింది. ఆమె కాసేపట్లో నీకు అన్ని వివరాలు చెపుతుంది. అవతల మా మామగారు భోజనంచేసి వస్తున్నట్టున్నారు. బై" అవతల ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

రంజిత్ పక్కమీంచి లేచి తలుపుతీసి ఎదురుచూడసాగాడు.

అతనిలోని ఆత్రుత అతనిని నిలవనీయటంలేదు. ధీరజ ఇవ్వబోయే ఇన్ఫరమేషన్ ఏమిటి? దానితో శ్రీనివాస రావుని తాను నేరస్తుడుగా నిరూపించగలడా?

ధీరజకి, శ్రీనివాసరావుకి, అతనిభార్య శ్వేతకి ఏమిటి సంబంధం? అతని ఆలోచనలని అడ్డుకుంటూ సమీర టి.వి.యస్. ను రంజిత్ ఇంటిముందు ఆపి పెనుగాలిలా దూసుకు వచ్చింది.

"సక్సెస్‌సార్! ఇక మీ విచారాన్ని కట్టిపెట్టి నిశ్చింతగా పడుకోండి. తిరుగులేని సాక్ష్యాన్ని సంపాదించాను"అంది.

రంజిత్ ఆత్రుతగా "ఏమిటది" అన్నాడు లోపలికి దారితీస్తూ.

ఇద్దరూ కూర్చున్నారు.

"ఆమె....అదే....మీకు ఫోన్ చేసినామె ఎవరను కున్నారు?" అంది బ్యాగ్ తీస్తూ.

"ఆ విషయం నాకు తెలుసు సమీరా! ఆమె ఫోన్ చేసింది. అసలు సంగతి...."

అతని ఆత్రుతని సమీర గ్రహించుకుంది. "ఈ లెటర్ ఆమె మీకిమ్మంది. దానితోపాటు ఇదిగో ఈ కవర్ ఇమ్మంది. ఇందులో శ్వేత మీ ఫ్రెండ్ ధీరజకి వ్రాసిన చాలా లెటర్స్ ఉన్నాయిట. అవే మనకి కావల్సినసాక్ష్యం" అంది.

రంజిత్ లెటర్ తీసి చదవసాగాడు.

"డియర్ బుద్ధూ!

చనిపోయిన శ్రీనివాసరావుభార్య నా ఫ్రెండ్. ఎల్.కె.జి నుండి బి.ఎల్ వరకు ఇద్దరం క్లాసుమేట్సుమే. ఇద్దరమూ లా పూర్తిచేసి కలిసి ప్రాక్టీసు పెడదామనుకుని ఎన్నో కలలు కనేవాళ్ళం. కాని దురదృష్టవశాత్తు ఇద్దరమూ చదువు డిస్కంటిన్యూ చేసి వంటింటి కుందేళ్ళం అయి పోయాము.

మా వారు చాలా మంచివారు. కాని మా మామగారు మహా ఛాందసులు. ఆడవాళ్ళని గుమ్మం దాటనివ్వడాయన. ఈ వృద్ధ్యాప్యంలో ఆయనని బాధపెట్టడం ఇష్టంలేక నేనూ, మా అత్తగారు సర్దుకుని పోతున్నాము. ఆ ఒక్క విషయం తీసేస్తే మిగిలిన విషయాల్లో నాకే లోటు లేదు.

కాని నేను బాధపడేది నా స్నేహితురాలిగురించే! ఆమె బావ ఎమ్.బి.బి.ఎస్ లో చేరగానే శ్వేతతో వివాహం అను కున్నారు. శ్వేత తల్లిదండ్రులే ఆమె బావని చదివించింది. అయితే అతను వేరే అమ్మాయిని ప్రేమించడంతో

గందరగోళం ఏర్పడి, పంతాలు పెరిగి చివరికి శ్రీనివాస రావుతో శ్వేత పెళ్ళి హఠాత్తుగా అయిపోయింది.

ఆదర్శగృహిణిగా బ్రతకాలని ఉవ్విళ్లూరిన నా ఫ్రెండ్‌ని డబ్బు మనిషిఅయిన ఈ శ్రీనివాసరావు నానాబాధలు పెట్టాడు. చిత్రహింసలపాలు చేశాడు. "సి బావతో కులికి ఆ తర్వాత నన్ను పెళ్ళి చేసుకున్నావా?" అని తిట్టేవాడట. తన బాధని తల్లిదండ్రులకి చెప్పుకుంటే వాళ్ళు అల్లుణ్ని సమర్థిస్తూ కూతుర్ని కేకలేసేవారట! స్వంత అన్నగారు కూడా బావగారు చూపించిన చిన్న చిన్న వేషాలకి కక్కుర్తిపడి చెల్లెలినే తిట్టాడుట.

పెళ్ళయి ఈ ఊరొచ్చిన రెండేళ్ళలో ఆమె ఒకసారి కూడా మా యింటికి రాలేకపోయింది. ఆమె ఎన్ని నరక బాధలు పడిందో ఆమె నాకు వ్రాసిన ఉత్తరాల్లో ఉంది. నేను ఆమెని చూడడానికి వెళ్ళడానికి మా యింట్లో ఒప్పు కోరు. ఎలాగైతేనేం ఒకసారి వెళ్ళాను. అప్పుడు ఈ శ్రీనివాసరావు అవుట్‌డోర్ షూటింగ్‌లో ఉన్నాడు.

నా శ్వేత నన్ను కావలించుకుని ఏడ్చిన ఏడుపు అంతా ఇంతాకాదు. తన బాధని చెప్పుకోవడానికి ఆ ఇంట్లో ఎవరూ లేరు. గుమ్మం కదలకుండా ఆ పి.ఎ. గాడి కాపలా! శ్రీనివాసరావు త్రాగుబోతు! సినిమాలలో ఏదో చిన్న వేషం ఇవ్వడం! తర్వాత ఆ అమ్మాయిని రాత్రి ఇంటికి తీసుకురావడం! ఇటువంటివాడు నా శ్వేతని చంపేస్తాడేమో నని భయపడుతూనే ఉన్నాను.

నేను డెలివరీకి మా గ్రామం వెళ్ళి తిరిగి వచ్చేసరికి ఆరునెలలు పట్టింది. శ్వేత చనిపోయిందని నాకు వచ్చాకా తెలిసింది (పాత న్యూస్‌పేపర్లు తిరగవేస్తూంటే!) ఆమె వ్రాసిన ఉత్తరాలు మా అత్తగారు జాగ్రత్తపరచి నా

కిచ్చారు.

శ్వేతకి పచ్చకామెర్లు. డాక్టరుచేత అతిశ్రద్ధగా వైద్యం చేయించేవాడు శ్రీనివాసరావు. అందరికీ అదే తెలుస్తుంది. కాని ఆ మందులు వాడనివ్వలేదని, డాక్టర్‌కి శ్వేతపట్ల చెడు అభిప్రాయం కల్గేలా, వట్టి తిండిపోతు అన్పించేలా ఆ రాక్షసుడు చిత్రీకరించాడని. తనచేత ఆవకాయని బలవంతంగా తినిపించేవాడని శ్వేత నాకు ఉత్తరాల్లో వ్రాసింది. అతను ఆమెని ఎన్ని చిత్రహింసలు పెట్టాడో చదువు నీకే తెలుస్తుంది.

శ్వేత వ్రాసిన ఉత్తరాల్లో కొన్ని శ్రీనివాసరావు లెటర్ హెడ్ మీద వ్రాసినవి. ఈ ఉత్తరాలవలన శ్రీనివాసరావు తప్పించుకోలేడు. అంతేకాదు క్రింద శ్వేత పేరెంట్స్ అడ్రస్ వ్రాశాను. వాళ్ళని అవసరమైతే కన్విన్స్‌చేసి తీసుకురా! శ్రీనివాసరావుకి శిక్ష పడాలి! నా స్నేహితురాలి ఆత్మకి శాంతి చేకూరాలి!।

శ్రీనివాసరావుకి డబ్బుంది. హోదా వుంది! అతనిచ్చే డబ్బుకి కక్కుర్తిపడి మీ పోలీసులు నా ఫ్రెండ్‌కి అన్యాయం చేస్తారేమోనని భయపడుతూ వచ్చాను. మాకు ఇంటర్‌లో సీనియర్ అయిన మా బుద్ధూ ఇక్కడే ఎస్సైగా ఉంటున్నాడని తెలిసి సంబరపడ్డాను. కాని ఇంకా నువ్వు బుద్ధూలాగే ఉన్నావా? లేక నీ తెలివితేటలతో నిర్దోషులని రక్షిస్తున్నావా? కాక ఉద్యోగంలో చేరాక నీ మంచితనాన్ని నీ డ్రస్ క్రమంగా మింగేసిందా కాస్త టెస్టుచేశాను.

ఏ ఆధారాలు లేకుండా అంతటి పెద్దమనిషితో ఢీ కొన్నావ్! సెభాష్! ఇలాగే ఎప్పుడూ ఉండాలని కోరుతున్నాను. నాయనా! నీ యూనిఫారంతో మాత్రం మా

యింటికి రాకు. మా మామగారు బెంబేలు పడిపోతున్నారు. మా యింట్లో వాటా అద్దెకుందని ఆ పోలీసోడికి చెప్పిన వెధవ ఎవడని చిందులు వేస్తున్నాడు.

శ్వేతని నాతో నువ్వు ఇంటర్‌లో చూశావు. గుర్తు తెచ్చుకో! ఉంటాను బై!

అభినందనలతో.... ...

ధీరజ"

ఉత్తరం పూర్తి చేసిన రంజిత్ ముఖంలో ఆనందం తాండవించటం గమనించింది సమీర.

"సార్! మీకు చెప్పకుండా వెళ్ళాను. సారీ" అందామె.

"నో సమీరా! యూ హేవ్ డన్ ఏ గుడ్ జాబ్! ఈ కేసులో నీ సహాయాన్ని ఎన్నటికీ మరవలేను" అన్నాడు కృతజ్ఞతగా.

"థాంక్యూ సార్. కానిస్టేబుల్స్‌ని గౌరవంగా చూసే మీలాటి ఎస్సైలు కావాలిసార్ మాకు" అంది సమీర బయల్దేరుతూ.

ఆ తర్వాత—

శ్రీనివాసరావు నేరం కోర్టులో నిరూపించబడినది.

ఉత్తరాలు వ్రాసినది శ్వేత కాదని అతని లాయర్ వాదించాడు. కాని శ్వేత తల్లితండ్రులు కోర్టుకు హాజరు కావడం, శ్వేత హేండ్ రైటింగ్ కోసం ఆమె బి.ఎల్. నోట్ బుక్ కోర్టుకి సమర్పించడం జరిగింది.

కేసుని ఎన్నిరకాల తిప్పాలో అన్నిరకాల ప్రయత్నాలు చేసినా శ్రీనివాసరావు చివరికి తన నేరాన్ని అంగీకరించక తప్పలేదు. అతనికి శిక్ష ఖరారు అయింది.

9

రాత్రి పన్నెండయింది.

ఫోన్ మ్రోతతో రంజిత్ మేల్కొవి ఫోన్ ఎత్తాడు. అదే నవ్వ....

"ఇదిగో ధీరజా! చిన్నపిల్లలా ఏమిటా అల్లరి! కేసు బాధ వదిలినా నన్ను నిద్రపోనివ్వవా? కాలేజ్‌లో ఏడ్పించినది చాలుగాని ఇక ఆపు నీ అల్లరి" అన్నాడు నవ్వుతూ.

"అలాగే బుద్ధూ; నేను ఫోన్ చెయ్యడానికి కారణం వేరే ఉంది. నిన్న మా మామయ్యగార్కి నువ్వు క్లాసు తీసుకున్నావటగా! ఫలితం బాగానే ఉంది. నన్ను, మా వారిని రేపు మీ యింటికి వెళ్ళమంటున్నారు. రేపు వస్తున్నాము. మీ ఆవిడని చూపించు."

"ఆవిడ పుట్టింటికి వెళ్ళింది అమ్మలూ!"

"ఐసీ! కంగ్రాట్స్! అయితే పార్టీ చేయబోతున్నావన్న మాట!"

"అది సరేగానీ! నువ్వు ఫోన్‌చేసేటప్పుడు మీవాళ్ళు వినేవాళ్ళు కారా?"

"వచ్చిందా అనుమానం బుద్ధూ! ఆ జాగ్రత్త నేను తీసుకున్నాలే! ఇకమీద అంతజాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం లేదు అబ్బులూ!"

"మాటకి మాట ఒప్పగిస్తావ్ కదా!" నవ్వాడు రంజిత్.

"మా మామయ్యగారు ఒక పోలీసు ఆఫీసరు నీకు ఫ్రెండా అని ఉబ్బి తబ్బిబ్బైపోతున్నాడు. మా ఏరియాలో దొంగతనాలు ఎక్కువులే. అదీ అసలు కారణం" అంది కాస్త మెల్లగా.

రంజిత్ మరోసారి నవ్వాడు.

"గుడ్‌నైట్" అని ఫోన్ పెట్టేసింది ధీరజ. □

కాటేసిన మృత్యువు

బొమ్మిడి అచ్చారావు

అప్పటికి వందసార్లు మనసులోనే గోపాలకృష్ణని చంపేశాను. వాడు గోపాలకృష్ణ కాదు—పాపాలకృష్ణ. పరమ దుర్మార్గుడు. నికృష్టుడు. వాడ్ని చంపటం భూమికి భారం తగ్గించటమే అవుతుంది.

అయితే వాడ్ని ముఖాముఖి చంపటం హంతకుడిగా ముద్రవేయించుకుని ఉరికంబమెక్కటం నాకిష్టంలేదు. నా చేతికి మట్టి అంటకుండా నా కసి తీర్చుకోవాలి. ప్రతీకారం నెరవేర్చుకోవాలి.

అసలు పాపాలకృష్ణతో నాకు విరోధం ఎందుకొచ్చిందో ముందుగా చెప్పాలి.

పాపాలకృష్ణకో కూతురుంది. పేరుకి కాలేజిలో చదువుతోంది. అది చుట్టుపక్కల వాళ్ళని మభ్యపెట్టడానికి మాత్రమే! కూతురుతో చాలా ఖరీదైన వ్యాపారం చేయిస్తున్నాడు గోపాలకృష్ణ. ఏమాత్రం అవకాశమున్నా భార్య చేతకూడా వ్యాపారం చేయించేవాడే గాని, అతని భార్య రోగిష్టిది. నిత్యం మంచం వేసేస్తుంటుంది. కాబట్టి బతికి పోయింది.

గోపాలకృష్ణ లాంటి తండ్రులు చాలా అరుదుగా వుంటారు. కన్నకూతురుచేత వ్యభిచారం చేయించి ఆ పాపిష్ఠి సొమ్ముతో బారుల్లో తాగి తందానాలాడటం వాడి నిత్యకృత్యం.

నిత్యం వాడి ఇంటికి చాలామంది యువకులు వచ్చిపోతుంటారు. అయితే ఇంట్లో బిజినెస్ చేయించడు. అది కొంత నయం! వాళ్ళందరు వాడి అనధికార అల్లుళ్ళే! అయితే అందరు ఒకేసారి రారు. బహుశా వాడి కూతురు ముందుగానే వాళ్ళకు టైమింగ్స్ ఫిక్స్ చేస్తూంటుంది.

వచ్చినవాళ్ళకి భారీ ఎత్తున అతిథి సత్కారాలు జరుగుతాయి. అల్లుళ్ళతో బాటు చుట్టుపక్కల కాపరాలుంటున్న వాళ్ళకూ్కడా పడుపు సొమ్ముతో విందులు చేస్తుంటాడు, పాపాలకృష్ణ—వాళ్ళ నోళ్ళు మూసెయ్యటానికి!

అయితే ఇక్కడే సమస్య మొదలయింది. మామీద

గోపాలకృష్ణ చీప్ ట్రిక్స్ పనిచెయ్యలేదు. పైగా నేను వాళ్ళ స్వైరవిహారాన్ని వ్యతిరేకించాను, గర్హించాను.

చివరికి వాడి కూతురు నామీద కూడా వల విసర బోయింది. తప్పించుకున్నాను. నేను ఏక పత్నీవ్రతుడ్ని. గొప్ప చెప్పుకోవటం కాదుగాని. పెళ్ళయ్యాక నా భార్యను తప్ప పరాయిస్త్రీని ముట్టుకోలేదు. కనీసం ఆదృష్టితో చూడనుకూడా లేదు.

గోపాలకృష్ణ కూతురు నా ముఖంమీదే నువ్వు మగాడివి కాదనేసింది. అనుకొమ్మన్నాను. అలా రెచ్చగొడితే నన్నా పౌరుషపడి ఆమెవెంట పడతాననుకుంది. కాని నేను పడలేదు. ఆమె అహం దెబ్బతిన్నది. నన్ను సాధించి తీర్తానని శపథం చేసింది.

అన్నట్టుగానే ఓరోజు నేను ఒంటరిగా ఉన్నప్పుడు చటుక్కున మా పోర్షన్‌లో దూరింది. నేను విభ్రాంత పోయాను. నా ఎదుటే జాకెట్టు పర్రున చించేసుకుంది. జుట్టు విప్పేసుకుని ముఖంమీద చిందరవందరగా వేసుకుంది. గాజులు పగలగొట్టుకుంది. పగిలిన గాజుల్తో ముఖమ్మీద, ఒంటిమీద గాయాలు వేసుకుంది, గోళ్ళతో రక్కినట్టుగా.

ఈ సంఘటన నేనూహించనిది! నేను తేరుకునేప్పటికి పెద్దగా కేకలుపెట్టింది. అంతే, ఒక్కసారిగా జనం మా ఇంటిముందు పోగుపడిపోయారు. పెద్ద జాతరై పోయింది.

తనను మానభంగం చెయ్యబోయానని అందరితోను ఏడుస్తూ చెప్పింది. ఆమె నటనకు "ఊర్వశి" బిరుదిచ్చి తీరాల్సిందే! అంత గొప్పగా, అంత సహజంగా నటించి జీవం పోసింది.

అంతకాలం నేనా కాలనీలో పరువు మర్యాదలతో, ఒకరిచేత వేలెట్టి చూపించుకోకుండా ఘనంగా బతికాను.

బహుశా ఆ గౌరవంతోనే నామీద ఎవరూ చెయ్యిచేసుకో లేదు గాని లేకుంటే నన్ను సున్నంలోని ఎముకల్లేకుండా దంచేసి వుండేవారు.

అలా కొట్టినా బావుండిపోయేది। అసహ్యకరమైన చూపుల్తో నన్ను నిలువునా దహించేశారు. ఆ ఘోర పరాభవం కన్నా ఒకేసారి ప్రాణాలు వదిలెయ్యటమే హాయి! పాపాలకృష్ణ కూతురు నామీద తిరుగులేని దెబ్బ తీసింది. ఇదంతా వాడి పన్నాగమేనని నాకు తెలుసు.

అది మొదటి కారణమయితే, రెండోది వాడు నా కులాన్ని, నా కులవృత్తిని వేలెత్తి చూపించి నన్ను అవమానపరిచాడు. కించపరిచాడు. ఏదయినా సహించగలను గాని నా కులవృత్తిని కించపరిస్తే సహించలేను. భరించలేను. వాడు నన్ను సున్నితమైన స్థలంలో పూనిగుద్దాడు.

రెండూ అవమానకరమైన చర్యలే! అందుకే, నన్ను రెండు విధాల అవమానించి నా పరువు మర్యాదల్ని నట్టేట కలిపిన ఆ రాస్కెల్‌ని, ఆ పాపాత్ముడ్ని చంపి పారెయ్యాలని నిర్ణయించుకున్నాను. అప్పుడుగాని, నా పరాభవాగ్ని చల్లారదు. నా మనసు శాంతించదు.

కాని....వాడిమూలంగా నేను జైలుపాలవకూడదు. నా ప్రతీకారం తీర్చుకోవాలి. ఎలా? ఎలా?

అప్పటికప్పుడు అందుకో పథకాన్ని రూపొందించుకున్నాను.

పాపాలకృష్ణ కో ఉంపుడుకత్తె వుంది. ప్రతి రాత్రీ పదకొండు గంటల తర్వాత దాని దగ్గరకు పోతుంటాడు. మళ్ళీ తెల్లవారుఝామున తన కొంప చేర్తుంటాడు. వాడి కూతురుకి బేరాలు తేవటంలో వాడి ఉంపుడుకత్తెకూడా ప్రముఖపాత్ర వహిస్తుందని చెప్పుకుంటారు.

వాడిని యమసదనానికి పంపించటానికి ఆ సమయమే అనుకూలంగా వుంటుంది. వాడి కూతురి సంగతికూడా తేల్చెయ్యాలి. నన్ను నైతికంగా వాడి కూతురు దెబ్బతీస్తే సాంఘికంగా వాడు దెబ్బతీశాడు. వాళ్ళిద్దర్నీ నేను చావు దెబ్బ కొట్టాలి!

పాపాలకృష్ణ కూతురి పేరు చెప్పలేదుకదూ; వాడి కూతురి పేరు దేవకి.

అంతటి పవిత్రమైన పేరుపెట్టి ఆమెచేత పడుపువృత్తి చేయిస్తూ, మరో పవిత్రమైన పేరు పెట్టుకుని అవినీతికి అపవిత్రతకు మారుపేరుగా బతుకుతున్న పాపాలకృష్ణ నిజానికి సంఘంలో ఘరానాగానే చలామణి అయిపోతున్నాడు. అవినీతికున్న బలం, ఆదరణ అలాంటివి. కాలంతోబాటు నైతిక విలువలుకూడా దిగజారిపోతున్నాయి.

దేవకి నన్నే సమాజంలో, ఏ మనుషుల మధ్య అవమానించిందో, అదే మనుష్యుల మధ్య ఆమె జీవితాన్ని బట్టబయలు చెయ్యాలి. ఆడదానికి అంతకుమించిన అవమాన ముండదు. ఆమెను భౌతికంగా చంపదలచుకోలేదు.

పాపాలకృష్ణని చంపటానికి ముందే దేవకి పని పట్టాలని నిర్ణయించుకున్నాను. మేముంటున్నది పక్కపక్కనే కాబట్టి వాళ్ళ సంగతులన్నీ తెలుస్తాయి. వాళ్ళ ప్రతి మూమెంట్ ప్రత్యక్షంగా గమనించగలం.

ఆ రోజంత త్వరగా వస్తుందని నేననుకోలేదు. అంతక్రితమే వాళ్ళింటికి ఓ యువకు డొచ్చాడు. సమయానికి పాపాలకృష్ణ వాడి పెళ్లాం కూడా ఇంట్లో లేరు. పాపాలకృష్ణకి బ్రాంది షాపుంది. వాడు జనానికి అమ్మేదాని కన్న వాడు తాగేదే ఎక్కువ. ఆ మాటకొస్తే ఆ షాపు తను తాగ

టానికే నడుపుకుంటున్నాడని చెప్పొచ్చు.

వాడు షాపుకి పోయాడంత క్రితమే. వాడి పెళ్లాం ఏదో హాస్పిటల్‌కి వెళ్ళింది. యిక మిగిలింది దేవకి ఒక్కతే!

మా ఇంట్లో కూడా ఆ సమయానికి నే నొక్కడినే వున్నాను. పిల్లలు స్కూల్‌కి పోయారు. మా ఆవిడ ఎదురింటావిడతో మ్యాట్నీ సినిమాకి వెళ్ళింది.

పాపాలకృష్ణ ఇంటికి, మా ఇంటికి మధ్య ఓ సందు వుంది. చక చక కెమెరాను తీసుకొని సందులోకి దూరాను.

సందువైపు ఓ కిటికీ వుంది. ఆ కిటికీ కింది రెక్కలు మూసి వున్నాయి. పై రెక్కల్లో ఒకటి నా కోసమే నన్నట్టు తెరవబడే వుంది. ఆ కిటికీ పడక గదిదని నాకు తెలుసు.

మెల్లిగా కిటికీపైకి ఎక్కాను.

సరిగ్గా అప్పుడే దేవకి, ఆ కుర్రాడు మంచి సరస శృంగార దృశ్యంలో కనిపించారు నాకు. చకచక స్నాప్స్ తీశాను.

దాదాపు యిద్దరు నగ్నంగా మంచంమీద పొట్టేళ్ళలా ఢీ కొంటున్న రసవత్తర దృశ్యాల్ని కెమెరాతో బంధించాక యిక ఆలస్యం చెయ్యకుండా చుట్టుపక్కలవాళ్ళని పోగేసి అకస్మాత్తుగా పడగ్గది మీద దాడి చేశాను వాళ్ళతో.

అంతే! దేవకి, ఆమె ప్రియుడు రెడ్‌హేండెడ్‌గా దొరికిపోయారు. తప్పించుకునే అవకాశం లేకపోయింది. హడావిడిగా బట్టల్లో దూరిపోతున్న ఆమె ప్రియుడ్ని అలాగే బయటకి లాక్కొచ్చేశారు ఇరుగు పొరుగువాళ్లు.

దేవకి అస్తవ్యస్తంగా ఒంటికి చీర చుట్టుకుంటూ దొరికి పోయింది.

ఆమె మళ్ళీ తలెత్తుకోలేనంతగా మాటల ఈటెల్తో పొడిచేశారు ఆడవాళ్ళు. ఇలాంటి సానిదాన్ని మా సంసార కొంపల మధ్య వుండనివ్వమంటూ చెలరేగి పోయారు.

సమయానికి దేవకి తల్లి వచ్చివుండకపోతే ఆమె ప్రియుడి గతేమైవుండేదో గాని, రాగానే పరిస్థితి గ్రహించేసి 'అతను మా కాబోయే అల్లుడు' అంటూ పరిస్థితిని అదుపులోకి తెచ్చేసిందామె.

అయినా ఆడవాళ్ళూరుకోలేదు. 'పెళ్ళి కాకుండానే శోభనం మీ యిళ్ళల్లో అలావాటేమోగాని మా కిలాంటివి నచ్చవు. నీ కూతురు చెడిపోయినట్టే లెక్క!' అంటూ రూలింగ్ ఇచ్చేశారు.

పాపాలకృష్ణ ఇందుక్కారణమైన నన్ను తినేసేలా చూశాడు—ఆ తర్వాత కొంప చేరుకున్నాక. దెబ్బతిన్న బెబ్బులి ఆకలి ఆ కళ్ళలో నాకు కనిపించింది. నేను కసిగా నవ్వాను. వాడికి నా సత్తా ఏమిటో అర్థమయ్యింది.

అప్పటికైనా వాడు నాకు క్షమాపణ చెప్పుకుని వుంటే నేను నా నిర్ణయాన్ని మార్చుకొని వుండేవాడ్ని. హత్యా ప్రయత్నం విరమించుకునేవాడ్ని.

కాని వాడు క్షమాపణ చెప్పటం మాట అటుంచి నన్ను సర్వనాశనం చేస్తానని శపథం చేశాడు. వాడు నా పరాభవాగ్ని మీద మరింత ఆజ్యం పోశాడు. అందుకే వాడ్ని స్పేర్ చెయ్యదలచుకోలేదు.

నా స్నేహితుడికి సైలెన్సర్ వున్న రివాల్వర్ ఉంది. దానికి లైసెన్స్ వుంది. నాకున్న స్నేహితులందరు

సంఘంలో పెద్ద హోదాలున్నవాళ్ళు. అందరూ పై వర్గానికి చెందినవాళ్ళే. ఒక విధంగా నేనే వాళ్ళకన్న దిగువ అంతస్తులో వున్నానని చెప్పుకోవాలి!

పాపాలకృష్ణ సంగతి చెపితే తెల్లారేసరికి శవాన్ని హుసేన్‌సాగర్‌లో తేల్చివేయగలరు వాళ్ళు. కాని నా చేతిలోనే చావాలి వాడు. చంపింది నేనేనని వాడు చావబోయే ముందు తెలుసుకుని మరీ చావాలి. అందుకు రివాల్వర్ సరయిన ఆయుధం. రివాల్వరున్న నా స్నేహితుడి పేరు రాజు.

అడిగిన వెంటనే ఎందుకని అడగకుండానే రివాల్వర్ నా కిచ్చాడు నా స్నేహితుడు రాజు. మేగజైన్ విప్పి ఆరు బుల్లెట్లు లోడ్ అయివుండటం చూసి సంతృప్తిగా తలూపి రివాల్వర్ జేబులో దాచుకున్నాను. "థాంక్స్! చెప్పి ఇంటికొచ్చేశాను.

ఆ రోజంతా అన్యమనస్కంగానే వున్నాను.

మొదటిసారిగా హంతకుడ్ని కాబోతున్నాను. నేరస్థుల్ని, వాళ్ళ ఉనికినీ అసహ్యించుకునే నేనే నేరస్థుడిగా మారబోతున్నాను. ఇది నా కుటుంబంమీద యెలాంటి దుష్ప్రభావాన్ని చూపుతుందోనని ఓ పక్క సందిగ్ధంలో పడి నలిగిపోతున్నాను. నా భవిష్యత్తేమవుతుందో నని భయంవేసింది కూడా. కాని అదంతా క్షణికం! మరుక్షణం పాపాలకృష్ణుడిమీది పగ, ప్రతీకారం తమ విశ్వరూపం చూపించాయి. నా కళ్ళముందు వాడి శవం తప్ప నా కళ్ళకేం కనిపించటంలేదు. పైగా వాడు నన్ను సర్వనాశనం చేస్తానని ప్రగల్భాలు పలికాడు. నన్ను నాశనం చేయక ముందే వాడు సర్వనాశనమై పోతున్నాడు. కుటుంబ పరువు రచ్చకెక్కింది. దాంతోనే వాడు సగం చచ్చినట్లు

అయినా వాడింకా బుసకొడ్తున్నాడు. ఆ బుస శాశ్వతంగా ఆపేయ్యాలి.

నా భార్య నా ఆవేశాన్ని. నా అలజడిని చాలా తేలిగ్గా గుర్తించేసింది.

"ఏమిటలా వున్నారు? ఒంట్లో బావుండలేదా?" అనడిగింది.

"అబ్బె బాగానే వున్నానే!" అన్నాను తడబాటును కప్పిపుచ్చుకుంటూ.

"కాదు, ఏదోవుంది. నాతో చెప్పండి. మీ కష్టసుఖాల్ని పంచుకునే బాధ్యత, హక్కు, నాకున్నాయి" అందామె.

ఉహూ, ఏమైనాసరే ఈమెకు నిజం చెప్పకూడదు. ఏ మాత్రం తెలిసినా నా ప్రయత్నం శాశ్వతంగా ఆపేస్తుంది. నా ప్రతీకారం నెరవేర్చుకునే అవకాశంపోతుంది.

"ఏంలేదు, ఈరోజు ఆఫీసులో ఓవర్‌టైం చెయ్యాల్సి వుంది. మా మానేజర్ చండశాసనుడు. తప్పించుకునే ప్రయత్నం చేశాను, పడనివ్వలేదు" అన్నాను.

"ఎన్నిగంటలకు వెళ్ళాలి?"

"పదిగంటలకి భోంచేసి వెళ్తాను"

"దానికింత దిగులెందుకు? అప్పుడప్పుడది మీకు మామూలేకదా!" అన్నదామె.

నా మనసు తేలికపడింది. హాయిగా ఊపిరి పీల్చుకున్నాను.

నేను ఆమెని మోసగిస్తున్నాను. అయినా తప్పదు. ఈ అబద్ధం రెండు విధాల మంచిది. ఒకటి నా మనసులోని సంక్షోభం ఆమెకు తెలియకుండా జాగ్రత్తపడ్డాను, రెండోది నేను ఇంటినుంచి బయటపడటానికి తిరుగులేని కారణం సృష్టించాను. పాపాలకృష్ణని పదకొండు తర్వాతనే

ఒంటరిగా పట్టుకోగలను.

ఫోంచేసి బయటపడేసరికి నా వాచీ పదిన్నరగంటల్ని చూపిస్తోంది. జేబులోని రివాల్వర్‌ను మరోసారి తడుము కున్నాను. ఈ రోజుతో పాపాలకృష్ణ తన అవతారం నా చేతిలో చాలించబోతున్నాడు. ఓ పాపాత్ముడి చరిత్రకి చరమగీతం పాడే అవకాశం నాకు దొరికింది.

మా కాలనీకి చేర్చివున్న మరో కాలనీలో ఉంటోంది గోపాలకృష్ణ ఉంపుడుగత్తె. ఆమె విధవరాలు. పోతూ పోతూ ఓ ఇంటిని కొంత బాంక్ బాలెన్స్‌ని మిగిల్చి పోయాడామె భర్త. డబ్బుని వడ్డీకి తిప్పుతూ, ఇంటిని సగం అద్దెకిచ్చింది. వచ్చే ఆదాయం ఆమెకి ఎక్కి తొక్కిగావుంది. సెక్స్ అవసరాలు తీర్చటానికి పాపాల కృష్ణ నెన్నుకుంది. ఆమె వయసు తక్కువేంకాదు. నలభై అయిదుకి ఏభైకి మధ్య. పాపాలకృష్ణ వయసుదే.

గోపాలకృష్ణ ఇల్లువదిలి వచ్చేవరకు నేను వాడిని నా దృష్టిలోనించి పోకుండా కవర్‌చేసుకుంటూ కమ్యూనిటీ హాల్ దగ్గిర కూచున్నాను. వాడు వెళ్లేది కమ్యూనిటీహాల్ పక్కనించేనని నాకు తెలుసు. ఆ హాల్ దాటుకుని కాలినీ వెస్ట్‌గేట్‌నుంచి బయటకు వెళ్తాడు. మా రెండు కాలనీలకి మధ్య దాదాపు ఓ అరకిలోమీటరు పొడవునా నిర్మాను ష్యంగా వుంటుంది. ఆ తర్వాత రెండోకాలనీ మొదలవు తుంది.

ఆ కాలనీలోనేవుంది వాడి ఉంపుడుకత్తె. రెండు కాల నీల మధ్యవున్న నిర్మానుష్యమైన ప్రదేశంలోనే గోపాల కృష్ణని మట్టుబెట్టాలని నిశ్చయించుకున్నాను.

సరిగ్గా పదకొండు పదినిమిషాలకి గోపాలకృష్ణ కమ్యూ నిటీహాలు వైపు వస్తూ కనిపించాడు. వాడికనిపించ

కుండా ముఖం పక్కకి తిప్పుకున్నాను.

వాడు మందుమీదున్నాడు. కొద్దిగా తూల్తున్నాడు. ఎవర్నీ గమనించకుండా ఎటూ చూడకుండా సరాసరి నడిచి పోతున్నాడు. వాడికి స్కూటరుంది. కాని అది ఈ సమయంలో ఉపయోగించడు. అదీ నాకు మంచిదే అయింది.

మా కాలనీ దాటేశాడు. రోడ్డుమీదికొచ్చాడు. చీకటి రాత్రులు, కరెంటు కోతమూలన కాబోలు వీధిలో లైట్లు లేవు. కాలనీ వెల్తురు అస్పష్టంగా రోడ్డుమీద పడుతోంది.

రోడ్డంతా నిర్మానుష్యంగావుంది. పగలే అక్కడ జన సంచారముండదు. ఇక అర్ధరాత్రి సమయంలో ఎవరుంటారు? వాడు మాత్రం నిర్భయంగా, దర్జాగా వెళ్తున్నాడు. హుషారుగా ఓ పాట హమ్మింగ్ కూడా చేస్తున్నాడు.

నేను వాడికి పదిగజాల దూరంలో నడుస్తున్నాను. జేబునించి రివ్వాలర్ పైకితీశాను. సైలెన్సర్ అమర్చాను. వాడ్ని హతమార్చటానికి అప్పటికే మానసికంగా బాగా ప్రిపేరయి ఉన్నాను. కాబట్టి నాలో సంకోచం, వణుకు, సంశయం ఏమీ లేవిప్పుడు

దూరంనించి కాల్చి చంపటానికి ఆమాత్రం గ్యాప్ చాలు. కాని, నేనెవరో ఎందుకు చంపుతున్నానో ముందు పాపాలకృష్ణకి తెలియాలి. ఊరికే చంపటంవల్ల నా ఆశయం ఫలించదు!

రెండేనిమిషాల్లో వాడిని కల్సుకున్నాను. సరిగ్గా వాడిని దాటుకుని వెళ్ళి ఆగాను.

గోపాలకృష్ణ నన్ను చూసి ఉలిక్కిపడ్డాడు. వాడి ముఖంలో సంభ్రమం, కంగారు కొట్టొచ్చినట్టు కనిపించాయి.

నేను వాడి కళ్ళలోకి సూటిగా చూశాను. తర్వాత రివా

ల్వార్ పైకి తీసి వాడికి గురిచేశాను.

గోపాలకృష్ణకి దాన్ని చూడగానే మాట పడిపోయింది. "ఏ....ఏమిటిది?...." అన్నాడు గొంతు పెకల్చుకుని.

"కనిపించటంలేదా! నిన్ను చంపబోతున్నాను. చంపే ముందు నిన్నెందుకు చంపుతున్నానో చెప్పాలికదా!.... మొదటిది, నువ్వు నన్ను నా వృత్తిని అవమానించి నీచంగా మాట్లాడావు. నీ కూతురిద్వారా నా పరువుకి భంగం కలిగించావు. నీమీద పరువునష్టం దావా మృత్యువు రూపంలో వేస్తున్నాను. భగవంతుడ్ని తల్చుకో!" అన్నాను.

వాడి ముఖంలో చావు కళ ప్రత్యక్షంగా చూశాను. "నన్నేం చెయ్యకు. నిన్నన్న మాటలన్నీ ఉత్తదే! నిన్ను నాశనం చేస్తానని వూరకే బెదిరించాను! అంతే!"

"నేనుమాత్రం నిజంగానే చెప్తున్నాను, బెదిరించటం లేదు" సేఫ్టీ కాచ్ తప్పించాను.

ఊహించని వేగంతో ముందుకు పరుగెత్తాడు కాలనీ వైపు. నేను ఆలస్యం చెయ్యలేదు. ట్రిగ్గర్ నొక్కాను.

సైలెన్సర్ అమర్చిన రివాల్వరు టీప్....టీప్ మంటూ రెండుగుళ్ళు కక్కింది. నిప్పురవ్వలు వెలుగును విరజిమ్మాయి.

దభేలున కిందపడిపోయాడు గోపాలకృష్ణ. కిక్కురుమనలేదు. పడిన మరుక్షణం అతనిలో చలనం ఆగిపోయింది.

నేను ముందుకడుగేశాను. కాని అప్పుడే స్కూటర్ వెలుగు నామీద పడింది. ఎవరో కాలనీకి స్కూటర్మీద వెళ్తున్నారు. నేను చటుక్కున వెల్తురుపడకుండా ముఖం తిప్పేసుకున్నాను.

స్కూటర్ నన్ను దాటుకుని ముందుకు వెళ్ళింది. నే నక్కడ మరో క్షణంకూడా నిలబడలేదు. గోపాలకృష్ణలో ఏమూలనైనా కొనప్రాణం మిగిలిపోయిందేమో చూడాలనుకున్నాను. కాని అప్పటికే స్కూటర్‌వాలా గోపాలకృష్ణ శవం దగ్గిర ఆగి స్కూటర్ స్టాండ్ వేస్తున్నాడు.

నేను అప్పటికే రోడ్‌మీద పోతున్న ఆటోనాపి ఎక్కేశాను. స్కూటర్‌వాలా మా కాలనీవాడే అయుండాలి. నన్ను గుర్తు పట్టేశాడేమో....!? ఏమో!....

గోపాలకృష్ణని చంపే హడావిడిలో నా ఎలిబీ గురించి కూడా నేనాలోచించలేదు. చాలా పొరపాటయిపోయింది. స్కూటర్‌వాలా నన్ను గుర్తుపట్టి వుంటే, మా ఇంటికి వెళ్ళి నేను ఇంట్లో లేననే విషయం కన్ఫర్మ్ చేసుకుంటాడు. కాలనీ అంతా గుప్పుమంటుంది—హత్య నేనే చేశానని.

"కహాఁజానా సాబ్" ఆటోవాలా అడుగుతున్నాడు.

ఏదైనా సినిమాకి వెళ్తే....!? టైం చూసుకున్నాను—పదకొండూ నలభై, ఇప్పుడు బుకింగ్స్ కూడా మూసేస్తారు, లాభంలేదు. ఎలిబీకోసం ప్రయత్నించటం దండగ. నేరాలు చెయ్యటం బొత్తిగా అలవాటులేని నేను ఆదిలోనే తప్పటడుగు వేశాను.

హత్యాయుధం నా దగ్గిరుండటం క్షేమంకాదు. రాజుకి రివాల్వర్‌ని తిరిగి అందజెయ్యాలి.

మరోసారి రెట్టించాడు ఆటోవాలా. రాజు ఇంటి అడ్రసు చెప్పి పోనిమ్మన్నాను. మరో అరగంటలో రాజింట్లో వున్నాను.

నేను తిరిగిచ్చిన రివాల్వర్ అందుకుని నా ముఖంలోకి పరీక్షగా చూశాడు రాజు. నేను తడబాటును కప్పి వుచ్చుకుంటూ చిరునవ్వు నవ్వాను.

"కూచో!" అన్నాడు రాజు.

"వస్తాను, అర్జంటు పనుంది" అంటూ హడావిడిగా వచ్చి ఆపివున్న ఆటో ఎక్కి ఆఫీసు అడ్రసు చెప్పి పోనిమ్మన్నాను.

నేను నా భార్యతో ఆఫీసుకి వెళ్తున్నట్టు చెప్పాను. స్కూటర్‌వాలా నాగురించి మా ఇంట్లో ఎంక్వయిరీ చేసి ఎవర్నయినా తీసుకుని సరాసరి వెరిఫై చేసుకోవటానికి మా ఆఫీసుకి వస్తే....!! వాళ్ళొచ్చేసరికి నేను సీరియస్‌గా ఫైల్సు ముందేసుకుని కూర్చోవాలి. అప్పుడు నామీద అనుమానం కలగదు. ఇదంతా ఆ స్కూటర్‌వాలా నన్ను గుర్తుపట్టినప్పుడే వస్తుంది. అతను నన్ను గుర్తుపట్టాడా!? ఏమో!!

మరో ఇరవై నిమిషాల తర్వాత ఆటో మా ఆఫీసు ముందాగింది.

పన్నెండున్నరయింది సమయం.

వాచ్‌మన్ కోసం నాకళ్ళు వెతికాయి. లేడు!

ఆటోఫేర్ చెల్లించి పంపేసి ఆఫీసు మెట్లెక్కాను. నా దగ్గిర నా రూం డూప్లికేట్ కీస్ వున్నాయి. వరండా తలుపులు తెరిచేవున్నాయి. ఎక్కడో నిద్రపోతుంటాడు వాచ్‌మన్. అదీ మంచిదే! నే నెప్పు డక్కడకు చేరుకున్నానో నేను చెప్తే తప్ప ఎవరికీ తెలియదు.

నా గదితలుపులు తెరిచి లైట్లు వేసుకుని నా బీరువానించి ఫైల్సు తీసి టేబిల్ మీద పడేశాను. రేపుదయం వెళ్ళాల్సిన అర్జంటు రిపోర్టు ఒకటుంది. దాని తాలూకు ఫైల్సు అప్‌టుడేట్ చెయ్యాల్సి వుంది. ఈరోజు అన్యమనస్కంగా వుండి ఆ పని చెయ్యలేకపోయాను.

చకచక బిల్స్ తయారు చెయ్యాలనుకున్నాను. కాని ఏకాగ్రత కుదరటంలేదు. ఈపాటికి కాలనీ అంతటా గోపాలకృష్ణ మరణవార్త తెలిసిపోయి వుంటుంది. హంతకుడి కోసం ఊహాగానాలు చెలరేగుతుంటాయి. పోలీసులు రంగంలోకి దిగివుంటారు. వాడి శత్రువులగురించి ఎంక్వయిరీ చేస్తుంటారు. లిస్టులో నేనూ వుంటాను.

సరిగ్గా అప్పుడే గేటుకిర్రుమంటూ శబ్దంచేసింది. ఉలిక్కిపడి చూశాను. నాకోసం వేట మొదలై పోయి వుంటుంది. ఎవరో నాకోసమే వస్తున్నారు, అనుమానం లేదు.

బయటకి తొంగిచూశాను. గుండె ఓక్షణం ఆగి కొట్టుకున్నది.

ఆ వచ్చినది మాఆఫీసు వాచ్ మెన్.

నన్ను చూడగానే గతుక్కుమన్నాడు.

"అయ్యా, తమరెప్పుడొచ్చింరు? అట్లా బయాస్కోపుకి పోయినానయ్యా, చెమించుంద్రి" అన్నాడు వాచ్ మన్ యాదగిరి.

"ఫరవాలేదు యాదగిరీ, అర్జంటు బిల్స్ తయారు చెయ్యాల్సి వుండి పదిన్నరకే వచ్చాను. నువ్వు కనిపించకపోతే భోజనానికి వెళ్ళివుంటావనుకున్నాను...." అన్నాను ఏమాత్రం తొణక్కుండా.

దొరికింది. బలమైన ఎలిబీ దొరికింది. పై అధికారులకి తను సినిమాకి వెళ్ళినట్టు నేను చెప్పకుండా వుండాలంటే నేను పదిన్నరకే ఆఫీసుకొచ్చినట్టు యాదగిరి సాక్ష్యం చెప్తాడు.

"అయ్యా. పెద్దొరకి యిసయం తెల్వనియ్యకుంద్రి. శానాకోపం సేస్తాడు" అన్నాడు ప్రాధేయపడుతూ యాదగిరి.

నేను లోలోన నవ్వుకున్నాను.

"ఛ, ఛ, నేనెందుకు చెప్తాను యాదగిరీ! నేనొచ్చేటప్పటికి నువ్వు గస్తీ తిరుగుతూ ఆఫీసు ఆవరణలోనే ఉన్నావని చెప్తాను, అడిగితే! అడక్కపోతే అసంగతే ఎత్తను, సరేనా?"

"సాలయ్యా! పెద్దమనుసు తమర్ది" అన్నాడు వాడు ఆనందపడిపోతూ.

మరోగంట గడిచింది.

ఎవరూ నాకోసం రాలేదు. నా మనసులో గుబులు ఇంకా పెరిగిపోతోంది గాని తగ్గటంలేదు. ఇంటికి తిరిగి వెళ్ళిపోవాలనుకుని లేచాను. దార్లో పెట్రోలింగ్ పోలీస్ వేన్ ఎదురై నన్ను క్రాస్ ఎగ్జామ్ చెయ్యొచ్చు. వాళ్ళకి నమ్మకం కుదరాలంటే ఆఫీసు ఫైల్సు కొన్ని వెంట తీసుకు వెళ్ళాలి.

మా ఆఫీసు సీల్సుతో ఉన్న ఫైల్సు రెండు నావెంట బెట్టుకుని బయల్దేరాను.

"తలుపులు వేసుకో యాదగిరీ, పని పూర్తికాలేదు. ఇంటికి పట్టుకెళ్తున్నాను" అన్నాను; లెడ్జర్లు మూసి బీరువాలో పెట్టాను. వాటితో పని పూర్తయినట్టు, ఫైల్సు పని మాత్రమే మిగిలున్నట్టు వాడు అనుకోవాలని! వాడు వినయంగా తలవంచి నమస్కారం చేశాడు.

బయటికొచ్చాను.

రెండు రోడ్లు దాటేవరకు ఆటోగాని, టాక్సీగాని ఏదీ ఎదురుకాలేదు.

అకస్మాత్తుగా హెడ్ లైట్సు వెల్తురు నా పక్కనుంచి పడింది.

అది పెట్రోలింగ్ వేన్!

ఇద్దరు కానిస్టేబుల్సు నన్ను సమీపించారు. నా గుండె దడ హెచ్చింది. వీళ్లు పెట్రోలింగ్ స్క్వాడేనా, లేక నన్ను వెతుక్కుంటూ వస్తూన్న పోలీసులా?

"ఎవరు మీరు? ఎక్కడినుంచి వస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు?" అడిగారు వాళ్లు సూటిగా నావైపు చూస్తూ.

నేను ఫైల్సు చూపించాను. మా ఆఫీసు పేరు వివరాలు చూశాక వాళ్ళు నన్ను యధేచ్ఛగా పోనిచ్చారు. నా జేబులో బస్‌పాస్ కూడావుంది. అవసరమైతే దాన్ని చూపించాలనుకున్నాను. దానిమీద నా ఫోటో, ఆఫీసు ముద్ర కూడా వున్నాయి.

ఇంతలో ఖాళీ ఆటో అటుగా వచ్చింది. ఎక్కికూచుని మా కాలనీకి చేరుకున్నాను.

నేనెంతో వూహించుకుని వచ్చానుగాని, కాలనీలో నేననుకున్న హడావిడిగాని పోలీసులుగాని కనిపించలేదు. నాకు ఆశ్చర్యంగానే అనిపించింది.

అయితే మా యింటిదగ్గర మాత్రం పెద్దగుంపు కనిపించింది. ఎవరివో ఏడుపులు కూడా వినిపించాయి. నా గుండె స్పందన హెచ్చింది.

ఆటో దగ్గిరపడ్డాక అది గోపాలకృష్ణ ఇంటిముందు చేరిన గుంపు అని గుర్తించాను.

గోపాలకృష్ణ భార్య, వాడి కూతురు శవంమీద పడి ఏడుస్తున్నారు.

ఒక్కక్షణం నా గుండె ఆగింది. జరిగిందానికి పశ్చాత్తాపం నన్ను దహించిందో లిప్తపాటు.

ఆటో శబ్దం విని చాలామంది చూపులు నా మీద నిలిచాయి. ఫైల్సుతో దిగుతున్న నన్ను ఎవరూ ఆశ్చ

ర్యంగా చూడటంలేదు. నేను పగలు ఆఫీసునించి వచ్చి నంత సీదాగానే చూస్తున్నారు.

నా భార్య కూడా ఆ గుంపులోవుంది.

క్యూరియాసిటీ ఆపుకోలేక ఓసారి శవంవైపు ఊపిరి బిగించి చూశాను.

అరె! ఒంటిమీద ఎక్కడా గాయాలు కనిపించవేం? రెండుగుళ్ళు వాడి వెన్నునుంచి దూసుకువెళ్ళాయి. కాని చిన్న మెత్తు నెత్తురుచుక్క కూడా కనపడలేదు.

నిశ్చేష్టుడినై నిల్చుండిపోయానక్కడే! నా కళ్ళలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న ఆశ్చర్యం చాలా సహజంగా కనిపించి వుంటుంది అందరికీ!

మా ఎదురింటి ఈశ్వర్రావు నా పక్కకొచ్చి నిల్చుని, "పాపం గోపాలకృష్ణగారు గుండెపోటుతో పోయారు. సమయానికి మీరు కూడాలేరు. ఆఫీసు పనిమీద వెళ్ళారని మీ శ్రీమతి చెప్పారు. మిజరబుల్!" అన్నాడు.

నేను నిర్ఘాంతపోయాను.

పాపాలకృష్ణ గుండెపోటుతో పోయాడా? మరి నేను వాడ్ని రెండుసార్లు కాల్చానే! నా ముందే విరుచుకు పడిపోయాడు!? రివాల్వర్‌నించి రెండుసార్లు బుల్లెట్స్ రిలీజవటం నేను స్పష్టంగా గుర్తించాను.

ఇదెలా సంభవం? నాకు తల తిరిగిపోతోంది. పాపాల కృష్ణతో నాకున్న శత్రుత్వం గురించి కాలనీవాసులకి తెలుసు. అయినా అది మరిచి నేను వాడి శవముందు నిల్చుని మౌనం పాటించటం నాకు ప్లస్‌పాయింట్‌గానే పరిణమించింది. నా వ్యక్తిత్వాన్ని పెంచింది నలుగురిలోను.

అయితే నేనున్న పరిస్థితివేరు! తల బద్దలయిపోతోంది టెన్షన్‌తో! ఎలాగో ఓ పది నిమిషాలు నిల్చుని, బట్టలు

మార్చుకొస్తానని చెప్పి మా ఇంట్లోకి దూరాను. నా వెనకే శ్రీమతి లోనికొచ్చింది.

"పాపం, గోపాలకృష్ణ చాలా అకస్మాత్తుగాపోయాడు. ఫోంచేసి తన రెండోభార్యా దగ్గరకు వెళ్తూ మన కాలనీ దాటుతూనే రోడ్ మీద పడిపోయాడు స్ట్రోక్‌వచ్చి. పక్క కాలనీ అతనెవరో స్కూటర్ మీద పోతూ అతను పడి పోవటం చూసి ఇక్కడకు తీసుకొచ్చి అప్పగించాడు...." శ్రీమతి చెప్పుకుపోతోంది నేనడక్కుండానే.

కాని, అవేవీ నా బుర్రకెక్కటంలేదు. మస్తిష్కం మొద్దుబారిపోయింది. ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. ఏమిటది?

ఆ రాత్రంతా నిద్రపోకుండా ఆలోచిస్తూనే వున్నాను, మంచంమీద పొర్లుతూ! నా అవస్థ శ్రీమతి గమనించి అడిగింది. ఏదో చెప్పి నిద్ర నటించాను.

తెల్లవారుఝామున నాకు అకస్మాత్తుగా కారణం తట్టింది. అవును, అదే అయివుండాలి! వెంటనే రాజును కలుసుకోవాలి! ఆ తర్వాత ఎలా తెల్లారిందో, నేనెలా రాజు ఇంటికి వెళ్ళిపడ్డానో నాకే తెలియదు.

సూర్యుడుదయించకముందే తన యింట్లో ప్రత్యక్షమైన నన్నుచూసి రాజు ఏ మాత్రం ఆశ్చర్యపడలేదు సరికదా, నా కోసమే ఎదురుచూస్తున్నవాడిలా నన్ను రిసీవ్ చేసుకున్నాడు.

"నువ్వు క్షేమంగా వున్నందుకు, నిన్నిలా స్వేచ్ఛగా వుండగా చూడగలిగినందుకు చాలా సంతోషంగా వుంది." అన్నాడు రాజు.

నాకు రాజు మాటల్లోని అంతరార్థం లీలగా బోధపడు తోంది. రాజు కావాలనే ఏదో చేశాడు.

"పాపాలకృష్ణ చచ్చిపోయాడు." అన్నాను రాజు ముఖంలో దేనికోసమో వెతుకుతూ. రాజుకి గోపాలకృష్ణతో నాకున్న శత్రుత్వం తెలుసు. కాని వాడ్ని నేను చంపాలనుకున్న సంగతి రాజు ముందెన్నడు నేనెత్త లేదు.

రాజు చిర్నవ్వుతో నన్నుచూసి, "నువ్వు చంపనందుకు సంతోషం. ఇప్పుడు చెప్పు, ఎలా పోయాడో....!?" అన్నాడు.

నాకు మంచుతెర విడిపోతోంది.

"అయితే నువ్వు నా కిచ్చిన రివాల్వర్...."

రాజు మళ్ళీ చిర్నవ్వు చిందించాడు.

"నా ప్రాణ మిత్రుడ్ని హంతకుడిగా నేనూహించ లేను. ఆవేశంతో తీసుకున్న నిర్ణయం చాలా ప్రమాదకర మైనది. నిన్ను ఉరికంబ మెక్కకుండా రక్షించుకో గలిగాను." అన్నాడు.

"రాజూ!...."

"అవును. నీ కిచ్చిన రివాల్వర్ నిజం రివాల్వరే, కాని అందులోని గుళ్ళు డమ్మీవి. నాటకాల్లో, సినిమాల్లో ఉపయోగించే జలంధర్ బుల్లెట్స్. అవి రివాల్వర్నించి వెలువడినపుడు నిప్పురవ్వలు, పొగ వెలువడి చూసేవాళ్ళకు నిజం బుల్లెట్ రిలీజయినట్టే భ్రమ కలుగుతుంది.

నువ్వు నిన్నసాయంత్రం రివాల్వర్ అడిగినపుడు నాకు మొదటిసారిగా నీ ప్లాన్ అర్థమయింది. కావాలనే మేగజైన్లో డమ్మీగుళ్ళు లోడ్ చేసి నీ కిచ్చాను. నువ్వు దాన్ని తిరిగిచ్చేటపుడు అందులో రెండుగుళ్ళు ఖర్చయి నట్టు గుర్తించాను. అవి డమ్మీగుళ్ళని నువ్వు గ్రహించ లేదని నా కర్థమైపోయింది. నువ్వు గ్రహించివుంటే

రివాల్వర్ వాపసిచ్చేటపుడు నన్ను తప్పక అడిగివుండే వాడివి.

నాక్కావలసినది నీకు నిజం తెలియకపోవటమే! నిజం తెలిసేటప్పటికి నీలో ఆవేశం చల్లారి, వివేకం తలెత్తుతుంది. నీ శత్రువును చంపాలని మళ్ళీ ఎప్పటికీ అనుకోవు.... అంతా నేననుకున్నట్టే జరిగింది." అన్నాడు రాజు.

ఒక్కసారిగా రాజును గాఢంగా కౌగలించుకున్నాను. నన్ను ఉరికంబం నుంచి రక్షించిన గొప్ప స్నేహితుడు రాజు. ఏమిచ్చి రుణం తీర్చుకోను?

నిజానికి రాజు రియల్ బుల్లెట్స్ లోడ్ చేసివున్నా, గోపాలకృష్ణ హార్టు పెయిల్యర్‌తో చనిపోకపోయివున్నా, ఈ కథ మరొకలా వుండేదేమో!

ఇప్పుడు నా మనసులో ఎలాంటి పగ ప్రతీకారాలు లేవు! □

శాస్తి?

4

నేరస్థుడి తీర్పు

జొన్నలగడ్డ రామలక్ష్మి



చంద్రావతి బీచివద్ద ఒంటరిగా కూర్చుని వుంది. సాగరుడి ఘోష వింటూ ఏమేమో ఆలోచనల్లో పడిపోయిన ఆమె తనకు కాస్తదూరంలో వుండి తన్నే చూస్తున్న నలుగురు యువకుల్ని గమనించలేదు.

ఆ నలుగురు యువకుల్లో ఒకడు నాయకుడిలా

హుందాగా వున్నాడు. మనిషి కూడా ఖరీదైనవాడిలా కని పిస్తున్నాడు.

"పిట్ట చాలా బాగుంది గురూ!" అన్నాడు నలుగురిలో ఒకడు.

"నాకూ నచ్చింది" అన్నాడు నాయకుడు.

"అయితే చాలా అదృష్టవంతురాలు" అన్నాడు నలు గురిలో ఒకడు.

"ఆమె అదృష్టం గురించి మనకెందుకు? నేను మన అదృష్టం గురించి ఆలోచిస్తున్నాను" అన్నాడు నలు గురిలో ఇంకొకడు.

"అవున్రా - ఆ విషయమే మర్చిపోయాను" అన్నారు మిగతా యిద్దరూ ఒకేసారి.

తమ అదృష్టం గుర్తుకొచ్చిందేమో మొత్తం ముగ్గురి కళ్ళూ ఒక్కసారి మెరిశాయి.

"ఏమిట్రా మీ అదృష్టం!" అన్నాడు నాయకుడు.

"నీకు తెలియదా?" అన్నాడు నలుగురిలో ఒకడు.

నాయకుడు తల అడ్డంగా ఊపాడు.

"మాకూ నీకూ ఒక్కటే తేడా. నువ్వు హీరోవి— మేము ప్రేక్షకులం...."

"అంటే?"

"సినిమాల్లో హీరోయిన్ ఎంతో అందంగా ఉంటుంది. వీలైనంత తక్కువ బట్టలు వేసుకుని-శరీర సౌందర్యాన్ని ప్రదర్శిస్తుంది. మనోహరంగా నవ్వుతుంది. మననేడిపించ డానికా అన్నట్లు ఏడుస్తుంది. ఆమె ప్రతికదలికా— మా గుండెల్ని కదిలిస్తాయి. ఆమె అందాన్ని పదేపదే చూడ్డానికే మేము మళ్ళీ మళ్ళీ సినిమాలు చూస్తూంటాం! అయితే మా అనుభవం అంతవరకే....! హీరో సంగతి

వేరు. హీరో ఆమెను చేత్తో తాకుతాడు. బలంగా కౌగ లించుకుంటాడు. వళ్ళంతా తడుముతాడు. పెదాలపై ముద్దు పెట్టుకుంటాడు.

"ఊఁ చాల్లెండి—అది సినిమా! నిజజీవితంలో అలా కుదరదు. ప్రియురాలితో అనుభవం పదిమంది ముందూ బాగుండదు. కనీసం నాకలా నచ్చదు—" అన్నాడు నాయకుడు.

"నేను చెప్పేది సరిగ్గా అర్థం చేసుకోలేదు గురూ నువ్వు! నిన్ననే మేం ముగ్గురం కలిసి ఒక నిర్ణయానికి వచ్చేం...."

"ఏమిటది?"

"ఇలాంటి విషయాల్లో నీకు సాయపడ్డం మినహా ఇంకేమీ చేయలేం మేము. కాబట్టి మేము కోరేదేమిటంటే అందమైన ఆడపిల్లను నీ వనుభవించబోయేముందు—ఒక్కసారి ఆమె అసలైన అందాలను మమ్మల్ని కళ్ళారా చూడనివ్వాలి. ఆ తర్వాత నీ యిష్టం...."

నాయకుడు నవ్వాడు "ఓస్—ఇంతేనా!" అన్నాడు.

"అంతే మరి...."

"ఒప్పుకున్నాను. మరి రంగంలోకి దిగండి"

నలుగురిలో ఒకడు వెంటనే లేచి చంద్రావతిని సమీ పించాడు.

ఆలోచనల్లోవున్న చంద్రావతి అతణ్ణి చూసి ఉలిక్కి పడింది.

అత డామెను రెండు చేతులూ జోడించి నమస్క రించాడు.

చంద్రావతి కూడా అతనికి అప్రయత్నంగా నమస్క రించి ప్రశ్నార్థకంగా చూసింది.

"నా పేరు సత్యం. మిమ్మల్ని చూడగానే చనిపోయిన నా చెల్లెలు గుర్తుకొచ్చింది" అన్నా డతడు.

చంద్రావతి తడబడి "కూర్చోండి" అంది.

అతడు కూర్చుని "మిమ్మల్ని చూస్తే అమ్మ ఎంతో సంతోషిస్తుంది" అన్నాడు.

"నాకేమర్థం కావడంలేదు" అంది చంద్రావతి.

"నా చెల్లెలు అచ్చం మీకులాగే వుండేది. పెళ్ళి సంబంధం కూడా నిశ్చయమయింది. రెండు నెలల క్రితం కాలేజీకి వెడుతూండగా ఎవరో దుర్మార్గుడు దాన్ని బల వంతంగా ఎత్తుకుపోయి మానభంగం చేశాడు. అది ఆత్మ హత్య చేసుకుంది...." చెప్పడానికి బాగా తడబడినట్లు నటించే డతను.

చంద్రావతి మాత్రం ఇబ్బంది పడలేదు "మానభంగం జరిగితే ఆత్మహత్య చేసుకోవడ మెందుకు? ధైర్యంగా బ్రతకాలి కానీ...." అంది.

"మీరు చాలా ధైర్యంగా మాట్లాడుతున్నారు. నా చెల్లెలి కీ ధైర్య ముండివుంటే బాగుండేది" ఏడుపు గొంతుతో అన్నా డతడు.

"తప్పు మీ యింటి పద్ధతిల్లో వుండివుంటుంది. ఆమె కన్యాయం జరిగినా—ఆమెవల్లే తప్పు జరిగినట్లు మాట్లాడి వుంటారు. ఒక చిన్న సంఘటనతో ఆమె జీవితాధ్యాయం ముగిసినట్లే భావించివుంటారు. ఆమె క్కావలసిన మనో ధైర్యం, ప్రోత్సాహం లభించక ఆమె ఆత్మహత్య చేసు కునివుంటుంది."

అతడు తలవంచుకుని—"మీరనుకున్నది పొరపాటు. మా యింట్లో అందరివీ ఆధునిక అభిప్రాయాలు. ముఖ్యంగా మా అమ్మవి. నా చెల్లెలు కూడా కబుర్లు

గొప్పగా చెప్పేది. కాలేజీలో డిబేట్లలో విప్లవకారిణిలా మాట్లాడేది. ఆ సంఘటన జరగ్గానే మాతో మాటమాత్రం అనలేదు. మాకు ముఖం కూడా చూపించలేదు. ఓ ఉత్తరం రాసి పోస్టుచేసి తన్ను తా నంతం చేసుకుంది" అన్నాడు.

"మీ చెల్లెలి పేరు....? అంది చంద్రావతి.

"పేరెందుకండీ—ఫోటోయే చూపిస్తాను. ఒక్కసారి మా ఇంటికి రండి. మిమ్మల్ని చూస్తే మా అమ్మ ఎంతో సంతోషిస్తుంది. ఏదో రూపంలో మరో చోట నా చెల్లెలు బ్రతికే ఉందని భావిస్తుంది—మీ కెప్పుడు వీలో చెప్పండి మా యింటికి వెడదాం!" అన్నా డతడు.

"ఎప్పుడో ఎందుకు? మీ కభ్యంతరం లేకపోతే ఇప్పుడే వెడదాం" అంది చంద్రావతి.

"ఇప్పుడా—ఇప్పుడు మీ రెవరికోసమో ఎదురు చూస్తున్నట్లున్నారు" అన్నా డతను సంకోచంగా.

"ఇప్పుడెవరూ నాకోసం యిక్కడికి రారు—రండి మీ అమ్మగారిని చూస్తాను" అంది చంద్రావతి అక్కణ్ణించి లేస్తూ.

"ఒక్కరే బీచి దగ్గిర వుంటే అనుమానించాను. మీరేమీ అనుకోనంటే నాదొక్క సలహా" అన్నా డతడు.

"ఊఁ" అందామె.

"మీ కెవరైనా స్నేహితులుంటే వాళ్ళను నమ్మకండి. ఒంటరిగా వాళ్ళను కలుసుకోకండి."

"ఎందుకని?"

"స్త్రీని మోసం చేయడమే మగాడి పరమోద్దేశ్యం..."

చంద్రావతి నవ్వి "మోసపోయేవాళ్ళు అమాయకులు. నేను అమాయకురాలిని కాదు" అంది.

"ఏమో—అనుభవంలో నాకు తోచింది చెప్పాను. ఆపైన మీ యిష్టం" అన్నాడతడు.

"అయితే—నే నిప్పుడు మీతోనూ రాకూడదు...."

అతడు తడబడకుండా "నిజం చెప్పారు. ఏదో మా అమ్మ సంతోషిస్తుందని రమ్మన్నాను. కానీ ముక్కు ముఖం తెలియని నన్నెందుకు మీరు నమ్మాలి? అయాం సారీ నాతో రావద్దు మీరు" అన్నాడు.

చంద్రావతి నవ్వి "సత్యంగారూ! అనుమానిస్తూ కూర్చుంటే ఈ ప్రపంచంలో స్నేహం, ఆత్మీయత, మానవత్వం మచ్చుకి కూడా కనిపించకుండాపోతాయి. నేను మిమ్మల్ని అనుమానించడంలేదు. మీ యింటికి వస్తున్నాను. పదండి" అంది.

"మీరు నన్ను గౌరవిస్తున్నారు! థాంక్స్!" అన్నాడతడు.

"అందమైన ఆడపిల్ల కంటపడగానే—వెకిలిచూపులు చూస్తూ అసహ్యంగా ప్రవర్తించే యువకులున్న యీ రోజుల్లో మీరు నన్ను చూడగానే మీ చెల్లెల్ని గుర్తు చేసుకున్నారు. మీ సంస్కారం నన్ను ముగ్ధురాలిని చేసింది" అందామె

ఇద్దరూ ఇసుకలోంచి రోడ్డుమీదకు వచ్చారు.

అక్కడ కారొకటి వుంది. బ్యాక్ డోర్ తెరిచా డతడు.

"మీకు కారుందా?" అందామె ఆశ్చర్యంగా.

"కారు నాది కాదు. నాకు డ్రైవింగ్ వచ్చు" అన్నాడతడు.

నిజానికి నాయకుడి బృందం రెండు కార్లలో వచ్చారు. రెండు కార్లూ నాయకుడివే! ముందు చూపుతో రెండో కారు తెస్తే చంద్రావతి దొరికింది. అతడు చంద్రావతితో

కబుర్లు చెబుతూండగా మిగతా ముగ్గురూ మరో కార్లో స్థావరం చేరుకున్నారు.

"కారెవరిచ్చారు మీకు?" అందామె.

"మా అమ్మ దుఃఖం భరించలేక నే నుత్తరం రాస్తే పిన్ని వచ్చింది. పిన్ని వచ్చేక అమ్మకొ్కంత ఓదార్పు లభించింది. ఇక పిన్ని వెళ్ళిపోదామనుకుంటోంది. ఆమె కూరంతా చూపించాలని ఈ కారు సంపాదించాను" అన్నా డతడు.

ఆమె బ్యాక్ సీట్లో కూర్చుంది.

అతడు ముందునుంచీ కారెక్కాడు.

డ్రైవ్ చేస్తూండగా అతడామెను పలకరించలేదు. ఆమె అతణ్ణి ప్రశ్నలు వేయలేదు. ఇద్దరూ దీర్ఘాలోచనలో ఉన్నట్లున్నారు.

కాసేపటికి కారో యింటి ముందాగింది.

చిన్న బంగళా అది!

అతడు కార్లోంచీ దిగి బ్యాక్ డోరు తెరిచి పక్కకు తప్పుకున్నాడు.

ఆమె కారు దిగి "ఇదేనా మీ యిల్లు?" అంది.

"ఊఁ"

"ఊరికి కాస్త దూరంగా వుంది" అందామె.

"ఇల్లు బాగోలేదా?"

"బాగుంది—చాలా బాగుంది" అంటూ ఆమె ముంద డుగు వేసింది.

ఇద్దరూ ఇంట్లో ప్రవేశించారు.

హాలామె ఊహించినకంటే ఎక్కువ అందంగా వుంది.

"నిజంగా ఇది మీ ఇల్లేనా?" అందామె అనుమానంగా.

అతడు మాట్లాడలేదు.

తను ఖరీదైన మనిషిలా కనబడనని అతడికి తెలుసు.

"నిజంగా యిది మీ ఇల్లేనా!" అంది చంద్రావతి మళ్ళీ.

అతడేదో బదులిచ్చేలోగా "ఇది నా యిల్లు" అన్న మాట వెనుకనించి వినబడింది.

చంద్రావతి వెనక్కి తిరిగింది.

నాయకుడు ఇద్దరు అనుచరులతో అక్కడున్నాడు.

"ఎవరు మీరు?" అందామె

"ఈ జీవితమే ఒక సినిమా. అందులో మన మిద్దరం కాసేపు తాత్కాలికంగా హీరో హీరోయిన్లం" అంటూ అతడామెను సమీపించాడు.

"వాటీజ్ దిస్" అంది చంద్రావతి కంగారుగా.

నాయకు డామె చేయి పట్టుకున్నాడు. ఆమె విడిపించుకునేలోగానే బలవంతంగా పక్కగదిలోకి లాక్కుని పోయాడు.

అనుచరులు ముగ్గురూ అక్కడే ఉండిపోయారు.

"భలే తీసుకొచ్చావు గురూ" అంటూ—ఇద్దరు సత్యం నామధేయుణ్ణి అభినందించారు.

"నా ముఖంలో ఎప్పు డే భావాలు కావాలంటే అవి పలుకుతాయి. సినిమాల్లోకి పోతే బాగా రాణిస్తాను. ఇంత వరకూ నా నటన ఎందరినో మోసం చేసింది" అంటూ సత్యం గర్వంగా నవ్వాడు.

"ఏం చేశావో చెప్పు గురూ! మేమూ నేర్చుకుంటాం" అన్నా రా యిద్దరూ.

"చెప్పి ఏం లాభం? కథ చాలా పాతది. అంతా నటనలో వుంది" అన్నాడు గర్వంగా సత్యం.

ముగ్గురూ కబుర్లలో వున్నారు. ఈలోగా లోపల్నుంచి ముగ్గురికీ పిలుపు వచ్చింది.

ఉత్సాహంగా ముగ్గురూ గదిలోకి పరుగెత్తారు.

ముందు వారు నాయకుణ్ణి చూశారు. అతడి చేతిలో కొరడా వుంది.

"చూస్తానన్నారుగా చూడండి. అయిదే నిమిషాలు టైము. ఎంత దగ్గిర్నించైనా చూడండి - కానీ ఆమెను తాకడానికి వీల్లేదు" అన్నాడు నాయకుడు.

ముగ్గురూ ఆమెను సమీపించారు.

చంద్రావతి ఏడుస్తోంది.

ఆమె వంటిమీద ఒక్క గాయం కూడా లేదు.

ధైర్యంగా బీచిదగ్గిర ఎన్నో కబుర్లు చెప్పిన ఆ యువతి కొరడాను చూడగానే భయపడిందన్న మాట!

"అయిదు నిముషాలూ అయిపోయింది. ఇక మీరు వెళ్ళొచ్చు" అన్నాడు నాయకుడు.

వాళ్ళు గదిలోంచి బయటకు వెళ్ళిపోగానే—గది తలుపులు మూసుకున్నాయి.

2

రామం గదిలో ఒక్కడే వున్నాడు. కాలక్షేపానికతడు ఇంగ్లీషు నవల చదువుతున్నాడు.

అప్పుడు టైము రాత్రి ఎనిమిదయింది.

ఎవరో తలుపు తట్టారు.

రామం పుస్తకం మడచి కిందపెట్టి వెళ్ళి తలుపు తీశాడు. గుమ్మం బయటి వ్యక్తిని చూసి ఆశ్చర్యపడి "చంద్రా నువ్వా!" అన్నాడు.

"లోపలకు రావచ్చా?" అంది చంద్రావతి.

"రా" అన్నాడు రామం పక్కకు తప్పుకుని.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నాక "నే నిప్పుడెక్కణ్ణించి వస్తున్నానో ఊహించగలవా?" అంది చంద్రావతి.

"ఇంటినుంచి" అన్నా డతడు.

"బీచినుంచి కూడా కాదు" అంది చంద్రావతి.

"మరెక్కణ్ణించి?"

"ఓ దుర్మార్గుడి బాహుబంధాల్లో నలిగి మానభంగం పొందాను ...."

రామం నిశ్చేష్టుడైపోయాడు. అతడు తేరుకున్నాక చంద్రావతి అతడికి జరిగిందంతా చెప్పింది.

రామం నిట్టూర్చి "ఏం చేయాలనుకుంటున్నావు?" అన్నాడు.

"నాకు నీ సాయం కావాలి" అంది చంద్రావతి.

"నీకు నా సాయమెప్పుడూ వుంటుంది!"

"థాంక్స్—అయితే పోలీస్‌స్టేషన్‌కు పద" అంది చంద్రావతి.

"ఎందుకు?"

"జరిగింది నేరం. ఇప్పుడే అయితే ఆ నేరాన్ని ఋజువు చేయగల అవకాశముంది. నా జీవిత మెలాగూ నాశనమయింది. ఆ భయంకర నేరస్థుడిని పోలీసుల కప్పగించేవరకూ నాకు స్థిమితముండదు."

"ఇది అన్నయ్యకు తెలిస్తే ...."

"అన్నయ్యకు తెలిస్తే వెంటనే వెళ్ళి వాడి ప్రాణాలు తీస్తాడు. అనవసరంగా వాడు ఉరికంబ మెక్కుతాడు. అది నా కిష్టంలేదు. నాతోపాటు వాడి జీవితం కూడా నాశనం కావడం నా కిష్టం లేదు" అంది చంద్రావతి.

"ఒక్కక్షణం స్థిమితపడి నేను చెప్పేది విను" అన్నాడు రామం.

"చెప్పు—వింటాను" అంది చంద్రావతి.

"నువ్వు పోలీసులవద్దకు వెళ్ళడంవల్ల ముందుగా అపహాస్యంపాలయ్యేది నువ్వు. నలుగురూ నిన్ను చిన్న చూపు చూస్తారు. నీ గురించి అసభ్యంగా మాట్లాడతారు" అన్నాడు రామం.

"అలాగని ఓ భయంకర నేరస్థుడిని చూస్తూ చూస్తూ వదిలిపెడతామా?" అంది చంద్రావతి.

"నువ్వు పోలీసుల వద్దకు వెడితే వాడికి శిక్ష లభిస్తుం దని నీ నమ్మకమా? వాడు ధనవంతుడు. బలవంతుడు. చట్టాన్నీ, న్యాయాన్నీ కొనేయగల సమర్థుడు. ఇన్సాఫ్‌కా తరాజూ చిత్రం చూసేవుంటావు. అందులో విధంగా తప్పు నీదేనని ఋజువైతే—చివరికి నువ్వేం సాధించినట్లు?" అన్నాడు రామం.

"అయితే నన్నేం చేయమంటావు? నా జీవితం నాశనం చేసినవాడిని నిస్సహాయంగా చూస్తూ వదిలిపెట్ట మంటావా?"

"నీ జీవితం నాశనమయిందని ఎవరన్నారు?" అన్నాడు రామం.

"అంటే?"

"చంద్రా! జరిగింది మర్చిపో. ఏమీ జరగలేదనే అనుకో. అప్పుడు....?!" అన్నాడు రామం.

రామం, చంద్రావతి ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసు కుందామనుకున్నారు. దానికీ సంఘటన అడ్డు రాదని రామం చెబుతున్నాడు.

"రామం—నువ్వు దేవుడివి...."

"నేను దేవుడినెందు కయ్యాను?"

"ఒక పతితను రక్షిస్తున్నందుకు...."

"నేను దేవుడినే అయితే నా ప్రియురాలు పతిత కాకుండా రక్షించుకోగలిగేవాడిని కదా! కాబట్టి నేను దేవుడిని కాదు. నేను దేవుడినే అంటావా? అప్పుడు నువ్వు పతితవు కాదు. దేవుడి ప్రియురాలివి" అన్నాడు రామం.

"రామం నాలో ఆవేశం దిగిపోతోంది. మనసు తేలిక పడుతోంది" అంది చంద్రావతి.

"ఇంకాసేపు ఇక్కడే కూర్చో! అప్పుడీ రహస్యం మనిద్దరిమధ్యనే ఉండిపోతుంది—నీ అన్నయ్యకూడా తెలియదు...." అన్నాడు రామం.

"లాభంలేదు - నా అన్నయ్యదగ్గిర ఏ రహస్యమూ దాచలేనునేను—" అంది చంద్రావతి.

"నీ అన్నయ్యకు విషయం తెలిస్తే వ్యవహారం హత్యకు దారితీస్తుంది. అదతడికే క్షేమంకాదు—"అన్నాడు రామం.

"కానీ అన్నయ్యదగ్గిర రహస్యం దాచడం నావల్ల కాదు. అన్నయ్య నా ప్రాణం. నా సంతోషం, దుఃఖం వాడితో పంచుకోకుండా నేనుండలేను. ఇది అసాధ్యం" - అంది చంద్రావతి.

ఇద్దరూ కాసేపాలోచించారు.

"చూడు చంద్రా! నీ కన్యాయం జరిగినమాట నిజం. ఒక దుర్మార్గుడు తప్పించుకుంటున్న మాట కూడా నిజం. కానీ మనచుట్టూ ఎందరో దుర్మార్గులున్నారు. వాళ్ళంతా నేరాల్నించి శిక్షలేకుండా తప్పించుకున్నవాళ్ళే! తెలిసి కూడా సమాజం వాళ్ళను భరిస్తోంది. గౌరవిస్తోంది. నీకు జరిగిన అన్యాయం కారణంగా నీ జీవితం నాశనంకావడం లేదు. నిన్ను పరమ పవిత్రురాలిగా భావించి జీవితాంతం -

జీవిత భాగస్వామిగా గౌరవించడానికి నేనున్నాను. ఆ దుర్మార్గుడి గురించిన బాధ నీకెందుకు? వాడిమీద ఆగ్రహం మనకే వినాశనహేతువు. ఇదంతా నేను నీ అన్నయ్యకు విడమర్చి చెబుతాను. ఆ పద్ధతి నాకు వదిలిపెట్టు. విషయం తెలిసి మీ అన్నయ్య శాంతించేక అప్పుడు నెమ్మదిగా అతడికి నువ్వీ రహస్యం చెబుదువుగాని. అంతవరకూ ఓపికపట్టలేవా?'' అన్నాడు రామం.

చంద్రావతి చటుక్కున వంగి రామం పాదాలకు నమస్కరించి ''భర్తను దైవంగా భావించి పూజించాలని మన మతం చెబుతుంది. నువ్వింకా నా భర్తవుకాదు. కానీ నిన్ను పూజించకుండా నేనుండలేను—'' అంది.

''అయితే నాకూ నీచేత పూజించబడాలనేవుంది. నీ పూజలకు సమాజం విపరీతార్థాలు తీయకుండా ఉండడానికి వెంటనే మన వివాహం జరిగితే మంచిది. నీ అన్నయ్యతో నేనావిషయం కూడా మాట్లాడతాను—'' అన్నాడు రామం.

3

చిన్న పెంకుటిల్లది.

ఆ యింటి ముందో కారాగింది. కార్లోంచీ దిగాడో యువకుడు. ఖరీదైనమనిషిలా కనబడుతున్నాడతడు. హుందాగా ఉన్నాడు. అతడా ఇంటిమెట్లెక్కి తలుపు తట్టబోయి—అవి పూర్తిగా వేసి లేవని గ్రహించి చటుక్కున తోశాడు.

అక్కడో మడత మంచంమీద వెల్లకితలాపడుకుని తెలుగు పేపరు చదువుతున్న యువకుడు చటుక్కున లేచి కూర్చున్నాడు. తను కట్టుకున్న గళ్ళలుంగీ సవరించుకున్నాడు.

''జగ్గన్న నువ్వేకదూ?'' అన్నాడా ఖరీదైన యువకుడు.

"అవును—నువ్వు....? అన్నాడు జగ్గన్న ప్రశ్నార్థకంగా.

"నాపేరు ప్రభాకర్—చాలా ఖరీదైన మనిషిని...."

జగ్గన్న అతడికి కుర్చీ చూపించాడు. తను గోడవారకు వెళ్ళి హాంగర్‌కి తగిలించుకునిఉన్న చొక్కా వేసుకున్నాడు. అప్పుడు ప్రభాకర్ కెదురుగాఉన్న కుర్చీలో కూర్చుని—"నాతో నీకేంపని?" అన్నాడు.

జగ్గన్న మనిషి మొరటుగా ఉన్నాడు. మాట మొరటుగా ఉంది.

"పదివేల రూపాయలిస్తాను. నువ్వో హత్యచేయాలి." అన్నాడు ప్రభాకర్.

జగ్గన్న ప్రభాకర్‌వంక చురుగ్గా చూశాడు. "ఎందుకు?"

"కారణాలడగొద్దు...."

"కారణం తెలియందే నేను నేరం చేయను...."

"కారణమెందుకు నీకు?"

"నేను కిరాయిగూండాని. కానీ నేనెప్పుడూ అమాయకుల జోలికి వెళ్ళలేదు. ఒకరి స్వార్థానికి సహకరించడానికి నేను నేరం చేయను. కోర్టుశిక్ష విధించలేని చోట—నేరస్థుడిని నేను శిక్షిస్తాను. ఒక నేరస్థుడు సమాజంలో గౌరవంగా బ్రతుకుతూంటే—వాడి నేరానికి ఫలితాన్నను భవిస్తూ అసహాయంగా ఉండిపోయే అభాగ్యులకు సాయపడతాను నేను...." అన్నాడు జగ్గన్న గంభీరంగా.

ప్రభాకర్ చాలాసేపటిదాకా అసలు విషయం బయట పెట్టకూడదనే అనుకున్నాడు కానీ అది తప్పనిసరి అని గ్రహించేక—"నేరస్థుడి పేరు భాస్కర్రావు. వాడు నా చెల్లెల్ని మానభంగం చేశాడు...." అన్నాడు.

జగ్గన్న పేలవంగా నవ్వి—"అయితే?" అన్నాడు.

"అయితే అంటావేమిటి? నా రక్తం మరిగిపోతుంటే....!" అన్నాడు ప్రభాకర్.

"ఎందుకు మరిగిపోతోంది నీ రక్తం! జరిగిన అవమానానికి నీ చెల్లి ఆత్మహత్య చేసుకుందా?"

"లేదు...."

"ఆమె జీవితం నాశనమయిందా—?"

"లేదు...."

"ఆమెకిక వివాహం కాదన్నభయం నీకుందా?"

"నాక్కావలసినంత డబ్బుంది. ఆ డబ్బు నా తప్పులన్నింటినీ మాఫ్ చేయగలదు. కేవలం డబ్బుకోసమే కాక—నా చెల్లెని ప్రాణప్రదంగా ప్రేమిస్తున్న స్నేహితుడున్నాడు నాకు. అతడు వెంటనే ఆమెను వివాహం చేసుకుంటానన్నాడు...."

"అయితే నీలో ఆగ్రహం దేనికి?" అన్నాడు జగ్గన్న.

"జగ్గన్నా! నా ఆవేశం నీకర్థంకాదు. ఎలా చెప్పాలో నాకు తెలియదు. పదివేలిస్తాను. ఆ భాస్కర్రావు ప్రాణాలు తీయి—" అన్నాడు ప్రభాకర్.

"మనచుట్టూ ఎందరో నేరస్థులు తిరుగుతున్నారు. వాళ్ళవల్ల అనుక్షణం నష్టపోతూ కూడా మనమేమీ చేయలేక పోతున్నాం. మన జీవితం సాఫీగా నడిచిపోవడానికి అడ్డం రానంతకాలం—ఎలాంటి నేరాన్నయినా సహించడమే మంచిది. నా మాట విను. ఉత్తపుణ్యాన నాచేత హత్య చేయించకు—" అన్నాడు జగ్గన్న.

"జగ్గన్నా — నీ గురించి విన్నాను తప్ప నిన్ను చూడడం నాకిదే ప్రథమం. నువ్వు చదువుకోలేదు కాబట్టి నీ కర్థం కాదు. నేను చెప్పేది జాగ్రత్తగా విను...." అన్నాడు ప్రభాకర్.

"ఎందుకు నాకింతగా నచ్చజెప్పటం?" అన్నాడు జగ్గన్న విసుగ్గా.

"నువ్వు తలచుకుంటే ఆ యమధర్మరాజుకి కూడా తెలియకుండా హత్యలు చేయగలవు. నీపేరూ నాపేరూ బైటకు రాకుండా హత్య జరగాలి. ఈ హత్య కారణంగా నాకేమో అవుతుందని నా చెల్లి భయం. ఆ భాస్కర్రావు నేమీ చేయనని నన్ను హామీ అడిగింది...."

"సరే చెప్పు...."

"ఆడది ఈ సృష్టికి వరం. ఆమె తను స్వార్థపరురా లన్న పేరు తెచ్చుకుని తనవారికోసం తన శ్రమను ధార పోస్తుంది. ఆమె మనసెంతో సున్నితమైనది. ఇతరుల కోరికలు తీర్చటంలోనే ఆమె కానందం. అలాంటి స్త్రీకి జీవితంలో దుర్భరమైన దేమిటో తెలుసా?"

జగ్గన్న తల అడ్డంగా ఊపాడు.

"ఇష్టపడిన పురుషుడికోసం ప్రాణాలైనా యివ్వగల స్త్రీ—ఇష్టంలేని పురుషునికి లొంగిపోయేటప్పుడు పడే వేదన దుర్భరం. అది ఏ నరకంలో లభించే శిక్షకన్నా ఎన్నోరెట్లు పెద్దది. ఈ విషయం నేనెన్నో పుస్తకాల్లో చదివాను. ఎన్నో పరిశోధనా గ్రంథాల్లో చదివాను. విదేశాల్లో ఆడవాళ్ళతో యింటర్వ్యూలు చదివాను. నా చెల్లెలీ అన్యాయానికి గురయిందంటే నాకు బాధగా ఉండదూ?"

జగ్గన్న మాట్లాడలేదు.

"జగ్గన్నా! మానభంగం వల్ల ఆడదాని కాపురం చెడిపోకపోతే ఫరవాలేదనుకునే మన స్తత్వం నశించాలి. మానభంగం హత్యకు మించిన ఘోరమైన శిక్ష. ఆ నేరంచేసిన వాడికి మరణమే తగిన శిక్ష...." అన్నాడు ప్రభాకర్.

"అంటే ఇది నీ తీర్పా?"

"అవును...."

"అయితే ఆ భాస్కర్రావు పనై పోయిందనే అనుకో."

ప్రభాకర్ అక్కడ ఓ వందరూపాయల నోట్లకట్ట వదిలి వెళ్ళాడు.

4

"ఏమిటిలా వచ్చావు?" అన్నాడు ప్రభాకర్ ఆశ్చర్యంగా.

"భాస్కర్రావును రెండో కంటి వాడికి తెలీకుండా హత్యచేసి వస్తున్నాను" అన్నాడు జగ్గన్న.

ప్రభాకర్ ముఖంలో సంతోషం కనబడింది "వెరీగుడ్! కానీ నేనిక్కడుంటానని నీకెలా తెలుసు?"

"కిరాయి గూండాని. హంతకుణ్ణి. నాకు తెలీని ప్రదేశాలుండవు" అన్నాడు జగ్గన్న.

"చాలా సంతోషం. వెంటనే విషయం చెప్పినందుకు థాంక్స్!"

"నేను నీకు హత్యవిషయం చెప్పడానికి రాలేదు...."

"మరి?"

"చిన్నప్పుడే నాకు తలిదండ్రులు పోయారు. బంధువులింట్లో పెరిగాను. వాళ్ళు నన్ను తిన్నగా చూడలేదు. ఎదురు తిరిగాను. కొట్టేవారు. ఇంట్లోంచి పారిపోయాను. జులాయివాడినయ్యాను. గూండాగా మారాను. కానీ నా దృష్టి ఎప్పుడూ బంధువులింట్లో పెరుగుతున్న నా చెల్లి మీదనే ఉండేది. నాకు భయపడి వాళ్ళు దాన్ని బాగా చూసుకునేవారు. నా సంపాదనలో దాన్ని లోటులేకుండా పెంచుతున్నాను. నేను దాని అన్ననన్న విషయానికి

ఎక్కువ ప్రచారం రానివ్వలేదు....''

''ఇదంతా నాకెందుకు చెబుతున్నావు?''

''నా చెల్లెలుకూడా మానభంగానికి గురయింది. అందువల్ల దాని జీవితం నష్టపోలేదు కదా అని సరిపెట్టుకున్నాను. దానికి వెంటనే వివాహంకూడా అయింది. సుఖంగా ఉంది కదా అని సంతోషించాను. తన కన్యాయం చేసినవాడి జోలికి వెళ్ళవద్దని నన్ను హామీ అడిగింది నా చెల్లెలు....''

''అయితే?''

''కానీ నువ్వు చెప్పింది విన్నాక—నే నూరుకోవటం మంచిది కాదనిపించింది. ఎవరి చెల్లెలికో జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న నేను—నా చెల్లెలికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోనూ....''

''నువ్వేం చెబుతున్నావో నా కర్థంకావటం లేదు....''

''నా చెల్లెలి పేరు చంద్రావతి. దానిని నువ్వు మానభంగం చేశావు. అందుకు ప్రతీకారంగా ఏం చేయాలో తెలీక సతమతమవుతున్న నాకు నువ్వే దారి చూపించావు. ఒక నేరం విషయంలో న్యాయాధికారికి మించి తీర్పునివ్వగలవాడు నేరస్థుడు మాత్రమే! నేరంలోని లోతు, నేరానికి గురైన వ్యక్తి బాధ—నేరస్థుడికి మించి మరెవ్వరికీ అర్థంకావు....నీ తీర్పును నేను గౌరవిస్తున్నాను....నీ చెల్లెలికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునేందుకు నన్నే ఎన్నుకుని పెద్ద పొరపాటు చేశావు నువ్వు....నీ తీర్పు నీ ప్రాణాలు తీస్తోంది....'' అన్నాడు జగ్గన్న.

మనచుట్టూ తీర్పులుచెప్పే పెద్దలెందరో ఉన్నారు. తీర్పు చెప్పిన ప్రభాకరానికి పట్టిన గతి తెలిస్తే-ఆ పెద్దలందరూ తీర్పులు చెప్పడం మానేస్తారేమో?

అందుకే ఈ కథ! □

కొత్త సీరియల్ ప్రారంభం!

ఫాలనేత్రం

కసి తీర్చుకుంటున్నట్టు, కుండపోతగా వర్షం కురుస్తోంది.

ఆకాశాన్ని మెరుపులు కత్తుల్లా చీలుస్తున్నాయి. తుఫాను బీభత్సానికి గాలీ, ఉరుములూ నేపథ్య సంగీతం సమకూరుస్తున్నాయి.

ఎక్కడో పిడుగుపడింది. వాతావరణమంతా ఒక్కసారి కంపించినట్టయింది.

భయానకమైన గాలి వానలో అతను చీకూ చింతా లేకుండా నడుస్తున్నాడు. డార్క్ కలర్ దుస్తులమీద డార్క్ కలర్ రెయిన్‌కోటు మోకాళ్ళకింది దాకా అతన్ని కప్పింది. గాఢాంధకారంలో నీడలా నడుస్తున్నాడతను. వెడల్పాటి అంచున్న హేట్‌ని తప్పించుకుంటూ వానజల్లు అతని చెంపను తాకింది.

అంతవరకూ అతని పెదాలమధ్య మిణుగురు పురుగులా వెలుగుతోన్న సిగరెట్ ఆరిపోయింది. రెయిన్‌కోట్ జేబుల్లో దోపుకున్న చేతుల్ని అతని వెలికి తీయలేదు. అతని పెదాలు వదులయ్యాయి. తడిసిపోయిన సిగరెట్ కిందికి జారింది.

అతను ఆగి, వెనుదిరిగి చూశాడు.

దూరంలో సిటీలైట్స్ గుంపుగా అవుపిస్తున్నాయి. తుఫాను రోడ్డుని ఖాళీగా వుంచేసింది. తనింకా రెండు ఫర్లాంగులు నడవాలి. సిటీకి దూరంగా, ఇల్లు ఏర్పాటు చేసుకున్నందుకు మొట్టమొదటిసారిగా అతను సంతోషించాడు.

వెనక్కి తిరిగి నడవటం ప్రారంభించాడు. తను త్వరగా వెళ్ళాలి. ఆమె తనకోసం, తను ఇవ్వబోయే బహుమతికోసం వెయ్యికళ్ళతో ఎదురు చూస్తూంటుంది. ఆమెకి ధైర్యం ఎక్కువ. ఇలాంటి తుఫానుకి ఆమె భయపడదు!

అతని రెయిన్‌బూట్లు తారురోడ్డుమీద గమ్మత్తుగా శబ్దం చేస్తున్నాయి. కవాతు చేస్తున్న సిపాయిలా, లయతప్పకుండా అడుగులు వేస్తున్నాడతను. తను వేస్తున్న ప్రతి

అడుగూ మృత్యువును ఆమె దగ్గరగా తీసుకెళ్తోందని అతనికి తెలుసు.

కాస్సేపట్లో అతను తారురోడ్డు మీంచీ తన గమ్యస్థానానికి వెళ్తున్న కంకరరోడ్డులోకి తిరిగాడు. నల్లరాతిమీద సానపెడుతున్న కత్తుల్లా తళుక్కుమంటున్న మెరుపులు అతనికి కనిపించటంలేదు. ఉరుములశబ్దం అతని చెవుల్లో దూరటంలేదు. మెరుపుతీగల్ని వెక్కిరించే, కళ్ళని చెదరగొట్టే ఆమె శరీరం అతని మనోయవనికమీద ప్రత్యక్షమైంది. ఆమెని గురించిన ఆలోచన అతనిలో ఏదో ఉద్రేకాన్ని వేడిగా నింపుతోంది.

తను వెళ్ళేసరికి ఆమె పడగ్గదిలో, వడ్డించిన విస్తరిలా సిద్ధంగా ఉంటుంది. విస్తర్ని విసిరేసే ముందు వడ్డించిన పదార్థాల్ని లొట్టలువేస్తూ తినటంలో తప్పులేదు! తృప్తిగా భోంచేశాక విస్తర్ని గిరాటేస్తాడు తను. నలిపి దుమ్ములోకి విసిరేముందు గులాబీని ఆఘ్రాణించి ఆనందిస్తాడు.

ఆమె అందం తనని ఎప్పుడూ కలవరపెడుతూనే ఉంటుంది. ఆ సంగతి ఆమెకూ తెలుసు. అందం అందుబాటులో ఉండాలేగానీ, బంధం కాకుడదు. ఇది ఆమెకి తెలీదు. అందుకే ఆమె తనని కొంగులో ముడేసుకోడానికి నిరంతర ప్రయత్నం చేస్తోంది. ఇవాళిటితో ఆమె ప్రయత్నం మట్టిలో కలుస్తుంది.

జేబులో ఉన్న అతని చేతివేళ్ళు, నెక్టైని ప్రేమగా నిమిరాయి. ఆమెకోసం, ఎర్రటి నెక్టైని ప్రత్యేకంగా సెలెక్ట్ చేశాడతను. తను ఎర్ర నెక్టై కట్టుకోటం ఆమెకి ఇష్టంట! ఎవరికి ఇష్టమున్నవాటిని వాళ్ళే కట్టుకోడం మంచిది!

అతని వేళ్ళు మళ్ళీ ఉద్రేకంతో కదిలాయి. సన్నటి

ఆమె మెడని తన వేళ్ళు ప్రేమగా నిమురుతాయి. ముందుగా తను తలగడకింద దాచిపెట్టే ఎర్ర నెక్‌టై పాములా ఆమె మెడని సరైన క్షణాల్లో చుట్టుకుంటుంది. సృష్టికార్యం, లయకార్యం ఒకే క్షణంలో జరిగితే, అది కోటిరెట్లు థ్రిల్లింగ్‌గా ఉంటుందని ఎందుకో అనిపిస్తోందతనికి. తన చేతుల్లో స్వర్గంలో విహరించే శూన్యక్షణంలో ఆమె ఆ స్వర్గంలోనే శాశ్వతంగా స్తంభించిపోతుంది!

కాలనీలో ఏ ఇంట్లోనూ దీపాలు వెలగటంలేదు. కానీ, తన ఇంట్లో లైట్లు వెలుగుతున్నాయి. అయిదునిమిషాల్లో ఆతను వర్షంలోంచీ వరండాలోకి చేరుకున్నాడు. అతని కుడిచెయ్యి జేబులోంచీ ఇవతలికి వచ్చి తలుపుమీద చప్పుడు చేసింది.

ఆలస్యం లేకుండా తలుపు తెరుచుకుంది. ఆరితేరిన చిత్రకారుడు వేసిన అప్సరసలా, గుమ్మంలో ఆమె నిలబడింది. పచ్చటి నైట్‌గౌన్ లోంచీ, నివురువెనక దాగిన నిప్పులా ఆమె శరీరం కనిపిస్తూంది.

"థాంక్‌గాడ్! వచ్చేశావ్! రావేమో అనుకుని హడిలి చచ్చాను!" అందామె నవ్వుతూ.

జవాబుగా ఆమెకి తెల్లటి పళ్ళుచూపిస్తూ అతను లోపలికి జరిగాడు. ఆమె తలుపుమూసి గొళ్ళెం బిగించింది. రెయిన్‌కోటుని తలుపుపక్కనే కుప్పగా పడేశాడతను. ఆమె ఆక్షేపణగా చూసింది. ప్రతి పనిలోనూ నిర్లక్ష్యం! ఆ అలవాటు ఎంతకాలమైనా వదిలేలా లేదు అతన్ని....

"నేను భోంచేశాను...." అందామె.

"మంచిపని చేశావు."

"వడ్డించనా?"

"వొద్దు. నిన్ను చూస్తూంటే ఆకలేయటంలేదు!" బాత్

రూమ్‌వేపు అడుగులేస్తూ అన్నాడతను.

"డార్లింగ్ ...."

అతను ఆగి వెనుదిరిగి చూశాడు. బాబ్డ్ హెయిర్‌లోకి చేతులుదోపుకుని అతన్ని నవ్వుతూ చూస్తోంది. "హార్లిక్స్ కలపనా?"

"కాఫీ." ప్రయత్నించి ఆమె మీంచీ చూపుల్ని తిప్పుకుంటూ అన్నాడతను.

* * *

చీకట్లో, వర్షంలో అతను మెల్లిగా కదిలాడు. భుజానికి వేళ్ళాడుతున్న వాటర్‌ప్రూఫ్ ప్లాస్టిక్ సంచిని పిట్టగోడమీద భద్రంగా పెట్టాడు.

రెండుచేతుల్నీ గోడమీద ఆనుకుని, గాజు పెంకులు లేనందుకు సంతోషిస్తూ పిల్లిలా పైకి గెంతాడు. కాళ్ళు లోపలికి వదిలి, పెరట్లోకి జారాడు.

మెత్తబడిన నేలలో బూట్లు దిగబడుతున్నాయి. బాగ్‌ని భుజానికి తగిలించి, ఇంటివేపు మెల్లిగా, బరువుగా పాదాల్ని లాగుతూ నడిచాడు.

వరండా చేరుకుని, తడిసిపోయిన మొహాన్ని అరచేత్తో తుడుచుకున్నాడు. గాలివానలో, ఇలా నడవడం కష్టంగానే వున్నా, ఈ వాతావరణం తనపనికి చక్కగా దోహదం చేస్తుంది. కిటికీ దగ్గరగా గోడకి జార్లాబడి చెవులు రిక్కించాడతను. లోపల్నుంచీ తగ్గు స్వరంలో మాటలు వినిపిస్తున్నాయి.

"హార్లిక్స్ కలపనా?" ఆమె కంఠం.

"కాఫీ." అతని కంఠం.

తను సకాలంలో గమ్యస్థానం చేరుకోగలిగాడు. సిటీ లిమిట్స్ నుంచీ దూరంలో అతన్ని వెంబడిస్తూ, సమయా

నికి అందుకోలేదేమో అని తను కంగారుపడ్డాడు. తనకి ఇంకా అరగంట వ్యవధి ఉన్నట్టుంది.

జేబులోంచి రుమాలు తీసి, అరచేతుల్ని రుద్దుకున్నాడు. సిగరెట్‌ని పెదాలమధ్య ఇరికించి, లైటర్ని నొక్కుతూ, అరచేతిని దానికి చాటుగా వుంచాడు. లైటర్ని జేబులో పడేసుకుని, రెండు చేతుల్నీ గిన్నెలాచేసి, సిగరెట్ వెల్తురు బైటికి కనిపించకుండా పొగ పీల్చసాగేడు....

* * *

నిలువుటద్దం ముందు టర్కిష్ తువ్వాలుతో తల తుడుచుకుంటున్న అతని చేతులు కదలడం మానేశాయి. కాఫీ కప్పుల్తో వస్తున్నశోభ అతనివైపు నవ్వుతోంది. అమరశిల్పి జక్కన్న చెక్కిన బేలూరు శిల్పసుందరి ప్రాణంతో తనవేపు కదుల్తున్నట్టనిపించిందతనికి.

త్వరలో ఆ శిల్పం నిర్జీవంగా తయారవుతుంది; శిథిలమైపోతుంది! అంత అందం అంతరించిపోతుందన్న భావం అతనిలో విచారాన్ని పుట్టించింది. కానీ తప్పదు. క్లియోపాత్రా కూడా అంతరించింది....

కాఫీకప్పుల్ని బల్లమీదపెట్టి శోభ అతని వెనక్కి జరిగింది. వెనకనుంచీ ఆమె చేతులు తీగల్లా అతన్ని చుట్టేశాయి.

ఆమె శరీరం కుంపటిలా అతని వీపుకి తగుల్తోంది. శోభ చెంపని అతని వీపుమీద ఆన్చింది.

"డార్లింగ్ ...."

"ఊఁ...." ఇంకా తలమీదేవున్న టర్కిష్ తువ్వాల్ని దూరంగా విసురుతూ అన్నాడు గణపతి.

"నే నింక నిన్ను వదిలి వెళ్ళను. ఇక్కడే వుండి పోతాను!" శోభ ఆవేశంతో అంది.

"శాశ్వతంగా!" అద్దంలో తన ప్రతిబింబాన్ని చూస్తూ అన్నాడతను. అతన్ని చుట్టిన తీగలు బిగుసుకున్నాయి. అలాగే వెనక్కి తిరిగి, ఆమె మొహంలోకి నవ్వుతూ చూశాడతను. శోభకళ్ళు వెలుగుతున్నాయి.

"కాఫీ చల్లారిపోతుంది...." ఆమె చేతుల్ని విడిపించు కుంటూ అన్నాడతను. బీరువా తలుపుతీసి నెపోలియన్ బ్రాందీ బుడ్డీని ఇవతలికి తీశాడు. టేబుల్ ముందు ఆగి, కాఫీలోకి కొంచెం బ్రాందీ వొంపాడు.

"జలుబు చేయకుండావుందు!" అన్నాడు ఆమెవైపు చూస్తూ. శోభ మాట్లాడలేదు; నవ్వలేదు. కాఫీ చప్పరించ డం ప్రారంభించింది. ఈ వాతావరణంలో అతను బ్రాందీ తాగడం తనకి కూడా మంచిది!

నిమిషాలు గడుస్తున్నాయి....

* * *

ఇరవై నిమిషాలు గడిచాయి.

వరండాలో, రెండో సిగరెట్ని తోటలోకి విసిరి అతను అసహనంగా కదిలాడు. వాళ్ళెందుకు కాలాన్ని వృధా చేస్తున్నారు? అతను ఉలిక్కిపడ్డాడు. కిటికీ అద్దాల గుండా మసగ్గా వస్తున్న వెల్తురు మాయమైంది. చిన్నగా నవ్వుకుంటూ అతను కదిలాడు. ఇంటి ముందువైపుకి నడవసాగేడు.

వరండా చివరున్న కిటికీ ముందు ఆగి చెవులు రిక్కిం చాడు. మాటలు వినపడ్డంలేదు. అతని చెయ్యి మెల్లగా కిటికీ పైభాగంలోని అద్దంవైపు పాకింది. ఫ్రేమ్ మరీ లైట్గా వున్నట్టుంది. గాలికి తలుపు కదలడంలేదు. దానికి చిరత బిగించలేదని తనకి తెలుసు....

తటాలున ఆ గదిలోని ఫ్లోరసెంట్ ట్యూబు ఆరిపో

యింది. తృప్తికరంగా నవ్వుకుంటూ అతను కిటికీ తలుపుని పూర్తిగా లోపలికి తోశాడు. ముందు జాగర్తతో తను జేబులో పడేసుకున్న కొయ్యముక్కని తలుపుకీ, ఫ్రేమ్‌కీ మధ్య ఇరికించాడు. ఇప్పుడు భయంలేదు. గాలికి తలుపు మూసుకుపోదు.

భుజానికి వేళ్ళాడుతున్న బాగ్‌ని తీస్తూ వరండామీద గొంతుకూర్చున్నాడు. జిప్‌లాగి, తన సరంజామాను ఇవతలికి లాగాడు. రెండు నిమిషాల్లో అంతా సిద్ధం చేసుకుని, స్ట్రాప్‌ని భుజానికి తగిలిస్తూ లేచి నిలబడ్డాడు.

గదిలో మంచం పక్కనేవున్న చిన్నటేబుల్ మీదున్న జీరోవాట్ బల్బు వెలుగుతోంది. రెడ్‌లైట్! కొంచెం కదిలి, కెమెరాను అడ్జెస్ట్ చేసుకుంటూ అతను వ్యూ ఫైండర్‌గుండా చూశాడు....

ఎర్రటి వెల్తురు పల్చగా చల్లిన కుంకుమలాగా డబుల్ బెడ్ మీద పరుచుకుంది. పరుపుమీద ఆమె అగ్నికన్యలా పడుకుంది. కెమెరా వెనక అతని పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. క్షణాలు గడుస్తున్నాయి.

ఆమె చేతులు ముందుకి సాగాయి. గణపతి శరీరం లెన్స్‌కీ, ఆమెకీ మధ్య గోడలా నిలబడింది. ఈవ్‌లాగా ఎదురుచూస్తున్న ఆమె దగ్గిరగా, ఆడమ్‌లా కదుల్తున్నాడతను....

కెమెరా వెనక అతను నవ్వుకున్నాడు. త్వరలో ఆడమ్ నిషిద్ధఫలాన్ని భక్షిస్తాడు. తరవాత ఫలితం అనుభవిస్తాడు....అతను వోపిగ్గా నాటకం చూడసాగేడు. నిమిషాలు బరువుగా దొర్లుతున్నాయి....

కెమెరా లెన్స్‌గుండా, టీవీ స్క్రీన్ మీద బ్లూబొమ్మల్లా వాళ్ళు కనిపిస్తున్నారతనికి. అతని వేలు నిర్ఛయంగా

కదిలింది. కెమెరా ఫ్లాష్, తళుక్కున మెరిసిన మెరుపులో లీనమైపోయింది. మెరుపులు మెరుస్తున్నంతసేపూ ఫ్లాష్ గురించి తను భయపడనక్కర్లేదు.

తన 'ఏకాక్షి' ముందు సాగుతున్న తంతు అతనిలో ఎలాంటి భావాన్నీ కలిగించడంలేదు. తను చూసిన వంద లాది బ్లూ ఫిలిమ్స్‌లో ఇదీ ఒకటి!

మెరుపులు మెరుస్తున్నాయి. కెమెరా ఫ్లాష్ తళుక్కు, తళుక్కుమంటోంది నిమిషాలూ, శ్నాప్‌లూ దొర్లు తున్నాయి. అతను బరువుగా నిట్టూరిస్తూ, వెనక్కి జరగ బోయాడు. ఏదో కదలిక అతన్ని ఆపింది.

మంచంమీద....అతని మొహంలో ఏదో మార్పు గోచరిస్తోంది. ఆమె కళ్ళు మూతలు పడ్డాయి. అతని చెయ్యి దిండుకింది నుంచీ ఇవతలికి సాగింది.

కెమెరాలోంచీ చూస్తున్నతను ఎందుకో ఉలిక్కి పడ్డాడు. ఎర్రటి నెక్‌టై....అతని చేతులు ఆమె మెడకింద దూరాయి. ఆమె చేతులు అమాయకంగా అతని మెడను అల్లుకున్నాయి.

రెడ్‌నెక్‌టై ఆమె మెడచుట్టూ బెల్టులా చుట్టుకుంటోంద. లెన్స్‌గుండా అతను అయోమయంగా చూస్తూ ఉండి పోయాడు. ఏంజరుగుతోంది?

అతని చేతులు బిగుసుకుంటున్నాయి. ఆమె కదుల్తోంది. అతని చేతుల్లో నెక్‌టై బిగుసుకుంటోంది. ఆమె కంగారుగా కదుల్తోంది....

జరుగుతోంది ఏమిటో అతనికి అర్థమైపోయింది. తను ఊహించని సీను తనముందు నటించబడుతోంది! అతని వొళ్ళు వణకసాగింది. లోపలికి దూసుకెళ్ళి జరుగుతున్న

దారుణాన్ని ఆపమని అతనిలోంచీ మనిషి బొబ్బలెడు తున్నాడు. అతను కదల్లేదు. పెదవిని పళ్ళతో నొక్కి-పట్టాడు.

అతనిలో ఏదో మెరుపులా మెరిసింది. కంగారునీ, ఉద్రేకాన్నీ అణుచుకుంటూ అతను తన పనికి ఉపక్ర మించాడు.

గదిలో, మంచంమీద అతని చేతులు గజబిలంతో కదిలాయి. ఎర్రటినాలుక, ఎర్రటి పెదవులమధ్య పొడుచు కొస్తోంది.

కిటికీముందు అతని వేళ్ళు కదిలాయి. అతని కోసమే అన్నట్టు మెరుపు మెరిసింది.

గదిలో మంచంమీద ఆమె శరీరం కదలడం మానేసి స్తంభించింది. ఆ దృశ్యం అతని కెమెరాలోని ఫిలిమ్‌మీద స్తంభించింది. ఇంకా సగం పైగా శ్నాప్స్ వున్నాయని అతనికి తెలుసు. గదిలోని వ్యక్తికి కూడా ఇంకా సగం పనివుంది!

గుడ్లగూబలా, చూస్తూ అతను అలాగే నిలబడ్డాడు....

* * *

గంట గడిచింది.

గడ్డపారనీ, పారనీ పైకి గిరాటేసి గణపతి వాగురుస్తూ, పడుతూలేస్తూ గుంటలోంచీ పైకెక్కాడు.

వర్షం విసుగూ విరామం లేకుండా కురుస్తోంది. ప్రకృతి తనలాంటి మనిషికి ఎప్పుడూ సహకరిస్తుంది! అదర గొడుతున్న వర్షాన్నీ, ఎముకల్ని కొరుకుతున్న చలినీ నిర్లక్ష్యంచేస్తూ అతను ఇంటివేపు నడిచాడు.

మరో పావుగంటలో 'గతం' భూస్థాపితం అయి పోతుంది. తను ఈ వర్షంకురుస్తున్న రాత్రిలో తవ్విన

గుంట తన గతానికి సమాధిగా, భవిష్యత్తుకి పునాదిగా భాసిస్తుంది। అతను తృప్తికరంగా నవ్వుకుంటూ గబగబా అడుగులేశాడు....

గుంటకి కొంచెందూరంగా, చింతచెట్టు చాటులో అతను అలాగే నిలబడ్డాడు.

తను మళ్ళీ ఇంటిదాకా నడవాల్సిన అవసరంలేదు. అతనే ఆమెని తీసుకొస్తాడు. క్లైమాక్స్‌సీన్ త్వరలో ముగుస్తుంది. తను ఊహించని మలుపు తిరిగిన నాటకానికి తెరపడుతుంది....

అరగంట తరవాత, అతను కంకరరోడ్డుమీంచీ మెయిన్‌రోడ్డు మీదికి తిరిగాడు. సంచిలో, కెమెరా మునపటికన్నా బరువుగా వేళ్ళాడుతోంది. వర్షంకురుస్తున్న రాత్రి తన గుండెని రాయిగా మార్చేసింది.

అతను గబగబా సిటీవైపు అడుగులు వేయసాగేడు.

2

గ్లాసులోని విస్కీని పూర్తిగా నోట్లో వొంపుకుని, గణపతి తృప్తిగా నిట్టూర్చాడు. ప్లేట్లోని జీడిపప్పుని నోట్లో వేసుకుని నముల్తూ సిగరెట్ వెలిగించాడు. విశ్రాంతిగా కుర్చీలో వెనక్కివాలాడు. నాలుగు రోజులుగా, ఏదో బరువుని చేత్తో తీసేసినట్టు హాయిగా వుందతనికి.

అనుకున్న విధంగా శోభని అనుభవించాడు. అనుకున్న విధంగా ఆమెని అంతమొందించాడు. ఇంక తను పెళ్ళాడి, కొత్త జీవితంలోకి నిర్భయంగా అడుగుపెట్టగలడు।

శోభ! ఆమెలోని దురాశ ఆమెని మింగి, జీర్ణం చేసేసుకుంది. తను నిమిత్తమాత్రుడు! శోభతో సాగిన తన జీవితాన్ని ఒక కలలా భావించి మరిచిపోవడానికి నిశ్చయించుకుంటూ అతను కళ్ళు మూసుకున్నాడు.

గణపతి ఉలిక్కిపడ్డాడు. కాలింగ్‌బెల్ మోగింది. ఎవరు? తన మిత్రులెవరూ ఇవాళ తనింటికిరారు. ఆలోచిస్తూ అతను గదిలోంచీ హాల్లోకి నడిచాడు. కాలింగ్‌బెల్ మళ్ళీ మోగింది. గబగబా వెళ్ళి, తలుపు తెరిచి వరండాలో నించున్న అపరిచిత వ్యక్తిని ప్రశ్నార్థకంగా చూశాడు.

బ్లూ జీన్స్‌లోకి ఎర్రగళ్ళ శ్లాక్‌ని దోపుకున్నాడతను. పొడుగ్గా, బలంగా అవుపిస్తున్న విగ్రహం. అరంగుళం పొడవు పెరిగిన గెడ్డం. గుబురు కనుబొమల కిందినుంచీ, రవ్వల్లా చూస్తున్న చిన్నకళ్ళు.

"మిస్టర్ గణపతి ...." అంటూ ఆగాడతను.

"మీరెవరు?" గణపతి ప్రశ్నించాడు.

చిరునవ్వుతో అతని పెదవులు విచ్చుకున్నాయి. తెల్లటి పళ్ళు తళుక్కుమన్నాయి.

"నిటలాక్షరావుగారు పంపించారు ...." అన్నాడతను, తనపేరు చెప్పకుండా.

గణపతి కళ్ళు చిట్లించాడు. "ఆయనెవరు?"

ఆ వ్యక్తి మాట్లాడకుండా అటూ ఇటూ చూశాడు. కళ్ళని గణపతివైపు తిప్పి తదేకంగా చూశాడు. "అంతా చెప్పడానికి అరగంట పడుతుంది. లోపలికెళ్దాం ...."

గణపతి అతన్ని ఎగాదిగా చూశాడు. "అపరిచితులు పంపిన దూతలతో నేను మాట్లాడను. ఆ నిటలాక్షరావెవడో నాకు తెలీదు ...."

అతను చిన్నగా నవ్వాడు. "శోభ మీకు తెలుసు! ...." అన్నాడతను క్లుప్తంగా.

గణపతి ఉలిక్కిపడ్డాడు. శోభ గురించి తనతో మాట్లాడుతున్న వ్యక్తి ఎవరు? అతన్ని పంపిన వ్యక్తి ఎవరు?

"మిస్టర్ గణపతీ, నిటలాక్షరావుగారు శోభకి దగ్గర చుట్టం.... అన్నట్టు లోపలికెళ్దామా, ఇక్కడే మాట్లాడు కుందామా?" అతని కంఠంలో నిర్లక్ష్యం ధ్వనిస్తోంది. గణపతి అతన్ని పరిశీలనగా చూశాడు. చిన్నకళ్ళు చిలిపిగా నవ్వుతున్నాయి. గణపతి, తలుపు బార్లా తెరిచి, పక్కకి తప్పుకున్నాడు. అతను లోపలికి దూరాడు. గణపతి తలుపుమూసి, అతనివైపు తిరిగాడు.

"గదిలోకెళ్దాం...." అంటూ కదిలాడతను. అసహనంగా గణపతి అతన్ని దాటి గదిలోకెళ్ళాడు. టేబుల్ ముందున్న కుర్చీలో కూచుని ఆ వ్యక్తి నవ్వుతూ చూశాడు. "కూచోండి!" అన్నాడతను, ఇంకా నిలబడేవున్న గణపతితో.

గణపతి కూచున్నాడు, అప్రయత్నంగా. ఆ వ్యక్తి టేబుల్ మీదున్న ఖాళీ విస్కీ బుడ్డీనీ, లోటానూ చిరునవ్వుతో చూశాడు.

"సెలిబ్రేట్ చేసుకుంటున్నారా?" నవ్వుతూ అన్నాడు అతను. "మీరు సంతోషంగా పండగ చేసుకోడానికి కారణం ఉందనుకోండి!"

గణపతి ఆగ్రహంతో చూశాడు. "వచ్చిన పని చెప్పి, వచ్చినదారినే వెళ్ళిపొండి!"

అతను చిన్నగానవ్వాడు. "తప్పకుండా! చల్లకివచ్చాను. కూడా తెచ్చిన పెద్ద ముంతను దాచుకోనులెండి!" అంటూ అతను సిగరెట్ వెలిగించాడు. పొగలోంచీ గణపతిని తీక్షణంగా చూశాడు.

"మిస్టర్ గణపతీ, నిటలాక్షరావుగారికి అర్జెంటుగా పాతికవేలు కావాలిట...."

గణపతి అర్థంకానట్టు చూశాడు. "అయితే?"

అతను జేబులోంచి ఒక కవర్ని తీసి, గణపతిముందుకి విసిరాడు. "ఈ వస్తువుల్ని మీరు కొనుక్కొని పాతికవేలు ఇస్తారేమో కనుక్కురమ్మన్నారు."

గణపతి కవర్ని వోసారి చూసి, ఆవ్యక్తివైపు విసుగ్గా చూశాడు.

అతను ముందుకు వంగి కవర్ని అందుకున్నాడు. కవర్లోంచీ అరడజను ఫోటోల్ని లాగి, పేకముక్కల్లా అర్ధ చంద్రాకారంలో విడదీశాడు. ముందుకి వంగి, గణపతి ముందు వాట్ని జాగ్రత్తగా పరిచాడు. నవ్వుతూ వెనక్కు వాలాడు.

అప్రయత్నంగా గణపతి తనముందు పరిచిన ఫోటోల్ని చూశాడు. అతని మొహంలోని రక్తమంతా క్షణంలో మాయమైంది. ఎండిపోతూ, పెదవులు అదరడం ప్రారంభించాయి. చర్మం బిగుసుకుపోతోంది. రోమాలు కత్తుల్లా నిక్కబొడుచుకుంటున్నాయి. ఆవ్యక్తి గణపతిలో అవుపిస్తున్న మార్పుల్ని తృప్తికరంగా చూశాడు.

"మీరు ఇష్టపడతారని కలర్లో తీశారు నిటలాక్షరావు గారు...." అన్నాడతను మెల్లిగా నవ్వుతూ. "ఆరాత్రి జరిగిన సంఘటనల్ని మీ సౌకర్యంకోసం వరసక్రమంలో అరేంజ్ చేశారు."

పోర్నోగ్రఫీ పుస్తకాల్లోని కలర్‌ఫోటోల్లా ఉన్న, తననీ, శోభనీ వివిధ భంగిమల్లో చూపిస్తున్న....శోభ మెడచుట్టూ నెక్‌టై బిగిస్తున్న తనని చూపిస్తున్న....నాలుక ఎర్రగా పొడుచుకొచ్చిన శోభని చూపిస్తున్న, తను శోభని గోతిలోకి దించుతున్న, గోతిని పూడ్చేస్తున్న ఫోటోల్ని రెప్ప వేయకుండా, ఊపిరి పీల్చుకోకుండా చూశాడు గణపతి.

ఫోటోల దగ్గిరగా, టేబుల్ మీదున్న అతని చేతులు వశంతప్పి వణకడం ప్రారంభించాయి. తాగిన విస్కీ అంతా వాంతయ్యేలా అనిపిస్తోందతనికి. వణుకుతున్న చేతుల్తో అతిప్రయత్నంమీద ఫోటోల్ని కలిపి, బోర్లించా డతను. గాలానికి తగులుకున్న చేపలా ఉక్కిరిబిక్కి రవుతూ చూశాడు.

"ఇది బ్లాక్ మెయిల్ అని మీరు అనుకోవచ్చు. మీకు సంబంధించిన ఆస్తి అది: మీ ఆస్తిని మీరు కాదంటేగానీ మరొకరికి అమ్మడం జరగదని ఆయన మీతో చెప్ప మన్నారు. మీది మీకు ఇవ్వడం ధర్మం అని ఆయన భావించారు...." సిగరెట్ పొగ ఊదుతూ పళ్ళికిలిస్తూ అన్నా డతను.

గణపతి ఆందోళనతో చూశాడు "....ఇది....ఇది.... అన్యాయం" అన్నాడతను తడబడుతూ.

ఆ వ్యక్తి సిగరెట్ పీకని కిందికి విసిరి, పకపక నవ్వాడు. "అందాలభరిణ అయిన శోభని, మిమ్మల్ని ప్రేమించిన శోభని పీకనొక్కి చంపడం న్యాయం: కదూ?"

గణపతి ఎర్రటి కళ్ళతో చూశాడు. ఆ వ్యక్తి తదేకంగా గణపతి కళ్ళల్లోకి చూశాడు.

"మిస్టర్ గణపతీ, ఇంకో ముఖ్యవిషయం మీకు చెప్పాలి; పిచ్చి ఆలోచనలు చేయకండి. నేను—నిర్దేశించ బడిన వ్యవధిలోగా ఆయన్ని క్షేమంగా, లాభంగా కల్సు కోవాలి. లేకపోతే ఆ ఫోటోల కాపీలు 'నేరప్రపంచం', 'పరిశోధన' వగైరా పత్రికలకీ, క్రైమ్‌బ్రాంచీకీ అందజేయ బడతాయి. అన్నట్టు చాలా పత్రికలు డబ్బుని చింత పిక్కల్లా వెదజల్లి వాట్ని కొంటాయి. చెప్పొచ్చేదేమి

టంటే, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎందుకైనా నేను ఆయన తరఫున మిమ్మల్ని కల్సుకుంటూ వుంటాను. నేను క్షేమంగా వుంటే మీరూ క్షేమంగా ఉంటారు!"

గణపతి గడగడ వణుకుతూ, మౌనంగా కూచుండి పోయాడు. ఎన్నో ఆలోచనలు మాటలుగా బైటపడలేక, అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

"మంచినీళ్ళు తాగండి" ఆ వ్యక్తి సలహా ఇచ్చాడు. గణపతి అసంకల్పితంగా అతని సలహా పాటించాడు. అతను వొంగి గణపతి బల్లమీద పడేసిన సిగరెట్ పాకెట్‌ని అందుకుని సిగరెట్ ముట్టించాడు. వినాయకుడిలా కూచున్న గణపతిని చిరునవ్వుతో చూశాడు. ముందుకి వొంగి ఫోటోల్ని అందుకుని కవర్లో పెట్టి జేబులో పడేసుకున్నాడు. లేచి నిలబడి అతన్ని నవ్వుతూ చూశాడు.

"ఆల్‌రైట్, ఆ ఆస్తిని సొంతం చేసుకోడానికి మీరు తయారుగా లేరని ఆయన్తో చెప్తాను. గుడ్‌బై!" అన్నాడతను కుర్చీని వెనక్కి తోస్తూ. గణపతి ఆదుర్దాగా, అయోమయంగా చూశాడు.

"నో!....కూచోండి...."

అతను నవ్వుతూ కూచున్నాడు.

"నాదగ్గిర....అంత మొత్తం లేదు. నమ్మండి!" గణపతి ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

అతను చిన్నగా నవ్వాడు. "ఎవరు ఏం చెప్పినా, ఆయనా నేనూ నమ్ముతాం. అయితే పెద్దగా పట్టించుకోం!"

గణపతి నిస్సహాయంగా చూశాడు. "నా దగ్గిర పది వేలు మాత్రం ఉంది. ఆయనకి మీరు చెప్పండి. అదికూడా ఇవాళ....లేదు...."

"ఫరవాలేదు. రేపటిదాకా మీకు వ్యవధి మంజూరు

చేశారాయన. అయితే మీరు పాతికా ఇవ్వాలి. ఆయన బేరాలు చేయరు. మాటవరసకి ఆయన ప్రస్తుతం యాభై వేలు కక్కమని అంటే మీరేం చేస్తారు? ఎలాగో కక్కేస్తారు. అయితే నిటలాక్షరావుగారు రీజనబుల్ వ్యక్తి. ఆయనకి అత్యాశలేదు!"

గణపతి బలహీనంగా, భయంతో కళ్ళు మూసుకుంటూ తలని వెనక్కి వాల్చాడు. అతను చెప్పేదీ నిజమే. యాభై వేలు అడిగినా, ఎంతడిగినా తను చచ్చినట్టు ఇవ్వాల్సిందే. ఉక్కు పిడికిలి తనచుట్టూ బిగుసుకుంది! అతను మెల్లిగా కళ్ళు తెరిచాడు.

"మీపేరు నాకు తెలీదు...."

ఆ వ్యక్తి చిరునవ్వు నవ్వాడు, "ప్రస్తుతానికి నక్షత్రక మూర్తి అనుకోండి!"

గణపతి బరువుగా నిట్టూర్చాడు. "ఎలాగో సర్దుతాను. ఆ నెగటివ్‌లు నాకు ఇచ్చేస్తారా?"

నక్షత్రకమూర్తి కళ్ళు పెద్దవిచేసి నమ్మలేనట్టు చూశాడు. "అది నాకు తెలీదు. మొదట మీరు ఆయన్తో వ్యాపారం చేయండి. తనతో బిజినెస్ చేసే వ్యక్తుల్ని ఆయన ఎప్పుడూ ప్రేమగా, గౌరవంగా చూస్తారు!"

గణపతి గుండె దడదడ కొట్టుకుంటోంది. పీకకి తగులుకున్న గాలం ఎప్పుడు తప్పుకుంటుంది?

"మిస్టర్ గణపతీ, ఎప్పుడో, ఎక్కడో మిమ్మల్ని కల్సుకుంటాను. పాతికవేలనీ పార్శిల్‌చేసి రెడీగా మీ దగ్గిరే ఉంచుకోండి. గుడ్‌లక్!" అంటూ లేచాడతను.

గణపతి తూలుతూ నిలబడ్డాడు. "ఎప్పుడో, ఎక్కడో కాదు; ఇదే సైముకి, ఇక్కడే...."

నక్షత్రకమూర్తి తల అడ్డంగా ఆడిస్తూ నవ్వాడు.

"ఇలా చేయమని మీరు మాకు చెప్పకూడదు; చెప్పలేరు। చెప్పినట్టు చేయండి; క్షేమంగా ఉండండి। అన్నట్టు మరో సంగతి. నిటలాక్షరావుగారు మీ కోసం రెండు బాంకుల్లో సేఫ్టీ డిపాజిట్ లాకర్స్ తీసుకున్నారు. ఫొటోలూ, వాటికి సంబంధించిన చరిత్రా, మీ గత చరిత్రా, ఆ లాకర్స్‌లో భద్రంగా దాచివుంచాడు, సీల్డ్ కవర్స్‌లో. ఎందుకు చెప్తున్నానంటే నాకుగానీ, ఆయనకిగానీ ప్రమాదం సంభవిస్తే అవన్నీ ఎవరికి అందకూడదని మీరు భావిస్తారో వాళ్ళకే అందుతాయి। అంచేత బుద్ధిగా మసలుకోండి।" అంటూ అతను వెనక్కి తిరిగాడు.

"మిస్టర్ నక్షత్రకమూర్తీ...."

అతను ఆగి, గణపతివైపు తిరిగాడు.

"ఇదంతా మీకు ఎట్లా తెలిసింది?"

"నాకుకాదు; నిటలాక్షరావుగారికి. ఆయన సార్థక నామధేయులు. మీలాంటి వాళ్ళు రహస్యంగా చేసేదంతా ఆయన మూడోకంటికి ఎప్పుడూ కనిపిస్తూ ఉంటుంది। అందుకే మళ్ళీ హెచ్చరిస్తున్నా; చెప్పినట్టు చేయండి; క్షేమంగా ఉండండి।" అంటూ నక్షత్రకమూర్తి టేబుల్ మీదున్న సిగరెట్ పాకెట్‌ని అందుకుని, గణపతిని నవ్వుతూ చూశాడు.

"మీకు సిగరెట్ కావాలా?"

గణపతి బలహీనంగా తల అడ్డంగా ఊపాడు. అతను చిన్నగా నవ్వాడు. సిగరెట్ పాకెట్‌ని తన జేబులో దోపుకున్నాడు. "నా దగ్గిర అయిపోయాయి. పైగా, మీ బ్రాండ్ బావుంది. రేపు ఎక్స్‌ట్రా పాకెట్ ఒకటి జేబులో ఉంచుకోండి. ఓకే।" అంటూ అతను తిరిగి చూడకుండా గబగబా నడిచాడు.

వీధి తలుపు దభాల్న మూయబడింది. గది మధ్య స్తంభంలా నిలబడ్డ గణపతి ఉలిక్కిపడ్డాడు. నీరసంగా కుర్చీలో కూలబడ్డాడు. మొహాన్ని అలుముకున్న చెమటని రెండుచేతుల్తో తుడుచుకుంటూ టేబుల్ మీద తల వాల్చేశాడు....

3

తాళంతీసి, తలుపు తెరిచి గణపతి లోపలికి అడుగు పెట్టాడు. గదిలో టెలిఫోన్ మోగుతోంది. గబగబా వెళ్ళి రిసీవర్ని అందుకున్నాడు.

"యస్?"

"గణపతా?"

"యస్....మీరెవరు?" కొత్తకంఠాన్ని పోల్చుకోలేని గణపతి ప్రశ్నించాడు.

"రేపు సాయంత్రం ఆరుగంటల తరవాత, ఏడులోగా నక్షత్రకమూర్తి నిన్ను కల్సుకుంటాడు. పీకలమీదికి వచ్చింది. పాతికవేలు....చాలు" అంది అవతలికంఠం బొంగురుగా.

రిసీవర్ని పట్టుకున్న గణపతి చెయ్యి వణికింది. తటాలున అతను కుర్చీలో కూలబడ్డాడు. తను నిటలాక్షరావు కంఠాన్ని వింటున్నాడు! అప్రయత్నంగా పళ్ళు కొరుక్కున్నాడతను. స్కౌండ్రల్!

"వినిపించిందా?" అవతలి కంఠం అతని చెవిలో మొరిగింది.

"ఇది అన్యాయం! నా దగ్గిర డబ్బులేదు....ఉన్నదంతా ఊడ్చి నీకే నైవేద్యం పెట్టాను!" గణపతి కంఠం కోపంతో వణికింది.

నిటలాక్షరావు బిగ్గరగా నవ్వాడు. "కుప్పలు నూర్చి, ఇంకా ఊడ్చు! అర్జెంటుగా పైకం కావాలి...."

"ఇంకా నన్నెందుకు పీడిస్తావు? ప్లీస్, నన్ను మరిచిపో!" గణపతి ప్రాధేయపడ్డాడు.

"నిన్ను మరిచిపోగలను. కానీ, శోభను మరిచి పోలేను. నా శోభను నాకు దూరంచేశావు. ఆమె ఉండ టమే 'పదివేలు' అనుకునే సగటు ప్రేమికుణ్నికాను నేను. ఆమె ఉండటమే 'పదికోట్లు' అనుకునేవాణ్ని! అవసరమైతేగానీ నిన్ను అడగను!"

"ఆర్నెల్ల క్రితం అవసరమైంది; పాతిక తీసుకున్నావ్. మూణ్నెల్ల క్రితం అవసరమైంది; పదివేలు గుంజుకున్నావ్. ఇవాళ మళ్ళీ అవసరమైంది! నేను జీవించినంతకాలం నీకు అవసరం అవుతూనే ఉంటుంది!" గణపతి వెటకా రంగా అన్నాడు.

"కోపంగా అన్నా, ఉన్నమాటన్నావ్. ఎంతిచ్చినా శోభ నాకు లేకుండాపోయిన లోటుని నువ్వు భర్తీ చేయ లేవు...."

"మిస్టర్ నిటలాక్షరావ్, శోభకీ నీకూ ఏమిటి సంబం ధం?" గణపతి ప్రశ్నించాడు.

నిటలాక్షరావు చిన్నగా నవ్వాడు. "నువ్వీప్రశ్న ఎందుకు అడగలేదా అని చాలాసార్లు అనుకున్నా. గణపతీ, నేను....శోభని ప్రాణంలా ప్రేమించాను. ఆమె నన్ను మట్టి అనుకుంది; నిన్ను బంగారం అనుకుంది. ఆమెని నిర్లక్ష్యంచేస్తున్న నిన్ను కల్సుకోవద్దని బతిమాలాను. కానీ....నువ్వు తనని పెళ్ళాడతావన్న ఆశతో నిన్ను కలుసుకుంది...."

"ఆమె నన్ను బెదిరించింది. పెళ్ళిచేసుకోకపోతే నా

ఉత్తరాలన్నీ బైటపెట్టి, పబ్లిగ్గా ఉతికి, నా అంతు చూస్తా నంది ...” గణపతి సంజాయిషీ ఇస్తున్నట్టు ప్రారంభిం చాడు.

“అదంతా నేను వినను. ఆమెకి నువ్వు చాలా పెద్ద శిక్ష విధించావు!” నిటలాక్షరావు నిట్టూర్చాడు. “శోభని నువ్వు చంపకుండా ఉండాల్సింది....”

గణపతి క్షణకాలం మౌనంగా వుండిపోయాడు. ఇలా పీకలమీదికి వస్తుందని తెలిస్తే తను ఆమెని తుదముట్టించే వాడుకాడు!

“ఆల్‌రైట్. మనం ఎంత మొత్తుకున్నా మట్టిలో కలిసిపోయిన శోభ మళ్ళీరాదు! పాతిక. రేపు సాయం త్రం.” నిటలాక్షరావు మళ్ళీ అసలు విషయానికి వచ్చాడు.

“ప్లీస్, బీ రీజనబుల్! నా దగ్గిర పైకంలేదు....నీకు తెలుసు....” గణపతి ఆదుర్దాగా అంటూ నుదుర్నికమ్మిన చెమటని అరచేత్తో తుడుచుకున్నాడు.

“తెలుసు. ముందుచూపుతో ఇల్లు సంపాయించావనీ, రోజూ స్కూటర్‌మీద నీ డ్యూటీకి వెళ్తాననీ కూడా నాకు తెలుసు! అనుకున్న క్షణంలో డబ్బిచ్చే ఆ స్థిపాస్తుల్ని నువ్వు మరిచిపోతున్నావ్! రేపు సాయంత్రం నక్షత్రక మూర్తికోసం తయారుగా వుండు!”

“ప్లీస్ ” గణపతి ఏదో చెప్పబోయాడు. అతని చెవిలో క్లిక్కుమంది. రిసీవర్ని ఫోన్‌మీది విసిరికొట్టి నిస్సహాయంగా పళ్ళు కొరుక్కున్నాడతను. ఛండాలుడు! ఇల్లు; స్కూటర్ — రెండింటినీ తెగనమ్మి తనకి సమర్పించ మన్నాడు దొంకతిరుగుడుగా! బిగించిన పిడికిళ్ళని ఆగ్ర హంతో టేబుల్‌మీద కొట్టాడతను.

4

బార్ రూమ్‌లో రెడ్‌లైట్ డిమ్‌గా వెలుగుతోంది.
చల్లటి బీర్ చప్పరిస్తూ గణపతి ఆలోచనలో పడ్డాడు.
ఎలాగేనా తను విటలాక్షరావు పీడ వదిలించుకోవాలి.
గుని మేపినట్టు తను అతన్ని మేపుతూ వుండలేడు. ఏను

ఆ రాత్రి, వర్షం కురుస్తున్న రాత్రి తనని ఎవరూ
చూడ్డంలేదనుకున్నాడు తను. ఆ అర్ధరాత్రిలో, తుఫానులో
తనని ఎవరూ వెంటాడలేదు. మరి, తన ఇల్లు ఫోటోలు
తీసిన వ్యక్తికి ఎలా తెలుసు? అతను శోభను వెంటాడి,
దాక్కున్నాడా?

గణపతి సిగరెట్ వెలిగించాడు. తను ఆమెని హత్య
చేయబోతున్నట్టు ఆమెకి తెలీదు. మరి, కెమెరాతో అతను
ఎందుకు సిద్ధంగా వున్నాడు? ఏకాంతంలో తననీ, శోభనీ
ఫోటోలు తియ్యడానికా?

గణపతిలో ఏదో తళుక్కున మెరిసింది.
జలదరించింది. ఫోటోలు తీసే పథకంలో శోభ హస్తం
కూడా వుంది! అందుకే ఆమె,—తనని ద్వేషిస్తూ
ఆగ్రహం వెలిబుచ్చిన శోభ—ఆ రాత్రి తనకోసం సిద్ధంగా
ఉంది! తనని కవ్వించి, మంచంమీదికి ఆహ్వానించింది!
ప్రేమ నటించింది! తను ఆమెమీద వ్యామోహాన్ని నటించి
నట్టే, ఆమెకూడా తనమీద వ్యామోహాన్ని నటించింది!

గుడ్‌గాడ్! ఫోటోలతో తనని జీవితాంతం ఏడిపించ
డానికి ఆమె నిశ్చయించుకుంది! ఆమే, నిటలాక్షరావూ
కలిసి అంతా ప్లాన్ చేసినట్టున్నారు! సందేహం లేదు!

తనని తాత్కాలికంగా ముంచడానికి వాళ్ళు పథకం
వేశారు, తను శోభని శాశ్వతంగా ముంచడానికి పథకం
వేశాడు! వాళ్ళ ప్లాన్ అడ్డం తిరిగింది. అయితే, తన

ప్లాన్ నిటలాక్షరావు చేతిలో తురుపులా, కత్తిలా తయారైంది!

గ్లాసులోని బీర్ని పూర్తిచేసి, గణపతి కుర్చీలో వెనక్కి వాలాడు. ఇంతకాలం అయోమయంగా అవుపించిన అసలు విషయం ఈ క్షణంలో తనకి అర్థమైంది. తను పెళ్ళాడలేదని పగబట్టిన శోభ ఫోటోలద్వారా తనని బ్లాక్ మెయిల్ చేయాలనుకుంది. అప్పట్లో తనకి అర్థంకాని ఆమె ప్రవర్తనా, ప్రేమా ఇప్పుడు బ్రహ్మాండమైన వెల్తుర్లో వస్తువుల్లా స్పష్టంగా అవుపిస్తున్నాయి.

గణపతి బిల్లు పైకం ట్రేలో పడేసి, లేచాడు.

తన ఆలోచనలు సక్రమమార్గంలో వెళ్తున్నాయి. ఇలాగే ఆలోచించి, పరిశోధించి ఆ నిటలాక్షుడు ఎవరో కనిపెట్టాలి. నయానో. భయానో—ఏదో విధంగా అతని చేతిలోని తురుపుముక్కల్ని సంపాయించాలి. అవసరమైతే అతన్ని శోభకి తోడుగా పంపేసి అయినా!

* * *

తాళంతీసి, ఇంట్లోకి ప్రవేశించి, తలుపుమూసి గణపతి గదివేపు అడుగువేశాడు. గదితలుపు తీసి లోపలికి అడుగు పెట్టబోతూ, తటాలున ఆగాడు.

అతని మెడమీద వెంట్రుకలు ముళ్ళలా నిక్కబొడుచుకున్నాయి. ఊపిరి పీల్చుకోడం మరిచిపోయి రెప్పవేయకుండా చూశాడు.

గది మధ్యలో టేబుల్ముందున్న కుర్చీలో కూచుని కళ్ళు మూసుకున్న ఆ వ్యక్తి సిగరెట్ పొగలోంచి అవుపిస్తున్నాడు. తలుపుమూసి, తాళంవేసిన ఇంట్లోకి అతనెలా ప్రవేశించాడు?

"గణపతీ, వెల్కమ్!" అన్నాడు కళ్ళుమూసుకుని,

సమాధిలోవున్న గోసాయిలా కూచున్న నక్షత్రకమూర్తి.

గణపతి చేతులు పిడికిళ్ళుగా బిగుసుకున్నాయి. పళ్ళు కొరుక్కుంటూ అతను గుమ్మం దాటాడు.

"కూచో!" అప్పుడే కళ్లుతెరుస్తూ ఏకవచనంలో అన్నాడు నక్షత్రకమూర్తి. అతని కళ్ళు చిలిపిగా నవ్వుతున్నాయి.

"ఏమిటిది? తాళంవేసిన ఇంట్లోకి ఎందుకొచ్చావ్? ఎలా వచ్చావ్?" గణపతి గద్దించాడు.

నక్షత్రకమూర్తి నవ్వుతూ కుర్చీలో సర్దుకు కూచున్నాడు. సిగరెట్ పీకని టేబుల్‌మీద నొక్కి, కిందికి విసిరాడు. తలెత్తి గణపతిని చూశాడు.

"సింపుల్! తాళంతీశాను. ఇంటిలో ప్రవేశించాను. పెరటి తలుపుతీసి, మళ్ళీ తలవాకిలి దగ్గిరకొచ్చాను; ఇంటిని ప్రదక్షిణంచేస్తూ. యథాప్రకారం తాళంవేశాను. మళ్ళీ యథాప్రకారం పెరటితలుపుగుండా లోపలికొచ్చాను. వెనక తలుపుమూసి గొళ్ళెం పెట్టేశాన్లే. నీ కోసం ఎదురు చూస్తూ ఇక్కడ తపస్సుచేస్తూ కూచున్నాను...." నక్షత్రకమూర్తి వోపిగ్గా వివరించాడు. గణపతి అతన్ని నిప్పులు కక్కుతూ చూశాడు.

"నీలాంటి జులాయిలు నా ఇంటిలోకి ఇలా జొరబడ్డం నేను సహించను...."

"హోల్డాన్!" నక్షత్రకమూర్తి అరచెయ్యెత్తి అతన్ని వారించాడు. "మేం ఏంచేసినా నువ్వు సహించి తీరాలి! సహిస్తావు!"

గణపతి గుడ్లురుముతూ చూశాడు. బిగుసుకున్న అతని పిడికిళ్ళని నక్షత్రకమూర్తి చిరునవ్వుతో చూశాడు. "మనిషి ఆవేశంతో ఒకోసారి తొందరపాటు పనులు

చేస్తాడు. అందుకే గుర్తుచేస్తున్నా. మరోగంటలో నేను నిటలాక్షరావుగారితో మాట్లాడాలి. లేకపోతే ఆ ఫోటోలకు రెక్కలొస్తాయి!"

గణపతి పిడికిళ్ళు అప్రయత్నంగా వదులయ్యాయి. ఆగ్రహమూ, అసహాయతా నిండిన కళ్ళతో అతను నక్షత్రకమూర్తిని చూస్తూ నీరసంగా కుర్చీలో వాలాడు.

"నీకోసం ఎదురుచూస్తూ సిగరెట్లన్నీ కాల్చేశాను. పాకెట్ ఇలా విసురు!" నక్షత్రకమూర్తి నవ్వాడు. అసహ్యాన్నీ, కోపాన్నీ నిగ్రహించుకుంటూ గణపతి జేబులోంచీ తీసి, సిగరెట్‌పాకెట్‌ని గిరాటేశాడు. సిగరెట్ వెలిగించి, తృప్తిగా ముక్కుల్లోంచీ పొగ వదుల్తూ, చూశాడతను.

"నిటలాక్షరావుగారికి మళ్ళీ డబ్బుతో అవసరమొచ్చింది...." అన్నాడతను క్లుప్తంగా.

గణపతి ఎర్రబడిన కళ్ళతో చూశాడు, "అవసరమొస్తే ఏ బాంకునో దోచుకొమ్మను! గెటౌట్!"

నక్షత్రకమూర్తి నమ్మలేనట్టు చూశాడు. అతని కనుబొమలు పైకి లేచాయి. "నిజంగా?" అతని కంఠంలో ఎగతాళి ధ్వనించింది.

"గెటౌట్!" గణపతి హుంకరించాడు.

నక్షత్రకమూర్తి కళ్ళు చిట్లిస్తూ చూశాడు. మెల్లిగాలేచి, నిలబడి గణపతిని తదేకంగా చూశాడు. "ఏ బ్యాంకునో దోచుకొమ్మని నువ్వు సలహాఇచ్చావు. అడిగినప్పుడు, అడిగినంత ఇచ్చే నీలాంటి వ్యక్తులున్నంతకాలం బ్యాంకుల్ని దోచే అవసరం ఆయనకిరాదు. నువ్వు ఇవ్వనన్నంత మాత్రాన, ఆ ఫోటోలకి విలువలేకుండాపోదు.

వేడి వేడి మిరపకాయ బజ్జీల్ని కొన్నట్టు వాట్ని ఎగబడి కొంటారు! ఓకే. గుడ్‌బై!'' అంటూ గుమ్మంవైపు కదిలాడు.

గణపతిలోని ఆగ్రహం ఒక్కసారిగా చల్లబడింది. అతని చొక్కా కింద, వీపుమీద చెమట కాలవలా సాగింది. ''ఆగు....'' అన్నాడుతను వణికేకంఠంతో.

గుమ్మం ముందు, వెనక్కి తిరిగి చిరునవ్వుతో చూశాడు నక్షత్రకమూర్తి. గణపతి అతన్ని దీనంగా చూశాడు. ''అయామ్ సారీ....నాకు దిక్కుతోచట్లేదు....నెమ్మదిగా మాట్లాడుదాం....''

నక్షత్రకమూర్తి చిన్నగా నవ్వుతూ భుజాలు ఎగరేశాడు. ''నువ్వు గెటౌట్ అంటే వెళ్ళిపోతాను; కమిన్ అంటే వస్తాను!'' అంటూ మళ్ళీ కుర్చీవైపు నడిచాడు. గణపతి అతని ఎదురుగా కూచుని అదోలా చూశాడు.

''మిస్టర్ నక్షత్రకమూర్తీ, నా దగ్గిరింక చిల్లిగవ్వలేదు. ఇల్లూ, స్కూటరూ అమ్మేశాను. మొత్తం ముట్టజెప్పాను. నేను అమ్మేసిన ఈ ఇంటిలో అద్దెచెల్లిస్తూ ఉంటున్నాను....''

''తెలుసు. అమ్మిపారేసిన ఇంట్లో అద్దెకి ఉండగలగటం కూడా అదృష్టమే!'' నక్షత్రకరావు ఆడ్డొస్తూ అన్నాడు. ''నీ ధైర్యాన్ని మెచ్చుకోవాలి. ఆమెని చంపిన గదిలో, అదే మంచంమీద ఆదమరిచి నిద్రపోగలుగుతున్నావ్!''

గణపతి రెప్పల్ని వాల్చుకున్నాడు. ''నాదగ్గిర ఇంకేమీ లేదు. వొట్టిపోయిన ఆవుదగ్గిర పాలు పితుక్కోటం వీలు కాదు! ఈమాట నిటలాక్షరావుకి చెప్పు....''

నక్షత్రకమూర్తి చిన్నగా నవ్వాడు. ''గణపతీ, నీ శక్తిసామర్థ్యాలు నీకు తెలీవు. ఆయనకీ, నాకూ తెలుసు. ఆంజ

నేయుళ్ళాగా నీగురించి నువ్వు గుర్తుంచుకోవు!"

గణపతి ఆశ్చర్యంతో చూశాడు. నక్షత్రకరావు సిగరెట్ వెలిగించి, అతనివైపు ఒక సిగరెట్‌ని ధారాళంగా దొర్లించాడు. గణపతి సిగరెట్ అందుకోలేదు.

"నన్ను నమ్మ! ఉన్నదంతా ఊడ్చుకుపోయింది...."

నక్షత్రకమూర్తి అతన్ని సానుభూతితో చూశాడు. "ఎంత ఊడ్చుకుపోయినా, ఇంకా ఉంది!" అన్నాడతను నవ్వుతూ.

"ఏమిటి?"

"నీ జీతం!"

"ఏమిటీ!" గణపతి అరిచాడు.

"నిటలాక్షరావుగారు కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి. శక్తికి మించి మనుషులు కష్టపడ్డం ఆయన సహించరు. అంచేత ఆయన సానుభూతితో ఆలోచించి, నీకోసం ఒక సౌకర్యం ఏర్పాటుచేశారు. పెద్దపెద్ద మొత్తాలుగా నువ్వు చెల్లించే పనిలేదు. ఇన్‌స్టాల్‌మెంట్స్!" నక్షత్రకమూర్తి ఆగి, దమ్ములాగాడు.

గణపతి తన చెవుల్ని నమ్మలేకుండా ఉన్నాడు. తాత్కాలికంగా మూగవాడైపోయి, నోరు తెరిచి చూస్తూండిపోయాడు.

"రికవరీస్ అన్నీ పోగా, నీచేతికి నెలనెలా పద్దెనిమిది వందలా డెబ్బై రెండు రూపాయలు జీతం కింద వస్తోంది...."

"నీకెలా తెలుసు?" గణపతి ఆశ్చర్యంతో, వణికే కంఠంతో ప్రశ్నించాడు.

నక్షత్రకమూర్తి చిన్నగా నవ్వాడు. "నాకు కాదు; నిటలాక్షరావుగారికి తెలుసు! ఆయనకి అన్నీ తెలుస్తూ

ఉంటాయి....అంచేత నెలకి వెయ్యిరూపాయల ప్రకారం ఆయన తీసుకుని, తృప్తిపడతారు...."

"ఇది ఘోరం! అన్యాయం! అమానుషం!" గణపతి అరిచాడు.

"ఆయనకీ, శోభకీ నువ్వు చేసినదాన్తో పోలిస్తే ఇది అమానుషం కాదు!" నక్షత్రకమూర్తి చురకతగిలించాడు.

గణపతి నీళ్ళల్లో మునిగిపోతున్నవాడిలా ఉక్కిరి బిక్కిరవుతూ చూశాడు. అతనిలోని అసహాయత కోపంగా మారుతోంది. అతని మొహంలోని భావాలు చదువుతూ నక్షత్రకమూర్తి ప్రారంభించాడు.

"వెల్లకిలా, నాలుగుపాదాలగుండా మేకులతో బల్లకి తగిలించబడి, కాసేపట్లో డిసెక్ట్ చేయబడే కప్పలా నువ్వు నిటలాక్షరావుగారి చేతికింద ఉన్నావు. ఆయన ఆడమన్నట్టు ఆడితేగానీ నువ్వు బతకలేవు! నిజం చెప్పాలంటే ఎంతో కొంత ముట్టజెప్పి, లోకంలో ఫ్రీగా బతికే అవకాశాన్ని నువ్వు ఆయన్నుంచి కొనుక్కుంటున్నావు ఆయన మూడోకన్ను తెరిస్తే నీ బతుకు భస్మమౌతుంది! అడిగింది ఇచ్చెయ్; హాయిగా బతుకు!"

గణపతి బలహీనంగా చూశాడు. అతను చెప్తోంది నిజమే. నిటలాక్షరావు కన్నుతెరిస్తే బతికినంతకాలం తను జెయిల్లో చావాలి! "నెలనెలా అంత మొత్తం ఇచ్చేస్తే నేను బతకలేను...." తనలో గొణుక్కుంటున్నట్టు అన్నాడతడు.

"నిటలాక్షరావుగారు అదికూడా ఆలోచించారు! ఇతర్ల కష్టాల్ని ఆయన సానుభూతితో చూస్తారని ఇందాకే చెప్పాను. అంత అద్దె చెల్లిస్తూ నువ్వు ఈ యింట్లో ఉండటం వేస్టన్నారాయన. నీ వొక్కడికి సరిపడా చిన్న

గది తీసుకోమన్నారు. తాగుడు తగ్గించమన్నారు. ఖరీదైన సిగరెట్లూ, దుస్తులూ మానేయమన్నారు'' నక్షత్రకమూర్తి ఆగి, మరో సిగరెట్ వెలిగించి, నవ్వుతూ చూశాడు.

గణపతి హిప్నటైజ్ చేయబడిన బలహీనుడిలా చూస్తూండిపోయాడు. ఈ అక్రమాన్ని, అన్యాయాన్ని, దుర్మార్గాన్ని ఎదిరించమంటూ అతనిలోంచీ ఎవరో బొబ్బ లెడుతున్నారు. కానీ తను ఎదిరించలేడు. ఏదో పాపిష్టి క్షణంలో, శోభ సౌందర్యంమీద తనలో రణంలా పుట్టు కొచ్చిన వ్యామోహం వాయిదాల పద్ధతిమీద తనని కాల్చుకు తింటోంది. ఆరోజు శోభ తనకి కనిపించకుండా వుంటే ఎంత బావుండేది!

గణపతి బలహీనంగా తలని రెండుచేతుల్లో ఇరికించు కున్నాడు. అతనికి ఎదిరించాలనిపిస్తోంది. ఏడవాలనిపి స్తోంది. ఏడిపించాలనిపిస్తోంది. కానీ తను ఏమీ చేయలేని నిస్సహాయుడు....

''ప్రతినెలా మూడో తారీఖున కలెక్షన్ చేయబడుతుంది. అంటే, పదిరోజుల్లో మొదటి కంతు ప్రారంభమవుతుంది. అంతవరకూ శలవు!'' నక్షత్రకమూర్తి లేచి వొళ్ళువిరుచు కున్నాడు.

గణపతి మాట్లాడకుండా, వెర్రివాడిలా చూశాడు. నక్ష త్రకమూర్తి నవ్వుతూ గుమ్మంవైపు నడిచాడు. గణపతి తలని వెనక్కివాల్చి, కళ్ళు మూసుకున్నాడు.

5

ఎయిర్‌కండిషన్డ్ కాబిన్‌లో హాయిగా ఉంది. గణపతి రెండో రసగుల్లా ఆర్డరిచ్చాడు.

రెండు నెలలుగా అతనికి హాయిగా ఉంది. కొత్త వూరు. కొత్త మిత్రులు కొత్త వాతావరణం. పీడకలల్తో

నిండిన నిద్రలోంచి మేలుకున్నంత హాయిగా ఉందతనికి. తన సెన్ూూర్ పూర్తవకముందే ఎలాగో తంటాలుపడి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడతను. తన గురించి ఎవరు వాకబుచేసినా చెప్పొద్దని పాత మిత్రులకి చెప్పాడు. తమ కూతుళ్ళని పెళ్ళాడమని నలుగురైదుగురు వేపుకుతింటున్నారనీ, తన కొత్త చిరునామా తెలిస్తే, ఏల్నాటి శని వారసుల్లా వాళ్ళు తనని పట్టుకుంటారనీ మిత్రులకి నవ్వుతూ సర్దిచెప్పాడు ...

కాబిన్ తలుపు తెరుచుకుంది సర్వర్ రసగుల్లా అతని ముందు పెట్టాడు. ఊతప్పం ఆర్డరిచ్చి గణపతి రసగుల్లాని ముందుకి లాక్కున్నాడు.

"గుడీవినింగ్!"

గణపతి ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. అతని చేతిలోని చెంచా టేబుల్ మీదపడి చప్పుడు చేసింది.

"కులాసా?" నవ్వుతూ అతని ఎదురుగా కూచున్నాడు నక్షత్రకమూర్తి. గణపతి పెదవులు వణుకుతున్నాయి.

"ట్రాన్స్ఫర్ చేయించుకుని వచ్చేముందు మాకు తెలియజేయాల్సింది. నిటలాక్షరావుగారు బాగా అఫెండయ్యారు. నీ 'ఆస్తి'ని ఎవరికేనా వేలంవేయాలనుకున్నారు. నేనే వారించాను...."

"ఇక్కడికి ఎలా వచ్చావు?" వణికే కంఠంతో ప్రశ్నించాడు గణపతి.

"తప్పిపోయిన గొర్రెను వెతుకుతూ వెళ్ళే గొల్లవాడిలా, వచ్చాను. గణపతీ, చాలా పొరపాటు చేశావు. పారిపోడం నిన్ను కాపాడదు. ఇంకోసారి ఇలాంటి తొందరపాటు పని చేస్తే, వెతుక్కుంటూ వచ్చేది నేను కాదు; పోలీసులు!" చిన్న కళ్ళతో తీక్షణంగా చూస్తూ

ఎగతాళిగా అన్నాడు నక్షత్రకమూర్తి.

గణపతి మాటలు మరిచిపోయినవాడిలా చూశాడు. తను తాత్కాలికంగా తప్పించుకునే ప్రయత్నం చేశాడు.. నిజమే ....

"రసగుల్లా బాగోలేదా?" నక్షత్రకమూర్తి నవ్వేడు.

గణపతి రసగుల్లాని అసహ్యంగా చూశాడు. చిన్న ప్లేటునీ, చెంచానీ అతనివైపు తోశాడు కోపంగా. నక్షత్రకమూర్తి తినటం ప్రారంభించాడు.

"రెండు నెలల పైకం బాకీపడ్డావు ...." అన్నాడతను క్లుప్తంగా.

"నువ్వూ, ఆ నిటలాక్షరావూ మనుషులు కారా?" గణపతి హుంకరించాడు.

"నువ్వు మనిషివైతే మేమూ మనుషులమే! రెండు నెలల బకాయీ, ఖర్చులకింద మరో అయిదువందలూ పట్రమ్మన్నారాయన ...."

గణపతి నిప్పులుకక్కుతూ చూశాడు. "ఆ రాక్షసుడి ఆశకు అంతులేదా?"

నక్షత్రకమూర్తి నవ్వుతూ చూశాడు. తలుపు చప్పుడైంది. సర్వర్ ఊతప్పం టేబుల్‌మీద పెట్టి, నక్షత్రకమూర్తి వైపు చూశాడు. "రెండు స్ట్రాంగ్ కాఫీ!" ఆర్డరిచ్చాడతను. సర్వర్ వెళ్ళిపోయాడు.

"మిస్టర్ గణపతీ, మనిషి ఉన్నంత కాలం ఆశ ఉంటుంది. ఆశకి అంతుండదు. ఉంటే, మీ ఉద్యోగులంతా ఏడాది పొడుగునా, రిటైరయ్యేదాకా జీతాలు పెంచమంటూ సమ్మెలు చేస్తూ కూచోరు! నువ్వు పంజేస్తున్న బ్యాంకులో ఎకౌంట్లని ఒకసారి చూడు. మనుషులు వేలకివేలు, లక్షల లక్షలు ఫిక్సెడ్ డిపాజిట్లుగా దాచుకుంటూనే ఉంటారు.

వాళ్ళందరికి ఆశ లేకపోతే, లేదా వాళ్ళ ఆశకి అంతుంటే మీ బాంకులన్నీ మూసేయాలి!" నక్షత్రకమూర్తి చిన్న ఉపన్యాసం ఇచ్చాడు.

"నా దగ్గిర ప్రస్తుతం పైకం లేదు!" గణపతి విసుగ్గా అన్నాడు.

"అది అర్థంలేని మాట! నిటలాక్షరావుగారికి అర్థంకాని మాట! లక్షల్లక్షలు మూలుగుతున్న చోట నువ్వు ఉద్యోగం చేస్తున్నావ్. కుండలోకి చెయ్యిపెడితే వెన్నంతా నీదే!" నక్షత్రకమూర్తి నవ్వుతూ అన్నాడు.

గణపతి కంగారుగా చూశాడు, స్కౌండ్రల్! డబ్బు కాజేయమని తనకి సలహా ఇస్తున్నాడు! "నీ సలహాకి వెయ్యి నమస్కారాలు...."

"నమస్కారాల్తో జేబులు నిండవు!" నక్షత్రకమూర్తి నవ్వుతూ అడ్డుతగిలాడు. తలవాల్చి ఊతప్పం ముందుకు లాక్కొని తినసాగేడు. గణపతి అతన్ని పురుగుని చూస్తున్నట్టు చూశాడు. తన ఆకలి ఎప్పుడో హరించిపోయింది. ఊబిలోంచీ బైటపడట్టు తను అపోహపడ్డాడు!

"ఎల్లుండి వెయ్యిరూపాయిలు సర్దుతాను...." అన్నాడతను నిట్టూరుస్తూ.

నక్షత్రకమూర్తి ప్లేట్లో చెయ్యి కడుక్కొని, సిగరెట్ వెలిగించాడు.

"రేపు సాయంత్రంలోగా నేను మాట్లాడకపోతే, నిటలాక్షరావుగారు వేలం ఏర్పాట్లు చూసేస్తారు!" అన్నాడతను ఎర్రగా ఉన్న సిగరెట్ కొసమీదికి గురిచూసి పొగ ఊదుతూ.

"నన్ను నమ్ము. పైకంలేదు...."

"లాభంలేదు. బాంక్‌లో లోన్ తీసుకో. రేపు శని

వారం. లోన్ రాకపోతే, బాంకులోంచి పైకం జేబులో పడేసుకో. సన్‌డే—అడ్జస్ట్‌మెంట్? సోమవారం దాకా నీకు వ్యవధి ఉంటుంది. ఆలోగా ఆర్జించు!"

"నీకేమన్నా మతిపోయిందా?" గణపతి దాదాపుగా అరిచాడు.

నక్షత్రకమూర్తి చిన్నగా నవ్వేడు. "బాంకుల్లో భారీ ఎత్తున సాగే ఎంబిజిల్‌మెంటూ, సన్‌డే అడ్జస్ట్‌మెంట్సూ ప్రజలకి తెలీదనుకుంటున్నావా? వాళ్ళు అడిగిన సొమ్ము విత్‌డ్రా రూపంలో అందినంతకాలం డిపాజిటర్లు మిమ్మల్ని ఏమీ అనరు! మీరు ఎంతతిన్నా అడగరు! నేను నీకు చెప్పక్కర్లా. ఏదో ఖాతాలో ఖర్చురాయి. ఏ డిపాజిటర్ సంతకాన్నో ఫోర్జ్ చెయ్! రేపు మధ్యాహ్నం కలుసుకుంటా. సోలాంగ్!" అంటూ లేచాడతను.

ముందుకి వంగి గణపతి ముందున్న సిగరెట్ పాకెట్ అందుకొన్నాడు. నవ్వుతూ వెనుదిరిగాడు.

కాఫీ ట్రేతో వస్తున్న సర్వర్ని చూసి మళ్ళీ కుర్చీలో కూచున్నాడు. సర్వర్ చెరో కప్పూ సర్వ్‌చేశాడు. రెండు గుక్కల్లో కాఫీని మింగేసి, నక్షత్రకమూర్తి లేచాడు. విగ్రహంలా కూచున్న గణపతిని తృప్తికరంగా నవ్వుతూ చూశాడు. "రేపు!" అంటూ చకచకా బైటికి వెళ్ళి పోయాడు.

గణపతి కదలికలేకుండా అట్లాగే కూచుండిపోయాడు; చల్లారిపోతున్న కాఫీని పట్టించుకోకుండా. అతనిలోంచీ కదిపిన పుట్టలోంచీ కందిరీగల్లా ఆలోచనలు దూసుకొస్తున్నాయి.

తను బలిష్టమైన గాలానికి తగులుకున్న చేప! పదునైన

మేకులతో డిటెక్షన్ బల్లకి తాపడం చేయబడిన కప్ప!
మెడమీదికి దిగుతున్న కత్తిని ఆపలేని బలిపశువు!

6

గదిలో కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు గణపతి.

తన మెడకి చుట్టుకున్న ఉచ్చుని వదిలించుకునే మార్గం కోసం అతని బుర్ర అన్వేషిస్తోంది. ఫోటోలు నిటలాక్ష రావు చేతిలో ఉన్నంతకాలం, తనకి విముక్తిలేదు.

తను స్వయంగా ప్రయత్నించి 'తన ఆస్తి'ని సంపాదించలేదు. బ్యాంక్ లాకర్లలో దాచినట్టు 'నక్షత్రకుడు' బుకాయించాడా? లేక నిజంగానే దాచాడా? తనేం చేయాలి? ఎక్కువ మొత్తం ఒకేసారి ముట్టజెప్తే అతను నెగటివ్‌లూ, కాపీలూ ఇస్తాడా? ఇచ్చినట్టు నటిస్తూ, ముందు జాగ్రత్తతో కాపీలు జాగ్రత్తచేసుకుంటే? తను రెండు విధాలుగా మునిగి పోతాడు! ఇంతకీ ఎక్కువమొత్తం తను ఎక్కణ్ణుంచీ తెస్తాడు?

గణపతి మరో సిగరెట్ వెలిగించాడు. పచార్లుచేస్తున్న అతను తటాలున ఆగాడు. అతనిలో ఏదో అగ్గిపుల్లలా వెలిగింది. తను మరిచేపోయాడు.

గణపతి ఉద్రేకంతో మళ్ళీ పచార్లు ప్రారంభించాడు.

ప్రైవేట్ డిటెక్టివ్‌లు ఇలాంటి వాటిలో ఆరితేరినవాళ్ళు. చాకులాంటి ఒక డిటెక్టివ్‌ని తను తక్షణం కల్సుకోవాలి.

తనకి కావాల్సినదాన్ని కబంధహస్తాల్లోంచీ తెలివిగా లాక్కురాగలిగే డిటెక్టివ్ తనకి అత్యవసరంగా కావాలి! గణపతి మళ్ళీ తటాలున ఆగాడు.

డిటెక్టివ్‌కి తను ఏం చెప్పగలడు? శోభని తను ఏకాంతంలో శారీరకంగా అనుభవించి, మెడకి నెక్ టై బిగించి హత్యచేశాడనీ, చింతచెట్టుకింద గొయ్యి తవ్వి సమాధి

చేశాడనీ చెప్పగలడా? చెప్పకపోయినా, వాట్ని ఒకవేళ సంపాదించగలిగిన డిటెక్టివ్ వాట్ని చూడకుండా ఉంటాడా?

చూ స్తే ఏమిటవుతుంది?

గణపతి మరోసిగరెట్ వెలిగించి, ఘాటుగాపొగపీల్చి, తీవ్రంగా ఆలోచిస్తూ తన ప్రశ్నకి సమాధానం కోసం బుర్రని కెలకడం ప్రారంభించాడు.

ముక్కుకి సూటిగా వెళ్ళే డిటెక్టివ్ అయితే, ఆ ఫోటోల్ని పట్టుకుని, తిన్నగా పోలీసుల్ని కల్సుకుంటాడు!

వంకరటింకర డిటెక్టివ్ అయితే, నిటలాక్షరావుకీ, నక్షత్రకమూర్తికీ జాయింటువారసుడుగా తయారవుతాడు! పెనంమీంచీ నిప్పుల్లోకి దూకినట్టవుతుంది తన స్థితి....

గణపతి తడబడే అడుగులతో కుర్చీ దగ్గిరగా నడిచి, నీరసంగా కూలబడ్డాడు. రెండుచేతుల్తో కణతల్ని నొక్కుకున్నాడు. తనేంచెయ్యాలి? ఏంచెయ్యాలి? ఏదో చేయకపోతే, నిటలాక్షరావుగాడు తనచేత ఏదైనా చేయించేలా వున్నాడు!

7

టెలిఫోన్ మోగింది. లెడ్జర్‌లో దూర్చిన తలను పైకెత్తి, గణపతి రిసీవరందుకున్నాడు. "యస్!"

"కంగ్రాచ్యులేషన్స్!" అంది అటువైపు కంఠం.

"తమరెవరు?" గణపతి ప్రశ్నించాడు.

అటువైపు కంఠం చిన్నగా నవ్వింది. "గణపతీ, పర్మనెంట్ క్లయింట్‌ని నువ్వు మరిచిపోతావనుకోలేదు!"

గణపతి కళ్ళు చిట్లిస్తూ ఆలోచనలో పడ్డాడు. తన చెవిలో ప్రతిధ్వనిస్తున్న ఆ కంఠాన్ని పోల్చుకోడానికి

అతను ప్రయత్నిస్తున్నాడు.

"నెలకి వెయ్యిరూపాయలిస్తూ, ఆదుకుంటున్నావ్! నీ మీద ఆధారపడిన నన్ను మరిచిపోతే ఎట్లా?" నవ్వు.

గణపతి ఉలిక్కిపడ్డాడు. నిటలాక్షరావు! గుడ్‌గాడ్.... వాడికి ఇంకా ఏంకావాలి? ఆకలవుతేగానీ జంతువు అరవదు. ఆ దుర్మార్గుడికి మళ్ళీ ఆకలయిందా?

"కంగ్రాట్స్ చెప్పాను. కనీసం ధన్యవాదాలు చెప్ప లేదు నువ్వు!" నిటలాక్షరావు కంఠంలో ఎద్దేవా ధ్వనించింది.

"కంగ్రాట్స్ దేనికి?" గణపతి అమాయకంగా అడిగాడు.

నిటలాక్షరావు అతని చెవిలో ఉల్లాసంగా నవ్వాడు. "త్వరలో పెళ్ళికొడుకువి కాబోతున్నావుగా?"

గణపతి ఆశ్చర్యం తన మొహంమీద కనిపించకుండా ఉంటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. సంభాషణ ప్రభావం తన మొహంమీద ప్రతిబింబించకూడదు.... "థ్యాంక్యూ వెరీమచ్!" అన్నాడతను తనవేపు నవ్వుతూ చూస్తూ, అటుగా వెళుతున్న గుమాస్తాకోసం.

"గణపతీ, అనుకోని అవాంతరం వచ్చిపడింది. యాభై వేలు కావాలి...." నిటలాక్షరావు కంఠంలో ఆదుర్దా నటిస్తోంది.

గణపతి ఉలిక్కిపడ్డాడు. నుదురుమీద బిందవులుగా పేరుకుంటున్న చెమటని అరచేత్తో అద్దుకున్నాడు. ఆరిపో తున్న పెదవుల్ని నాలుకతో తడిపే ప్రయత్నంచేశాడు.

"అక్కడే ఉన్నావా? చెప్పింది విన్నావా?"

గణపతి బరువుగా నిట్టూర్చాడు. వణుకుతున్న రిసీ

వర్ మీద కుడిచేతిని కూడా వేశాడు. "లేదని....నీకు తెలుసు."

"ప్రస్తుతం లేదని తెలుసు. నెలాఖరులోగా వస్తుందిగా?" నిటలాక్షరావు కంఠంలో నవ్వు స్పష్టంగా ధ్వనించింది.

"ఏమిటి నీ అర్థం?" గణపతి కోపాన్ని అణగదొక్కుతూ అన్నాడు.

"రిటైర్డ్ తహశీల్దార్ రామ్మోహనరావు తన కూతురు అనూరాధని నీకివ్వడానికి తయారుగా ఉన్నాడు. నువ్వు అంగీకరిస్తే, యాభై వేలు కట్నంయిచ్చి నిన్ను అల్లుడిగా కొనుగోలు చేయడానికి అతను తన సంసిద్ధతను వ్యక్తం చేశాడు. మూడొంతులు ఈ నెల ఇరవయ్యో తారీఖున పెళ్ళి జరుగుతుంది....

"ఇదంతా నీకెలా తెలుసు?" గణపతి అడ్డు తగిలాడు.

"పెళ్ళికాగానే నిన్ను వాళ్ళ ఊరికి బదిలీ చేయిస్తాడు. త్వరలో కూతురికూడా ఉద్యోగం సంపాయించి పెడతానన్నాడు. అదీమంచిదే. డబ్బుకోసం నువ్వు ఇప్పట్లా తడువుకోవాల్సిన అవసరం ఉండదు!" నిటలాక్షరావు చిలిపిగా అన్నాడు.

"నువ్వు పొరబడుతున్నావు. ఆ పెళ్ళి జరగదు!" గణపతి ఉక్రోషంతో అన్నాడు.

అటువైపున అతను నవ్వాడు. "బ్రహ్మచారి ముదరకూడదన్నారు. శోభలాంటి ఆడదాన్ని రుచిచూసిన నీలాంటి బ్రహ్మచారి అస్సలు ముదరడానికిలేదు! నేను చెప్తున్నా: అనూరాధని పెళ్ళాడు. మరో నాలుగేళ్ళుపోతే నీ కెవ్వరూ పిల్లనివ్వరు! అంచేత శుభ్రంగా పెళ్ళాడు. సుఖంగా

జీవించు. మీ మామగారిచ్చే కట్నం డబ్బులు నాకు చదివించు!"

"నో!" గణపతి అప్రయత్నంగా అరిచాడు.

"నో అనడానికి నీకు నోరులేదు. నేను చెప్తున్నా; అనూరాధని నువ్వు పెళ్ళాడుతావు! ఆడకపోతే ఏం జరుగుతుందో నీకు తెలుసు. నీ వివాహానికి నా తరపున నక్షత్రకమూర్తి వస్తాడు. రంగురంగుల ఫోటోల ఆల్బంతెస్తాడు. నువ్వుతోక తిప్పితే ఆల్బం పెళ్ళిలో అందరికీ విందు చేస్తుంది. అతన్ని సాదరంగా ఆహ్వానించు. కట్నంసొమ్ము భద్రంగా అందించు, అర్థమైందా!"

నోరు పెగుల్చుకుని, అర్థమైందని చెప్పేలోగా గణపతి చెవిలో అటువైపు ఫోన్ 'క్లిక్' అంది. రిసీవర్ని చెవికి తాపడం చేసుకున్న గణపతి విగ్రహంలా ఉండిపోయాడు.

"ఏమిటిగురూ, అదోలాఉన్నావ్? ఎవరవతల?" టెల్లర్ మధు ప్రశ్నించాడు.

గణపతి తెప్పరిల్లి కంగారుగా రిసీవర్ని పడేశాడు. బలవంతాన పెదాలు సాగదీసి అతనికి పళ్ళు చూపించాడు. "మరో ఆడపిల్ల తండ్రి బ్రహ్మచారిగా ఉండకూడదోయ్. ప్రాణాలు తీస్తారు!"

మధు నవ్వాడు. "ఉండొచ్చు; ఉద్యోగంలేని బ్రహ్మచారిగా!"

గణపతి నవ్వే ప్రయత్నంచేస్తూ లేచాడు. "టాయ్‌లెట్‌కి వెళ్ళొస్తా." అంటూ కదిలాడు.

8

గణపతి స్కూటర్ని ఇంటిముందు ఆపాడు.

అనురాధతో బాటు బజాజ్‌కబ్ తన జీవితంలో ప్రవే

శించింది. నెలనెలా నిటలాక్షరావు ఇన్‌స్టాల్‌మెంట్ పోగా, మిగిలిన పైకంతో అనూరాధనీ, స్కూటర్నీ మెయిన్ టెయిన్ చేయడం అసంభవంగా తయారై తను దడచుకు చచ్చే సమయంలో, ఏదోవరంలా ప్రమోషన్ వచ్చింది. తనరాకే అతని ప్రమోషన్‌కి కారణం అని అనూరాధ ఖచ్చితంగా నమ్మింది. చదూకున్నా, ఆమెలో మూఢ నమ్మకాలు దండిగానే ఉన్నాయి!

తన జీతంతోబాటు నిటలాక్షుడి డిమాండూ పెరుగు తుందని మొదటిలో తను భయపడ్డాడు. తను మేనేజరై ఆర్నెల్లయినా, వాడిరేటు పెరగలేదు; ఎందుకో!

"గుర్రం దిగి ఇంటిలోకి వస్తారా?"

గణపతి తల తిప్పిచూశాడు; ఉలిక్కిపడి. వరండాలో నిలబడి అనూరాధ నవ్వుతోంది. సన్నగా, నాజూగ్గా ఉన్న సౌందర్యాన్ని నల్లబోర్డరున్న తెల్లచీర హెచ్చవేత వేస్తూంది. తెల్లటిపళ్ళూ, నల్లటికళ్ళూ తనవైపు చిలిపిగా నవ్వుతున్నాయి. కిందికి దిగి స్కూటర్ స్టాండ్ వేసి, రెండుమెట్లెక్కి ఆమెవేపు నడిచాడతను.

అనూరాధ వెనక్కి తిరిగి, ఇంటిలోకి నడిచింది. వెనక వైపునుంచీకూడా, కుప్పపోసినట్టున్న ఆమె అందాన్ని సగర్వంగా చూస్తూ అతను ఆమెని వెంబడించాడు. అతని కెందుకో శోభ గుర్తొచ్చింది; అనూరాధను చూస్తూంటే.

శోభ ఎప్పుడూ తన అందాన్ని మోతాదు మించి ప్రదర్శించేది. అనూరాధ అలాకాదు. తన అందాన్ని ఆమె వోవర్ ఎక్స్‌పోజ్ చెయ్యదు. శోభకి తీసుకోవడం అలవాటు. అనూరాధ తీసుకోదు; ఇస్తుంది....

అతను ఆమెతోబాటు మంత్రముగ్ధుళ్ళా వంటగదిలోకి నడిచాడు. రెండు కప్పుల్లో కాఫీపోసి ఆమె అతనివైపు

తిరిగింది. "ముందుగదిలోకి పదండి!" అందామె నడుస్తూ.

గణపతి ముందుగదిలోకి నడిచి, మామగారు సప్లై చేసిన సోఫాలో కూచున్నాడు. కాఫీకప్పు అందించి, అతనిపక్కనే కూచుందామె. ఆమె అందాన్ని కళ్ళతో తాగుతూ, కాఫీ చప్పరించ సాగేడతను.

రెండుగుక్కల్లో కాఫీ ముగించి, కప్పుని టీపాయ్ మీద కుక్కి, ఇంకా తాగుతోన్న ఆమె చేతిలోంచీ కప్పుని మెల్లిగాతీసి, కిందపెట్టాడు. రెండుచేతుల్నీ ఆమె భుజాల చుట్టూ పోనిచ్చి ఆమెని బలంగా దగ్గిరికి లాక్కున్నాడు. అనూరాధ తల అతని భుజమ్మీద ఆనింది.

ఆమె జడలో నవ్వుతున్న మల్లెపూలు ఏదో తియ్యటి మత్తుని అతనిలోకి సరఫరా చేస్తున్నాయి. తన్మయత్వంతో అతని కళ్ళు మూతలపడ్డాయి.

"అన్నట్టు మరిచిపోయాను. మీ మిత్రుడుట.... నక్షత్రకమూర్తిట....ఏమిటా విచిత్రమైనపేరు? ....అతను ఫోన్‌చేశాడు. మిమ్మల్ని ఏడుగంటలా ఏడు నిమిషాలకి కోయా రెస్టారెంట్‌కి రమ్మన్నాడు. మీరు రాకపోతే, తనే ఇవాళో రేపో మనింటికి వస్తానన్నాడు...."

గణపతి తటాలున ఆమెని దూరంగా జరిపాడు. కంగారుగా ఆమెవైపు చూశాడు. అతని మొహంలోని ఆదుర్దాని అర్థంకానట్టు చూసిందామె.

"ఏమిటలా అయిపోయారు?" తన భుజాలమీంచీ చేతులుతీసి, దూరంగా జరిగిన గణపతిని ప్రశ్నించిందామె.

గణపతి చెవిటివాడిలా కాసేపు ఉండిపోయాడు. మెల్లిగా అతని పెదవులు కదిలాయి. "అనూ....అతనింకా ఏం చెప్పాడు?" భయంతో ప్రశ్నించాడతను.

"ఎవరని అడిగాను. మీ ప్రాణస్నేహితుడన్నాడు. ఏదోలా ఉన్నారు. ఏం....?" అనూరాధ ప్రేమగా అడిగింది.

గణపతి లోపల్లోపలే పళ్ళు కొరుక్కున్నాడు. ప్రాణ స్నేహితుడు! వాడు ప్రాణస్నేహితుడు కాదనీ, ప్రాణాలు తీసే 'స్నేహితుడనీ' భార్యకి చెప్పాలనిపించిందతనికి. తమాయించుకుని జేబులోంచీ సిగరెట్‌పాకెట్ తీశాడు. అగ్గిపెట్టి తియ్యలేదు. సిగరెట్‌ని పెదాలమధ్య ఇరికించి అనూరాధవైపు వోరగా చూశాడు.

"అనూ, అగ్గిపెట్టె పట్రా...." అన్నాడు మెల్లిగా. అనూరాధ లేచి, వంటగదిలోకి నడిచింది. కాసేపు వొంటరిగా ఉండాలనిపించిందతనికి.

అనూరాధ అగ్గిపెట్టె అందించింది. సిగరెట్ ముట్టించి, గణపతి సోఫాలోంచీ లేచాడు. మెల్లిగా నడిచి, కిటికీ ముందు నిలబడి అవతలికి చూస్తూ ఉండిపోయాడు.

అతని వెనక గాజులు చిన్నగా చప్పుడు చేశాయి. అనూరాధ చెయ్యి అతని భుజమ్మీదపడింది. ఆమె ప్రేమ అమాయకంగా ఆమె వేళ్ళగుండా తన శరీరంలోకి ప్రవహిస్తున్నట్టనిపించిందతనికి. గణపతి వెనక్కి తిరగలేదు. ఆమెవైపు చూడలేదు. అనూరాధ రెండోచేతిని కూడా అతని భుజమ్మీదవేసి, అతన్ని తనవైపు తిప్పుకుంది.

చెమట బిందువులతో నిండిన అతని మొహాన్నీ, గీతలుగా రూపొందుతున్న అతని నుదుర్ని అయోమయంగా చూసింది. అతని కళ్ళల్లో తను ఇదివరకు చూడని ఏదో అవ్యక్తభావం లీలగా గోచరిస్తూంది.

"ఏమిటండీ, అలా అయిపోయారు? ఆరోగ్యం బాగో లేదా?" అనునయంగా ప్రశ్నించిందామె. గణపతి ఆమెని సానుభూతితో చూశాడు. తను ఎందుకలా అయిపోయాడో ఆమెకి చెప్పలేదు. ముందు ముందు తను 'అదోలా' అయిపోతూవుండడాన్ని ఆమె చాలాసార్లు చూడాల్సివస్తుందేమో!

"అబ్బే.... వొంట్లో బాగోకేం? నక్షత్రకమూర్తి అన గానే పాతరోజులు-చదువుకున్నరోజులు గుర్తొచ్చాయి! అంతే...."

అనూరాధ తేలికగా నిట్టూర్చింది. "స్నానంచేసి, త్వరగా తెమలిండి. సినిమా ప్రోగ్రాం మరిచిపోయారా?"

గణపతి ఆమె విశాలనేత్రాలలోకి విచారంతో చూశాడు. రిస్టువాచీ చూసుకున్నాడు. "అనూ, అయామ్ సారీ. ఇవాళ సినిమా వొద్దు. వెళ్ళి అతన్ని చూడాలి...."

అనూరాధ విచారంగా చూసింది. "అతనే వస్తాడు లెండి. మీకు వీల్లేకపోతే తనే వస్తానన్నాడు. ఆ సినిమా ఇవాళే ఆఖరు...."

గణపతి సిగిరెట్ పీకని కిందపడేసి, కాలితో నొక్కి ఆర్పేశాడు. "అనూ, ప్లీస్.... రేపు మరో పిక్చర్‌కెళ్దాం. వాడిక్కడికి రాకూడదు...."

"ఏం?" అనూరాధ కనుబొమలు ముడిపడ్డాయి.

"నక్షత్రకమూర్తిలాంటివాళ్ళు చూస్తే, నీకు దిష్టి తగుల్తుంది!" గణపతి బలవంతాన చిరునవ్వు నవ్వాడు.

అనూరాధ కళ్ళు నవ్వాయి. ఎర్రటి పెదవులు కొద్దిగా విచ్చుకున్నాయి. "అదేంటండీ, వాళ్ళ అమ్మకీ నాన్నకీ మరోపేరు దొరకలేదా?"

గణపతి తెప్పరిల్లి నవ్వాడు. "వాడి అసలుపేరు అది

కాదు. రామగోపాలం. కాలేజీ రోజుల్లో స్నేహితుల్ని డబ్బుకోసం పిణుజులా పట్టుకుని, వదిలేవాడుకాడు. అంచేత మేమంతా వాణ్ని 'నక్షత్రకుడు' అన్నాం. నేను సులువుగా తెలుసుకోడానికి నీకాపేరు చెప్పివుంటాడు.... అనూ, వెళ్ళి త్వరగా వస్తా...."

"స్నానంచేసి గుడ్డలు మార్చుకువెళ్ళండి." అనూరాధ అంది.

"టైమ్ లేదు. ఈవేళప్పుడు సిటీబస్సుల్లో, రద్దిగా వుంటుంది...."

"బస్సెందుకు? స్కూటర్లో వెళ్ళిరండి."

"బస్సులోనే వెళ్తాను. స్కూటరులో వెళితే వాడు వెనకాల కూచుని, కోతిలా కరుచుకుంటాడు!" అంటూ ఆమెకి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా గబగబా ఇవతలికి నడిచాడు గణపతి.

(ఇంకా వుంది)

టీవీ కొక స్టీలు గిన్నె!



వెండి మట్టెలు

బి. రాజేశ్వరి

తండ్రిమాట విని చదువుతున్న పుస్తకాన్ని చటుక్కున పరుపుకింద దాచబోయాడు హరీష్ - కాని అప్పటికే శంకర్ లోనికి రావటం, కొడుకు చేతిలోని పుస్తకం చూడటం జరిగిపోయింది.

ఒక్కసారిగా అతని కళ్ళు అరుణిమను చిందించాయి. ఒక్క ఊపులో పుస్తకాన్ని హరీష్ చేతిలోనుంచి తీసు

కుని చించెయ్యబోయాడు.

"డాడీ, ఆ పుస్తకం మా ఫ్రెండు ఇంట్లో అడిగి తెచ్చుకున్నాను, ప్లీజ్ చింపొద్దు." అంటూ ప్రాధేయ పడ్డాడు హరీష్.

ముచ్చటైన ముఖచిత్రంతో మెరిసిపోతున్న 'అపరాధ పరిశోధన' తండ్రి చేతుల్లో కర్కశంగా నలిగిపోతోంది. హరీష్ మనసు గిలగిలలాడిపోతోంది.

"నీ కెన్నోసార్లు చెప్పాను, ఇలాంటి పుస్తకాలు చద వొద్దని! మరోసారి నువ్విలాంటి పుస్తకాలతో కనపడితే వీపు చీరేస్తాను. జాగ్రత్త!" కోపంగా పుస్తకాన్ని హరీష్ మీదికి విసిరి దొడ్లోకి వెళ్ళిపోయాడు శంకర్.

కిందపడ్డ పుస్తకాన్ని ఆప్యాయంగా అందుకుని, మడ తలు సరిచేసి, జాగ్రత్తగా లోపల దాచేశాడు హరీష్.

ఎందుకో నాన్నకి పుస్తకాలంటే కోపం! బహుశా ఆయన ఒకసారి కూడా ఈ పుస్తకం చదివివుండక పోవటంవల్ల ఆయనకు వీటి గొప్పదనం తెలిసుండదు. ఇందులో కథలు ఎంత చక్కగా వుంటాయి! ఎంత తార్కి కంగా, మెదడుకు పదును పెట్టి, మనసుకి ఉల్లాసాన్ని ఉత్తే జాన్ని కలిగిస్తాయి!

బహుశా ఆయన మనసులో ఏదో చవకబారు సాహి త్యం గురించిన అభిప్రాయం బాగా వేళ్ళు పాతుకుపోయి, ఈ సాహిత్యం కూడా అలాంటిదేనన్న ఆపోహ బలంగా నాటుకుని వుండొచ్చు. అందుకే 'అపన'ను చూసేటప్పటికి పిచ్చెత్తిపోతుంటాడు. ఆయన మనసులోనుంచి ఆ అపో హను తొలగించే ధైర్యం, చొరవ తనకు లేవు. తను ధైర్యంగా, నిర్భయంగా ఈ పుస్తకాలు చదువుకోగల అదృష్టమెప్పుడు దొరుకుతుందో!

పధ్నాలుగేళ్ళ హరీష్ భారంగా నిట్టూర్చాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న హరీష్‌కి తనో గొప్ప డిటెక్టివ్‌ని కావాలనే బలమైన వాంఛ, ఆసక్తి ఉన్నాయి. తను పెద్దయ్యాక ఖచ్చితంగా డిటెక్టివ్ అవుతాడు, అది నిజం!

హరీష్ పాఠ్యపుస్తకాలని ముందేసుకుని శ్రద్ధగా చదువుకోసాగాడు.

శంకర్ తుండుతో ముఖం తుడుచుకుంటూ ఓరగా కొడుకువంక చూశాడు. ఇందాకా ఆ పుస్తకం చదివినంత శ్రద్ధగాను పాఠ్యపుస్తకాలు చదువుకుంటున్న హరీష్‌ని చూసి తృప్తిగా తలూపాడు.

2

అయితే మర్నాడుదయమే హరీష్‌లోని డిటెక్టివ్ బయటపడే సంఘటన జరిగిపోయింది.

హరీష్ తల్లి ఉమాదేవి స్నానానికి వెళ్ళబోతూ చెవిదుద్దులు తీసి డ్రెసింగ్ టేబిల్‌మీద పెట్టి వెళ్ళింది. స్నానం చేసి వచ్చాక చూసుకుంటే దుద్దులు కనిపించలేదు. ఆమె గంగవెర్రులెత్తిపోయి అంతటా వెతికింది. కాని ఎక్కడా అవి కనిపించలేదు.

వీధి తలుపులు దగ్గరగా చేరవేసి ఉన్నాయి. కాని బోల్టు పెట్టి లేవు. పరధ్యానంలో తను వీధి తలుపులు మూసి వెళ్ళనందుకు తనను తాను నిందించుకున్నది ఉమాదేవి.

అప్పుడు ఉదయం పదిన్నరగంటలు. అంతక్రితమే శంకర్ ఆఫీసుకి వెళ్ళిపోయాడు. ఉదయం ఎనిమిది గంటలకే హరీష్, చెల్లెలు సుషమ స్కూలుకి వెళ్ళిపోయారు. ఇంట్లో ఉమాదేవి ఒక్కతే ఉందా సమయానికి. వంటిల్లు సర్దుకుని స్నానం చేయటానికి వెళ్ళింది.

ఉమాదేవి తల పట్టుకుని సోఫాలో అచేతనంగా కూల

బడిపోయింది. బంగారం ధర ఆకాశాన్నంటిన గడ్డురోజుల్లో తులం ఎత్తు బంగారంతో చేయించిన నాలుగువేల రూపాయిల దుద్దులు పోవటం ఆమె మనసుని బాగా కష్టపెట్టింది.

ఎలా జరిగిందీ దొంగతనం? తను బాత్‌రూంకి వెళ్ళినపుడు లోపలికెవరొచ్చారు? తను బయట కొచ్చేలోపల ఆ దుద్దులు కనిపించి సంగ్రహించుకుని మెదలకుండా వెళ్ళిపోయుండాలి! ఆ అవకాశం ఎవరికుంది?

పనిమనిషి తొమ్మిది గంటలకే వెళ్ళిపోయింది. ఇక పోతే చుట్టుపక్కల ఇళ్ళలోని వాళ్ళు ఆ టైంలో ఇంటికి రావటం మామూలే! అయితే అందరు ఉద్యోగస్థుల భార్యలు. సంఘంలో పరువుగా బతుకుతున్న వాళ్ళు. వాళ్ళెవర్నీ అనుమానించటం అమానుషం.

అయితే దుద్దుల్ని దొంగిలించే అవకాశం, అవసరం ఎవరికున్నాయి?

ఉమాదేవి మెదడు ఆలోచనలతో వేడెక్కిపోయింది. భర్తకి తెలిస్తే వీరభద్రావతారం దాలుస్తాడు. చెప్పకుండా దాచటం ముందే మంచిది కాదు. తమ భార్యాభర్తలమధ్య రహస్యాలు, అరమరికలు లేవు. కోపంలో ముందు తనని తిట్టినా ఆనక క్షమించేస్తారు.

కాని....అదికాదు తన సమస్య! ఇన్నాళ్ళు పూచికపుల్ల కూడా పోని తమ ఇంట్లో దొంగతనం మొదటిసారిగా జరిగింది. చాలా వెలువైన వస్తువు పోయింది. దీన్నిలాగే కొనసాగనిస్తే రేపు మరొకటి, ఎల్లుండి ఇంకొకటి—ఇలా సమస్తం దొంగలపాలై పోవటం ఖాయం!

ఆదిలోనే దీని నిరోధించాలి. ఆ దొంగెవరో కనుక్కోవాలి!

సాయంత్రం భర్తకన్న ముందుగా పిల్లలు ఇంటికి చేరారు. అప్పటికి పనిమనిషికూడా వచ్చింది.

పనిమనిషిని దుద్దుల విషయం అడగాలని నాలిక చివరి దాకా వచ్చింది. కాని దాన్ని గొంతులోనే సమాధి చేసే సింది. తను బయటపడిపోకూడదు. నిజంగా అదే దొంగ తనం చేసి ఉంటే పనిలోకి వచ్చి ఉండేదికాదు. ఏమో, వెంటనే మానేస్తే తనమీదనే అనుమానం బలపడుతుం దని పనిలోకి వచ్చేసిందేమో!....ఏమో....!?

తల విదిలించింది ఉమాదేవి. తన మనసు నిలకడ కోల్పోయింది. ఏది నిజమో, ఏది కాదో తెల్సుకునే అవ కాశం లేకుండా పోయింది. ఎవర్ని అనుమానించగలదు?

హరీష్ తల్లి దిగులుగా వుండటం, ఏదో మధనపడటం గ్రహించేశాడు. అప్పటికే రెండుసార్లు అడిగాడుకూడా కారణమేమిటని. ఉమాదేవి మొదట చెప్పలేదు. కాని, ఆ విషయాన్ని తనలో ఇముడ్చుకోవటం చాలా కష్టమని గ్రహించి, కొడుకుతో మెల్లగా చెప్పేసింది.

హరీష్‌లోని డిటెక్టివ్ ఉరకలు వేసుకుంటూ బయటి కొచ్చి నిల్చున్నాడు. ఎలాగైనా సరే తనీ కేసు పరిష్క రించాలి. తాను రెండేళ్ళుగా చదువుతున్న అపరాధ పరి శోధనా పరిజ్ఞానాన్ని ఉపయోగించాల్సిన తరుణం ఆసన్న మైంది.

ఓ చిన్న పాకెట్ బుక్ తీసుకున్నాడు. అందులో తల్లి దుద్దుల బరువు, వాటి ధర, అది పోయిన సమయం, పోయిన స్థలం—అన్నీ వివరంగా నోట్ చేసుకున్నాడు.

"బాగా గుర్తుజేసుకో అమ్మా, అవి డ్రెసింగ్ టేబిల్ మీదే పెట్టి వెళ్ళావు కదూ!?" అనడిగాడు హరీష్.

అతని సీరియస్‌నెస్, ఏకాగ్రత, సిన్సియర్‌గా ప్రశ్న

లడుగుతున్న తీరు చూసి మరొకప్పుడైతే ముచ్చటపడి ముద్దు పెట్టుకునేది ఉమాదేవి. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. కళ్ళముందు నాలుగువేల రూపాయలు వికటనాట్యం చేస్తూ తిరుగుతున్నాయి. హరీష్‌కి ఏం సమాధానం చెపుతున్నదో తెలియని స్థితిలో ఉంది.

"నాకు బాగా గుర్తు. డ్రసింగ్ టేబిల్‌మీదే పెట్టి వెళ్ళాను" అన్నదామె

హరీష్ డ్రెసింగ్ టేబిల్ దగ్గిర ఆగి తదేకదీక్షతో టేబిల్‌ని కాసేపు పరిశీలనగా చూశాడు. తర్వాత అద్దం వెనకనున్న ఖాళీస్థలం, టేబిల్ సొరుగులు వెతికాడు. ఏమీ కనిపించలేదు. ఒంగి టేబిల్ కింద చుట్టుపక్కల వెతికాడు. దుద్దులుగాని, మరేదైనా ఉపయోగించే ఆధారంగానీ లభించలేదు.

"దుద్దులు పోయాక ఇల్లు ఊడ్చావా అమ్మా?" అనడిగాడు హరీష్.

"ఊడిచాన్రా. అయినా అవి కింద పడిపోయి వుంటే నాకు కనిపించవా? ఖచ్చితంగా వాటినెవరో దొంగిలించి పోయారు!" అన్నది ఉమాదేవి. ఆమెకి మనసంతా చిరాగ్గా ఉంది. మరి కాసేపట్లో ఇల్లు చేరబోయే భర్తకి ఎలా చెప్పాలా అని, మానసికంగా ప్రిపేరవుతోంది.

హరీష్ తల్లి మానసికాందోళనని గ్రహించినట్లున్నాడు, మరి ప్రశ్నలు వెయ్యకుండా మౌనంగా తన పరశోధన చేసుకుపోతున్నాడు.

ముందుగా తమ ఇంటికి వచ్చేపోయేవాళ్ళ పేర్లన్నీ పాకెట్ నోట్‌బుక్‌లో వరసక్రమంలో రాసుకున్నాడు. తమ ఇంటికి ఎడమవైపు, కుడివైపు, ఎదురుగా, వెనగ్గా ఉన్న నాలుగిళ్ళలోని వ్యక్తుల పేర్లు ముందుగా రాస్కు

కున్నాడు. ఆ తర్వాత తమ ఇంటికి తరచుగా వచ్చే విజిటర్స్ పేర్లు రాసుకున్నాడు.

తర్వాత ప్రతి రోజూ వచ్చే వ్యక్తులను నోట్ చేసుకున్నాడు. పాలవాడు, కూరల మనిషి, పనిమనిషి, పేపరు బోయ్, పోస్ట్‌మన్-చోటు చేసుకున్నారా బుక్‌లో.

వీరిలో ఎవర్ని అనుమానించేటట్లు?

తను చదివిన కథల్లో హంతకుడుగాని, దొంగ గాని ఏవో కొన్ని ఆధారాలు నేరం చేసిన చోట వదిలినట్టు దాన్నిబట్టి డిటెక్టివ్‌లు నేరస్తుల్ని పట్టుకుని చట్టాని కప్పగించినట్టు ఉన్నది. కాని ఈ దొంగ ఎలాంటి ఆధారం వదిలిపెట్టలేదు. ఎలా ఆ దొంగని పట్టేది?

హరీష్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఎలాగైనా ఆ దొంగను తను పట్టి తీరాలి! తను చదివే సాహిత్యాన్ని చిన్న చూపు చూసే తండ్రి అభిప్రాయాన్ని తప్పని నిరూపించాలి! ఆయన మెప్పు పొందాలి.

హరీష్ ప్రతి సెంటిమీటరు ఆధారాల కోసం చాలా సహనంతో వెతుకుతున్నాడు. చివరి కతని అన్వేషణ ఫలించింది. డ్రెసింగ్ టేబిల్ అట్టడుగున మెరుస్తూ కనిపించిన వస్తువు అతనికి కన్నుల పండువ చేసింది.

ఒంగి దాన్ని అందుకున్నాడు. అరచేతిలో కొద్ది క్షణాలసేపు దాన్ని అపురూపంగా చూసుకున్నాడు.

అది ఆడవాళ్ళు ధరించే కాలిమట్టె. వెండితో తయారు చేయబడిన మట్టె.

తల్లి కాళ్ళకు మట్టెలు ధరించదని తనకి తెలుసు. అయితే ఇది ఖచ్చితంగా ఆ దొంగదే అయివుండాలి! హరీష్ గుండె స్పందన హెచ్చింది.

అయితే దొంగ మగాడు కాదు-ఆడది! అందునా

పెళ్ళయిన ఆడది - పెళ్ళయిన ఆడవాళ్ళే వెండి మట్టెలు కాళ్ళకు ధరిస్తారని కూడా హరీష్‌కి తెల్సు!

దొంగ మగాడు కాదని తేలిపోయింది గాబట్టి, లిస్టులో మొగ పేర్లన్నీ తొలిగించి వెయ్యాలి. హడా విడిగా పాకెట్ నోట్‌బుక్ తెరచి అందులోని మొగాళ్ళ పేర్లన్నీ కొట్టేశాడు హరీష్. అలాగే పెళ్ళి కాని ఆడ పేర్లను కూడా కొట్టేశాడు.

ఇక మిగిలినవి అయిదు పేర్లు మాత్రమే. అయిదు గురిలో నలుగురు తమ చుట్టూ వున్న ఇళ్ళలో వుంటున్న ఆంటీలే! అయిదో పేరు తమ ఎదురింట్లోని అంకుల్ చెల్లెలు. ఈమధ్యనే పెళ్ళయింది. ఇంకా పుట్టింటిలోనే వుంది. ఈ అయిదుగురు తరచు తమ ఇంటి కొచ్చి అమ్మతో మాట్లాడుతుంటారు.

ఇప్పు డీ అయిదుగుర్లో ఎవరు మట్టెలు ధరిస్తారో వెరిఫై చెయ్యాలి

పేర్లు ఓసారి చూసుకున్నాడు హరీష్.

ఎదురింటి ఆంటీపేరు విజయ. ఆమె ఆడపడుచు పేరు రాణి. తమ ఎడమ పక్క ఇంట్లో ఆంటీ కృష్ణవేణి. కుడి పక్క ఝాన్సీ, వెనకవయిపు వసంత ఆంటీ వుంటు న్నారు.

3

హరీష్ ముందుగా ఎదురింటికి వెళ్ళాడు.

వాళ్ళ బుజ్జిగాడితో ఆడుతున్నట్టు నటించి విజయ ఆంటీ కాళ్ళని పరీక్షించాడు ఆమెకు తెలియకుండా. ఆమె కాళ్ళకు మట్టెలున్నాయి. అయితే రెండు కాళ్ళకు రెండేసి వున్నాయి. బాగా మట్టిపట్టి నల్లరంగుకి తిరిగిపోయాయి. రాణి కాళ్ళకు అసలు మట్టెలే లేవు. ఆమె మోడర్న్‌గా

వుంటుంది. అక్కడ్నుంచి వచ్చేశాడు హరీష్.

తర్వాత వరసగా కృష్ణవేణి. రూప్సీ, వసంత ఆంటీ లని కూడా వాళ్ళు గమనించకుండా వెరిఫై చేశాడు.

ముగ్గురిలోను వసంత ఆంటీ తప్ప ఎవరూ మట్టెలు ధరించటం లేదు. వసంత ఆంటీ కాళ్ళకు ఒక్కో మట్టె చొప్పున వున్నాయి. మరీ పాతవి కొత్తవి కాక మధ్యస్థంగా వున్నాయి.

తనకి దొరికిన మట్టె కొత్తది. మిల మిల మెరిసి పోతోంది. కొత్తది కావటంతో వేలికి వదులుగా వుండి జారిపోయుండాలి.

అయితే ఈ మట్టె ఎవరిది?

హరీష్ చిన్న మస్తిష్కం అతి చురుకుగా పని చేస్తోంది. ఏమైనా తను దొంగని పట్టితీరాలి!

ఉమాదేవి అప్పటిదాకా జరిగిన దొంగతనం విషయం హరీష్‌కి మాత్రమే చెప్పింది. భర్త వస్తే అతనితో చెప్పి బరువు దించుకోవాలనుకుంటోంది. అయితే భర్త రాలేదు గాని కబురు వచ్చింది - ఆఫీసు పని మీద వైజాగ్ వెళుతున్నట్టు, రెండు జతల బట్టలు సూట్ కేస్‌లో పెట్టి కబురు తెచ్చిన అటెండర్‌తో పంపించమని.

ఉమాదేవి మనసు తేలికపడలేదు. భర్తతో చెప్పు కునేందుకు వీలులేకపోయింది.

అయితే హరీష్‌కు సంతోషంగా వుంది. తన డిటెక్షన్‌ని అడ్డుకునేందుకు తండ్రి ఇంట్లో లేడు. ఆయన వచ్చేలోపల తను దొంగని పట్టెయ్యాలి! నూతనోత్సాహంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు. కాని అంతలోనే అతన్ని దిగులు ఆవరించింది.

దొరికిన ఒకే ఒక్క 'క్లూ' ఎందుకూ పనికిరాకుండా

పోయింది. తన పరిశోధన సక్రమంగా కొనసాగకుండా బ్రేక్ పడిపోయింది. ఎవర్ని అనుమానించేటట్టు?

హరీష్ మెదడులో ఫ్లాష్ వెలిగింది.

ఆ మట్టెలు ఈ మధ్యనే తయారు చేసినట్టు స్పష్టంగా తెలుస్తోంది. తమ కాలనీ వాళ్ళంతా వస్తువులు వీరాచారి వద్దనే తయారు చేయిస్తారు. ఆయన్ని కలుసుకుని అడిగితే....!?

హరీష్ ఇంకో క్షణం కూడా ఆలస్యం చెయ్యలేదు. అఘమేఘాల మీద కాలనీకి చేర్చివున్న బస్తీలోవుంటున్న వీరాచారి ఇంటికి వెళ్ళాడు.

సమయానికి వీరాచారి ఇంట్లో లేడు. ఓ గంటలో రమ్మన్నాడు వీరాచారి కొడుకు. హరీష్ ఓపిగ్గా అక్కడే కాచుకున్నాడు. గంట తర్వాత వచ్చాడు వీరాచారి.

అప్పుడు సమయం రాత్రి ఎనిమిదిన్నరయింది.

వీరాచారి హరీష్‌ని ముందు గుర్తుపట్టలేదు. ఉమాదేవి కూడా తమ వస్తువులు వీరాచారి చేతనే తయారు చేయిస్తుంది. ఎవరో చెప్పాక గుర్తుపట్టాడు.

హరీష్ మట్టెను చూపించి, "ఈ మట్టె మీరు తయారు చేసిందేనా కాస్త చెప్పండి" అన్నాడు.

వీరాచారి విస్తుపోయి చూశాడా కుర్రాడి వంక. పెద్ద ఆరిందాలా గంభీరంగా సూటిగా అడుగుతున్న హరీష్ వంక, మట్టె వంక మార్చి మార్చి చూశాడు. తర్వాత మట్టె అందుకుని పరీక్షగా చూసి తల అడ్డంగా తిప్పాడు.

"నేను చెయ్యలేదు. ఇదెవరిది? ఎందుకీ ఎంక్వయిరీ!" అన్నాడు వీరాచారి.

హరీష్ అందుకు జవాబివ్వకుండా, "ఇది తయారు చేసి ఎన్నాళ్ళవుతుందో చెప్పగలరా?" అనడిగాడు.

వీరాచారి మరోసారి దానివయిపు చూసి, "నెల రోజుల లోపే అయివుంటుంది. అవునుగాని బాబూ, ఎందుకీ వివ రాలు?" అన్నాడు మళ్ళీ.

"థాంక్స్ ఆచారిగారూ! తర్వాత చెపుతాను" అని మట్టెనందుకుని వెళ్ళిపోయాడు హరీష్.

తమ కాలనీలో కొత్తగా పెళ్ళయిన వాళ్ళెవరో పరిశో ధించాలి. తనకి తెలిసి తమ ఎదురింటి రాణి మాత్రమే ఈ మధ్య పెళ్ళయిన అమ్మాయి. ఆమె నిందాకే వెరిఫై చేసేశాడు - మట్టెలే ధరించదు.

ఇక ఎవరయి వుంటారు?

హరీష్ తల విదిలించాడు. తన పరిశోధన సక్రమంగా సాగటం లేదు. ఈరాత్రి యిక ఏమీ చెయ్యటానికి లేదు. తెల్లారాక కాలనీ అంతా సర్వే చేసేయ్యాలి. దొంగ దొకర్కుపోదు.

రేపు ఆదివారమే కాబట్టి తనకి సెలవే. తన ఫ్రెండ్స్ కూడా ఇళ్ళ దగ్గిరే దొరుకుతారు. వాళ్ళని చూడటానికి వెళ్ళినట్టు ప్రతి ఇంటికీ వెళ్ళి పరిశోధించాలి!

ఉమాదేవి ఇల్లు పట్టకుండా తిరుగుతున్న హరీష్‌ని చూసి, "ఎందుకురా నీకీ తాపత్రయం! అవి మనకు ప్రాప్తంలేదు, పోయాయి. నాన్నగారు కాంప్‌నించి వచ్చాక చెపుదాం. అంతకన్న చేసేదేముంది?" అన్నది నిరాశగా.

ఉమాదేవి లోతుగుండె మనిషి. మరో స్త్రీ అయితే అప్పటికే పెద్ద సభపెట్టి తన దుద్దుల చోరీగురించి గోల పెట్టేసి ఉండేది. కాని నిండు కుండలా తొణకలేదామె.

అదీ మంచిదే అయిందనుకున్నాడు హరీష్. బయట పడిపోతే దొంగ జాగ్రత్తపడిపోతుంది.ఎప్పటికీ దొరకదు.

4

భోంచేసి పడుకున్నాడేగాని నిద్రపోకుండా అలా ఆలో చిస్తూనే ఉన్నాడు హరీష్. ఎప్పుడో తెల్లవారుఝామున నిద్రపోయాడు. మళ్ళీ తెల్లారకుండానే లేచిపోయాడు.

తనకి మెలకువ రావటానికి కారణం పనిమనిషి గొంతే నని గుర్తించాడు. పెద్దనోరు పెట్టుకుని ఏదో చెపుతోంది. లేచి వరండాలోకి వచ్చాడు.

హరీష్ దృష్టి ముందుగా పనిమనిషి పైడమ్మ కాళ్ళ మీదికే పోయింది. దాని కాళ్ళకు మట్టెలు లేవు మట్టితప్ప.

"....నా కూతుర్ని ఈ ఏళే కాపరానికంపుతుండానమ్మ గారూ! నాల్రోజులపాటు పన్లోకి రానండమ్మా. ఎట్టాగో సదురుకోండ్రి" అంటోంది పైడమ్మ.

హరీష్‌కి పదిహేనురోజుల క్రితం పైడమ్మ కూతురి పెళ్ళి జరిగినట్టు అకస్మాత్తుగా గుర్తొచ్చింది. అమ్మ దాని కూతురుకి ఇంకా సరిగ్గా నలగని రెండు చీరలు, జాకెట్లు ఇచ్చింది పెళ్ళి సందర్భంగా.

పెళ్ళిమాట గుర్తుకు రాగానే హరీష్ నిద్రమత్తు ఒక్క సారిగా వదిలిపోయింది. తను ఎంతసేపూ కాలనీలోవుండే మర్యాదస్తులైన ఆడవాళ్ళగురించే ఆలోచించాడుగాని పని మనిషి కూతురుగురించి ఆలోచించనే లేదు.

హరీష్ మరుక్షణం వీధిలో ఉన్నాడు. పైడమ్మ ఉంటున్న కొంపలు తనకి తెలుసు. సరిగ్గా ఇరవై నిమి షాల్లో పైడమ్మ ఇల్లు చేరుకున్నాడు. పైడమ్మ కూతురు అప్పుడే లేచినట్టుంది. పబ్లిక్ టాప్ దగ్గిర నీళ్ళు పడు తోంది. హరీష్ ఆమె చూడకుండా చాటునుంచే ఆమె కాళ్ళను పరీక్షగా చూశాడు.

హరీష్ గుండె ఒక్క క్షణం ఆగి కొట్టుకున్నది. దొంగ

దొరికిపోయింది!

పైడమ్మ కూతురి ఎడమకాలి వేళ్ళకు రెండు వెండి మట్టెలు నిగనిగా మెరుస్తున్నాయి. కుడికాలి వేళ్ళకు ఒకే ఒక మట్టె ఉన్నది. ఆ మట్టెలు, తనదగ్గిరున్న మట్టె ఒకటే! ఏమాత్రం సందేహం లేదు!

హరీష్ ఇంకొక్క క్షణం కూడా వ్యర్థం చెయ్యలేదు. తమ కాలనీలోనే కమ్యూనిటీ హాలుకి చేర్చివున్న ఫ్లాట్ లో ఉంటున్న ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్ ని కల్సుకున్నాడు.

"అంకుల్, మీరో సాయంచెయ్యాలి, అర్జెంటు!" అన్నాడు హరీష్ ఆత్రుతగా.

శ్రీకాంత్ హరీష్ భుజంతట్టి, "ఏమిటా తొందర? అలా కూచో! ఏమిటీ తూర్పు తెల్లవారకుండా పోలీసుల్ని కల్సుకున్నావు. ఏం కథ?" అన్నాడు నవ్వుతూ.

హరీష్ గుక్క తిప్పుకోకుండా దుద్దుల చోరీగురించి తన పరిశోధన గురించీ వివరంగా చెప్పి వెండి మట్టె చూపించాడు.

శ్రీకాంత్ విస్తుపోయి చూశాడతనివంక. "వాటే గ్రేట్ డిటెక్షన్? ఉండు రెండునిమిషాల్లో వస్తున్నాను" అంటూ చకచక యూనిఫాం వేసుకుని బూట్లు టకటకలాడించుకుంటూ బయటికొచ్చి "పద, వెళ్దాం!" అన్నాడు.

శ్రీకాంత్ హీరో హోండామీద ఇద్దరు పదినిమిషాల్లో పైడమ్మ ఇల్లు చేరుకున్నారు.

శ్రీకాంత్ ని చూడగానే పైడమ్మ కూతురి ప్రాణాలు పైనేపోయాయి. అయితే ఆయనతోవున్న హరీష్ నిచూశాక కొంత ధైర్యం వచ్చిందామె. కాని, అది కొద్దిసేపు మాత్రమే!

శ్రీకాంత్ ఆమెను సూటిగాచూస్తూ "నీ కాలి మట్టెల్లో నాలుగోదాన్ని ఎక్కడైనా పారేసుకున్నావా?" అనడిగాడు

సౌమ్యంగా.

పైడమ్మ కూతురు తడబడుతూ కాళ్ళవేపు చూసుకుని, ఉలిక్కిపడింది. అప్పటివరకు మట్టెపోయిన నిజాన్ని ఆమె గ్రహించలేదని ఆమె ముఖకవళికలే చెపుతున్నాయి.

"ఇదిగో, నీ మట్టె" అంటూ శ్రీకాంత్ చెయ్యి ముందుకు చాచి గుప్పెట తెరిచాడు. గుప్పెట్లో మిలమిల మెరుస్తూన్న మట్టెను చూసి నిర్ఘాంతపోయి, అంతలోనే భయంతో వణికిపోయింది పైడమ్మ కూతురు.

"నువ్వు దొంగిలించిన చెవి దుద్దులేవి?" గర్జించాడు శ్రీకాంత్.

ఆ మాట వింటూనే ఒక్కసారిగా అక్కడినుంచి పారిపోబోయిందామె. కాని శ్రీకాంత్ ఆమెని అడుగు కదలనివ్వలేదు.

ఆ తర్వాత దుద్దులు ఆమెనుంచి రాబట్టడం పెద్ద కష్టం కాలేదు. మట్టికుండలోపెట్టి అటకమీద దాచిన దుద్దులు కిందికొచ్చాయి.

"బుద్ధి గడ్డితిని పాడుపని చేశాను. నన్ను జెయిల్లో నెట్టకండయ్యా!" అంటూ శ్రీకాంత్ కాళ్ళు పట్టి గొల్లుమన్నది పైడమ్మ కూతురు.

తర్వాత తనా దుద్దులెలా దొంగిలించినదీ చెప్పేసింది.

క్రితంరోజు అమ్మగార్ని కలిసి అత్తవారింటికి వెళ్ళిపోతున్నానని చెప్పి ఏమైనా అడిగి తెచ్చుకోమని కూతుర్ని ఉమాదేవి దగ్గరకు పంపింది పైడమ్మ. పైడమ్మ కూతురు ఉమాదేవి వాళ్ళ ఇంటికెళ్ళేసరికి ఉమాదేవి అప్పుడే స్నానానికి వెళ్ళింది-వీధితలుపు గడియపెట్టకుండా మరిచిపోయి.

పైడమ్మ కూతురుకి ఉమాదేవి వాళ్ళింట్లో చనువుంది.

ఆ చనువుతో లోపలికి యధేచ్ఛగా ప్రవేశించింది. సమయానికి అమ్మగారు లేకపోవటం, డ్రెసింగ్ టేబిల్‌మీద దుద్దులు ఎదురుగా కనిపించటం ఆమె మనసులో దుర్బుద్ధి పుట్టించి దొంగతనానికి పురికొల్పింది. అంతే!

వెంటనే దుద్దుల్ని పైటకొంగుకు ముడేసుకుని ఉమాదేవి బయటకొచ్చేలోపల అక్కడ్నుంచి హడావిడిగా వెళ్ళిపోయింది. ఆ హడావిడిలో వదులుగావున్న ఓ మట్టె జారిపోవటం ఆమె గుర్తించలేదు. ఆ తర్వాతెప్పుడో పైడమ్మ అమ్మగారేమిచ్చారని కూతుర్ని అడిగితే, అసలు అక్కడికి పోనేలేదని అబద్ధమాడేసింది. నిజానికి పైడమ్మకి అసలు విషయం తెలియనే తెలియదు.

సరిగ్గా అదే సమయానికి ఇంటికి తిరిగొచ్చిన పైడమ్మ జరిగిన విషయం తెలుసుకొని శ్రీకాంత్ కాళ్ళకు చుట్టుకుపోయింది. గోడుగోడున ఏడ్చింది. తన కూతుర్ని జైలుపాలు చెయ్యవద్దని గగ్గోలుపెట్టింది. లక్ష క్షమాపణలు వేడుకుంది.

చివరగా హరీష్‌కి చేతులెత్తి మొక్కింది. ఇన్‌స్పెక్టరుబాబుకి చెప్పి తప్పుకాయమని చెప్పుబాబూ అంటూ ఏడిచింది.

హరీష్ శ్రీకాంత్ వంక చూసి, "పోనివ్వం డంకుల్, మన సొమ్ము దొరికింది, నా పరిశోధన ఫలించింది. అయామ్ వెరీ హేపీ!" అన్నాడు.

క్యాంప్‌నించి తిరిగొచ్చిన శంకర్ కొడుకు ప్రయోజకత్వం విని ప్రశంసగా చూశాడతనివంక. తర్వాత 'కంగ్రాట్స్' చెప్పి భుజం తట్టాడు.

ఆ తర్వాత ఎప్పుడూ "అపరాధ పరిశోధన" దొంగచాటుగా చదవాల్సిన అవసరం రాలేదు హరీష్‌కి. □

సాక్షి

షణిబాబు



ప్రహరి గోడను జాగ్రత్తగా పరిశీలించాను. చాలా ఎత్తుగా ఉందది.

మెల్లిగా గేటువైపు జరిగాను. గేటు దగ్గిర ఎవ్వరూ లేరు. లోపలకు చూశాను. అక్కడకూడా ఎవ్వరూ లేరు.

గేటుగుండా లోనికి నడిచాను. అయితే ముఖద్వారం

వైపు వెళ్ళలేదు. వెళ్ళితే దొరికిపోతానని నాకు తెలుసు. అందుకే పెరడువైపు వెళ్ళాను.

అక్కడకూడా ఎవ్వరూ లేరు. ముందుగా వంటగది లోనికి వెళ్ళాను. తలుపు తీసే ఉంది. భోజనాల బల్లపైన ఒక గిన్నెలో పాలు ఉన్నాయి.

చుట్టూ చూశాను. మనుష్యుల అలకిడి ఏమాత్రంలేదు. నా భారీకాయాన్ని భోజనాల బల్ల క్రిందవున్న కుర్చీలోనికి చేర్చాను. బల్లపైని పాలు ఆత్రంగా తాగటం మొదలు పెట్టాను.

పాలు తాగుతున్నా నా ఆలోచనలు సంధ్యపైనే ఉన్నాయి. ఆ ఇల్లుగలాయన పేరు పార్థసారథి. ఆయన రెండో కూతురు సంధ్య.

నేను ఆ ఇంటికి అంతరహస్యంగా రావడానికి కారణం దొంగతనం కాదు.

అవును! నేను దొంగతనకోసం ఆ ఇంటికి రాలేదు.

సంధ్య! సంధ్యకోసం వచ్చాను. పార్థసారథి నన్ను చూస్తే చాలా గొడవ అవుతుందని తెలిసికూడా రహస్యంగా ఆ ఇంటికి వచ్చానంటే.... కేవలం సంధ్యకోసం.

సంధ్యకు నేనంటే చాలా ఇష్టం. ఒక్కడిని దొరికానంటే అస్సలు వదిలిపెట్టదు. మంచి కబుర్లు చెబుతుంది. తినడానికి ఏదో ఒకటి పెడుతుంది. ఒకసారయితే నన్ను గట్టిగా పట్టుకుని ముద్దుకూడా పెట్టింది.

సంధ్య చాలా అందంగా ఉంటుంది. పాలరాతితో అందమైన బొమ్మను చెక్కి, దానిని పన్నీటి జలకమాడించి ఒళ్ళంతా గంధం పట్టించి, ఆపైన తెల్ల గులాబిరేకులతో మాలీష్ చేస్తే అది ఎలా ఉంటుందో, అచ్చు అలాగే ఉంటుంది సంధ్య.

"ధబ్"

హటాత్తుగా ఏదోశబ్దం నా చెవులకు వినబడింది. చెవులు రిక్కించి వినసాగాను. పెరటివైపునుంచి వస్తుందా శబ్దం.

కిటికిలోనుండి బయటకు చూశాను.

అంతే! గుడ్లప్పగించి అలానే చూస్తూండిపోయాను.

* * *

కాసేపటికి నాలో చలనం కలిగింది. జాగ్రత్తగా తలుపు వెనక్కు చేరి చూడసాగాను. అక్కడినుండి నా కంతా కనిపిస్తుంది. కాని నేనెవ్వరికి కనిపించను.

ఎవరో ఒక వ్యక్తి పెరటిగోడ దూకి లోపలకు వచ్చాడు. బహుశ దొంగ అయి వుండాలి. ముఖం సరిగ్గా కనబడటంలేదు. జాగ్రత్తగా నక్కి నక్కి వస్తున్నాడు.

వాడిని మనస్సులోనే కసిగా తిట్టుకున్నాను. ఈ సమయంలో వాడుకూడా రావాలా? ఇప్పుడు అల్లరి అయితే పార్థసారధిగారు మా ఇద్దరి వీపులు విమానం మ్రోత వచ్చేలా వాయించేస్తారు.

తలుపుచాటున ఉండి ఆ వ్యక్తిని జాగ్రతగా గమనించ సాగాను. పెరట్లోని బాదంచెట్టు దగ్గిర ఆగాడు. నాలుగు ప్రక్కలు చూసాడు. ఆ తర్వాత రెండుచేతులు నోటిదగ్గిర చేర్చి పిల్లిలా అరిచాడు.

ఆ వ్యక్తి అభిప్రాయం నాకు అర్థంకాలేదు. దొంగ తనానికి వచ్చిన వాడు నిశ్శబ్దంగా తనపని తాను చూసుకు పోక ఇలా పిల్లికూతలు కూస్తాడేమిటి?

సరిగ్గా అప్పుడే నాకు ఇంకో ఆలోచన వచ్చింది. దొంగతనానికి ఈ వ్యక్తి ఒక్కడే వచ్చిఉండడు. ఇతని సహచరులు బయటవుండి ఉంటారు. ఈ మనిషి ముందు వచ్చి ఉంటాడు. ఇతడు ఎవ్వరూలేరని ఇలా పిల్లికూతల

ద్వారా బయటివాళ్ళకు తెలియచేస్తాడన్నమాట. అంటే కాసేపటిలో మిగిలిన మనుష్యులు లోపలకు వస్తారు.

సరిగ్గా ఈ సమయంలోనే నేను రావాలా? నా దుర దృష్టాన్ని విపరీతంగా నిందించుకుంటూ అలాగే నిల బడ్డాను. నా గుండె విపరీతమైన వేగంతో కొట్టుకుంటుంది.

అదే సమయంలో ఇంటి తలుపు తెరచుకుంది. తలుపు చాటుకు మరింత చేరి దాక్కున్నాను. ఎవరో మనిషి పెరటివైపున వెళుతున్న అలికిడి వినబడింది.

తల కొంచెం బయటకు పెట్టి చూసాను.

సంధ్య! అవును సంధ్యే! బాదంచెట్టువైపు వెళుతుంది. ఆ బాదంచెట్టు దగ్గిర దొంగ ఉన్నాడని అరచి చెబుదామను కున్నాను.

కాని నా నోటినుండి అరుపు బయటకు రాకముందే సంధ్య అక్కడికి చేరిపోయింది.

అంతే! చెట్టుచాటునున్న మనిషి సుడిగాలిలా సంధ్యను చుట్టేశాడు. నా ఒళ్ళు భయంతో ఝల్లుమంది.

"అబ్బబ్బ! రాజా ఆగు." విసుక్కుంది సంధ్య.

"చస్తే ఆగను. ఇంకా ఎంతకాలం ఆగాలి. ఊరించి, ఊరించి నా మెదడు పాడుచేస్తున్నావు ఇలా కొంతకాలమైతే పిచ్చివాడిని అయిపోతాను." నవ్వుతూ చెప్పాడు రాజా.

"ఇప్పుడు నాన్నగారు చూస్తే ఖచ్చితంగా నీకు పిచ్చి పట్టేలా చేస్తారు."

"మన సంగతి మీ నాన్నగారికి చెప్పావా?"

"అమ్మకు చెప్పాను. నాన్నగారికి తెలిసింది. చాలా గొడవ అయ్యింది. నన్ను కొట్టారు కూడా." సంధ్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అయితే మన పెళ్ళికి ఒప్పుకోరా?" అడిగాడు రాజా.

"ఒప్పుకోరు. పైగా నిన్ను చంపేస్తానంటున్నారు. నాకు భయంగా వుంది."

"నా మాట విను సంధ్యా! ఎక్కడికైనాపారిపోయి పెళ్ళి చేసుకువచ్చేద్దాం. ఆ తర్వాత వీళ్ళు మనల్ని ఏమీ చెయ్య లేరు" సంధ్య నడుంచుట్టూ చెయ్యివేస్తూ చెప్పాడు రాజా.

"లేచి పోదామా?"

"ఎక్కడికిపోము. పెళ్ళి చేసుకుని మళ్ళీ ఇక్కడికే వచ్చేద్దాం."

"ఫట్" రాజా తలపై పిడుగుపడింది. వెనుక్కు తిరిగే లోగా మరోదెబ్బ. 'కెవ్వున' అరవబోయిన సంధ్య చెంప ఎర్రగా కందిపోయింది. చెంపదెబ్బ తగలగానే విరుచుకు పడిపోయింది సంధ్య.

ఒక్కక్షణం నాకు జరుగుతున్నదేమిటో అర్థంకాలేదు. పార్థసారధిగారు, ఆయన భార్య సావిత్రి నిల్చున్నా రక్కడ. రాజా సంధ్య నేలపై అడ్డదిడ్డంగా పడిఉన్నారు. చేతిలోని ఇనపకడ్డీని పక్కన పారేశారు పార్థసారధి.

"నా కూతురిని లేవదీసుకుపోదామనుకున్నావురా?" కసిగా రాజా డొక్కలో తన్నారు పార్థసారధిగారు.

అంతలోనే ఏదో అనుమానం వచ్చి రాజా ముక్కు దగ్గిర వేలుపెట్టి చూసారు.

"కొంప మునిగింది సావిత్రీ! వీడు చచ్చిపోయాడు."

"ఇప్పుడెలా? మీకు కోపంవస్తే ఒళ్ళు తెలీదు." ఏడుపు గొంతుతో అన్నదావిడ.

"నేను చంపాలని కొట్టలేదు. తగలకూడని చోట తగిలి వుంటుంది. అమ్మాయిని లోనికి తీసుకువెళ్ళు. నేను వీడి శవాన్ని మాయంచేస్తాను. జాగ్రత్త!"

విపరీతమైన భయం నన్నావరించింది. ఒక నిండు

ప్రాణాన్ని నిర్దాక్షిణ్యంగా బలితీసుకున్నాడాయన. ఇప్పుడు నన్నుచూస్తే? పైగా ఈ హత్య నా కళ్ళముందు జరిగింది.

వెంటనే అక్కడినుండి బయటకు పరిగెత్తాను. ఇంటి చుట్టూ తిరిగి వీధి గుమ్మంగుండా బయటకు పరిగెత్తాను. పార్థసారధిగారు నన్ను చూసాడో, లేదో నాకు తెలీదు.

మెట్లెక్కి వేగంగా మా ఇంటికి పరిగెత్తాను.

* * *

చెప్పాలి. ఇంటిలో అందరికి పార్థసారధిగారు చేసిన హత్యగురించి చెప్పాలి.

ముందు గదిలోనికి వెళ్ళాను. అక్కడ కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్నాయనను చూస్తూనే అరచి చెప్పడం మొదలుపెట్టాను.

"భొ....భొ....భొ"

"చిన్నీ! టామిని వదిలివేశారేమిటి? గొలుసుతో కట్టెయ్యండి." చెప్పారాయన.

మరుక్షణం నా మెడకు గొలుసుపడింది. □

"స్టాప్! స్టాప్!"



చోరలీల

వసుంధర



అదొక చిన్న ప్రశాంతమైన కాలనీ. అందులో సుమారు రెండువందల యిళ్ళున్నాయి. అలాంటిళ్ళలో ఓ ఇంటిలో ఒకరోజు మధ్యాహ్నం....

శారదభర్త వామనరావు మధ్యాహ్న భోజనంచేసి దగ్గర్లోనే ఉన్న ఆఫీసుకు వెళ్ళిపోయాడు. అప్పుడు టైము ఒంటిగంటన్నరయింది.

శారద యిల్లు సద్దుకుని తలుపులు తాళం వేసుకుని — ఇంటి వెనుకనే ఉన్న పనిమనిషితో "జాగ్రత్త! నేను బయటకు వెడుతున్నాను—" అని చెప్పి ఓ వీధి అవతల ఉన్న స్నేహితురాలింటికి కబుర్లకు వెళ్ళింది.

పనిమనిషి శారద చెప్పిన మాటలువింది. ఆమెకో ఏడాది కొడుకున్నాడు. వాడు సాధారంగా అల్లరిచేస్తూ ఆ సమయంలో పడుకోడు. పనిమనిషికి రోజూ ఆ సమయంలో నిద్ర ముంచుకు వస్తూంటుంది. ఆ కుర్రాడీవేళ ఎందుకో నిద్రకుపడ్డాడు. పనిమనిషి తనూ సుఖంగా పడుకోవాలనుకుంది.

కానీ యజమానురాలు తన నిల్లు చూడమని చెప్పి వెళ్ళింది. పడుకుంటే ఎలా? ఏ దొంగతనమైనా జరిగితే ఇంట్లోంచి పొమ్మంటారు తనని. ప్రత్యేకంగా పనివాళ్ళ కని కట్టిన ఆ చిన్న వాటా ఆమెకెంతో సదుపాయంగా ఉంటోంది. అద్దె లేకుండా ఊరికే అందులో ఉంటోంది పనిమనిషి కుటుంబం.

పనిమనిషింకా సందిగ్ధంలో ఉండగానే దొడ్లో అటు వయిపుగా ఓ మనిషి కనిపించాడు. అతడు సన్నగా సుమారయిన ఎత్తులో ఉన్నాడు. మనిషి చూడ్డానికి ఉద్యోగస్థుడిలా ఉన్నాడు. అతడి నంతవరకూ పనిమనిషి చూసి ఉండలేదు.

"ఇంటికి తాళంపెట్టి ఉందేమిటి?" అన్నాడతడు.

"అయ్యగారాఫీసుకు వెళ్ళారు. అమ్మగారు పేత్తనాలకు వెళ్ళారు. పిల్లలు స్కూలుకు వెళ్ళారు" అంది పనిమనిషి.

అతడు పనిమనిషి ద్వారా అయ్యగారు అయిదున్నరకీ, అమ్మగారు నాలుగున్నరకీ, పిల్లలు నాలుగింటికీ వస్తారని

తెలుసుకున్నాడు.

పనిమనిషి ముంచుకు వస్తున్న నిద్ర నాపుకుంటూ - "ఎవరు మీరు?" అనడిగింది.

అతడు రెండు చాక్లెట్లు జేబులోంచి తీసి - "నీ బాబు బొద్దుగా ముద్దుగా వున్నాడు - ఈ చాక్లెట్లు చాలా బాగుం టాయి. మనూళ్ళో దొరకవు. ఒకటి నువ్వు తిను. ఇంకోటి బాబుకి...." అన్నాడు.

పనిమనిషి చాక్లెట్లందుకుంది. అతడింకా అక్కడే నిల బడ్డాడు. ఆమె ఇబ్బందిగా చూస్తూంటే - "మా వాళ్ళకు చెప్పు - నేను వచ్చి వెళ్ళానని! వీలుంటే రేపు మళ్ళీ వస్తానన్నానని చెప్పు...." అన్నాడు.

పని మనిషి తలూపింది.

"మరో విషయం. నే నిచ్చిన చాక్లెట్లు అద్భుతమైనవి. నువ్వు తిన్నా తినకపోయినా - బాబుకు మాత్రం పెట్టు. పిల్లలంటే నాకు ప్రాణం. మావాళ్ళ పిల్లలకీ చాక్లెట్లంటే ప్రాణం" అని అక్కడ్నించి కదిలా డతడు.

అతడలా వెళ్ళగానే గేటు చప్పుడయ్యేవరకూ ఆగిం దామె. ఇంటికి ముందువైపున్న ఆ గేటు చప్పుడు కాస్త శ్రద్ధగా వింటే - ఇంటి వెనక పనిమనిషి వాటాలోకి కూడా వినబడుతుంది. గేటు చప్పుడు కాగానే కుతూహ లంగా పనిమనిషి చాక్లెట్లను ఒకటి విప్పి నోటిలో వేసు కుంది. మరుక్షణం ఆమెకు నిద్ర ముంచుకు వచ్చింది.

ఈలోగా ఆగంతకుడు గేటు దగ్గిరకు వెళ్ళి గేటు చప్పుడు చేశాడు. అప్పుడే గేటు దగ్గిరకో యువకుడు వచ్చాడు.

"వీధుల్లో జనం తిరగటం లేదు. ఇంట్లో సంగ తేమిటి?" అన్నాడా యువకుడు.

"అంతా అనుకూలంగానే ఉంది పద" అన్నా డాగంతకుడు.

ఇద్దరూ గేటు దగ్గిర్నుండి ఇంటి గుమ్మం చేరుకు న్నారు. ఇంటికి చాలా పెద్దసైజులో నవతాళ్ వేసి ఉంది.

"యాసిడ్ పోద్దామా?" అన్నాడు యువకుడు.

"యాసిడ్ పోసి నిక్షేపంలాంటి తాళంకప్ప పాడు చేస్తామా?" అంటూ అతడు తన మెడకు వ్రేలాడుతున్న సంచీలోంచి చిన్న ప్యాకెట్ తీశాడు. అప్పటి కప్పుడు అందులోని పరికరాలుపయోగించి - చిన్న సయిజు క్రోబార్ అసెంబుల్ చేశాడు. దాంతో తలుపు గడియను సులభంగా పెకళించాడు.

"ఇది గవర్నమెంటు క్వార్టరు. ఇంటి గడియల్నేమిటి కావాలంటే ఇంటి కింటినే పెకలించి వేయవచ్చు" అన్నా డాగంతకుడు - తన పని సక్రమంగా ముగిశాక.

ఇద్దరూ ఇంట్లో ప్రవేశించారు. ముందుగా డ్రాయింగ్ రూం వచ్చింది. అక్కడ ఓ పెద్ద సోఫాసెట్టుంది. కలర్ టీవీ, స్టీరియో ఉన్నాయి.

"టీవీ ఎలా వస్తోందో?" అన్నాడు యువకుడు.

"సమయానికి ప్రోగ్రాము లేవీ లేవు. కనీసం క్రికెట్ మ్యాచ్ ఉన్నా సరిపోయేది" అన్నా డాగంతకుడు.

"కానీ - టీవీ నెలా మోసుకుపోతాం? బాగా పెద్దదిగా ఉంది" అన్నాడు యువకుడు.

"మోసుకు పోయేందు క్కాదు. ఎవరింటికి వెళ్ళినా ఓసారి టీవీ చూస్తూంటాను నేను. షాపుల్లో ఎలా పని చేస్తున్నాయన్నది కాదు - ఇళ్ళల్లో ఎలా పని చేస్తున్నా యన్నదే మనకు ముఖ్యం. నేడో రేపో మనమూ ఓ

మంచి కలర్ టీవీ కనుక్కోవాలనుకుంటున్నాంగా - ఇది షాపింగన్న మాట....” అన్నాడాగంతకుడు.

ఇద్దరూ డ్రాయింగ్‌రూం పరిశీలించారు. నేలమీద ఖరీదయిన కార్పెట్ పరిచి వుంది. అక్కడ చిన్న షో కేసు గోడకు తగిలించి ఉంది. అందులో నాలుగు బొమ్మలు, ఓ క్వార్ట్జ్ అలారం ఉన్నాయి. పక్కగా టైపురైటరుంది.

“అలారం బాగుంది - తీసుకుందామా?” అన్నాడు యువకుడు.

“అలారం వద్దు” అన్నా డాగంతకుడు.

“ఏం?”

“అది మన ప్రిస్టేజికి భంగం. బొత్తిగా అలారాని కూడా కక్కుర్తి పడ్డామని మన గురించి చెప్పుకుంటారు. సాటివారిలో మనకెంత అవమానం?”

“అయితే మనమేం తీసుకుంటాం?”

“వెండి, బంగారం - అంతే!”

“అవెక్కడ దొరుకుతాయి?”

“ఇంట్లో ఎక్కడో ఉంటాయి. డ్రాయింగ్ రూం చూస్తే తెలియడం లేదూ? వీళ్ళు బాగా ఉన్నవాళ్ళే!” అన్నా డాగంతకుడు.

ఇద్దరూ డ్రాయింగ్ రూంలోనుండి బయటకు వచ్చారు. లోపల మరో మూడు గదులకు తలుపులు తాళాలు వేసి ఉన్నాయి. తలుపుకు పక్కనే ఉన్న కిటికీల్లోంచి గది లోపలి వస్తువులు కనబడుతున్నాయి.

“అది వంటిల్లు....స్టీలు గిన్నెలు తప్ప ఇంకేమీ ఉండవక్కడ....” అన్నాడాగంతకుడు.

"ఒకవేళ వెండి కంచం, గ్లాసులు ఉంటే?"

"వెర్రివాడా? ఈ రోజుల్లో వెండి కంచాల నెవరూ భోంచేయడాని కుపయోగించరు...." అన్నాడాగంతకుడు.

"మరి?"

"అవి బీరువాల్లోనే ఉంటాయి."

"అలాంటప్పుడు చేయించుకోవడ మెందుకు?"

"వెండి కంచాలు, చెంబులు, గ్లాసులు - ఎవరూ కావాలని చేయించుకోరు. అవి పెళ్ళిళ్ళలో బహుమతిగా వస్తాయి...." అన్నాడాగంతకుడు.

"నువ్వు చాలా తెలివయినవాడివి...."

"నన్ను మెచ్చుకోవడం కాదు - చూసి నేర్చుకో...."

బయట్నించి కిటికీల ద్వారా చూస్తూంటే మిగతా రెండు గదుల్లోనూ స్టీలు బీరువాలు కనిపించాయి.

తను తయారు చేసిన క్రోబారుతో-ఓ గది గడియను పెకలించా డాగంతకుడు.

"ఈ గడియకూడా సంచీలో వేసి దాచేదా?" అన్నాడు యువకుడు.

"ఇది మంచంమీద పడేద్దాం. తాళం అర్థినరీది...." అన్నా డాగంతకుడు.

గదిలో బీరువాతాళం వేసిలేదు. ఆగంతకుడు బీరువా తెరిచాడు. సరిగ్గా అప్పుడే కాలింగ్ బెల్ మ్రోగింది.

యువకుడు కంగారుపడ్డాడు. అతడిలో కొద్దిగా వణుకు ప్రారంభమయింది.

"భయపడకు. గడియ పెకలించినట్లు తెలియకూడదని తలుపులు బార్లా తీసి ఉంచాం. ఇంటివాళ్ళయితే కంగారుగా లోపలకు వస్తారు. వచ్చిందింటివాళ్ళు కారు...." అన్నా డాగంతకుడు.

"కానీ మనం దొంగలం కదా ...."

"దొంగతనం చేస్తున్నంతసేపూ మనం దొంగలమని గుర్తుంచుకోకూడదు. మనింటికి మనం వచ్చి మన వస్తువులు తీసుకుని పోతున్నట్లుగా భావించాలి. అప్పుడే తాపీగా పని చేయగల్గుతాం. మన భయమే మనని పట్టిస్తుంది ...." అంటూ ఆగంతకుడు వీధి గుమ్మం దగ్గరకు వెళ్ళాడు.

అక్కడో పదేళ్ళ కుర్రాడున్నాడు. వాడి చేతిలో రెండు నవలలున్నాయి. ఆగంతకుణ్ణి చూస్తూనే ఆ కుర్రాడాశ్చర్యంగా—"మీరెవరు?" అన్నాడు.

"అక్కయ్య ఇంటిలో లేదు. ఇంకో గంటలో వస్తుంది." అన్నాడాగంతకుడు గంభీరంగా.

"అమ్మ ఆంటీకీ నవలలిమ్మంది. కొత్తగా వచ్చాయిట" అన్నాడా కుర్రాడు.

"సరే—నాకివ్వు. నేను అక్కయ్యకిస్తాను ...." అంటూ చేయి సాచాడాగంతకుడు.

"అంకుల్—ఒక్కసారి స్వాతిముత్యంలో చిన్నారి పొన్నారి కిష్టయ్యా పాట వేయరూ?" అన్నాడా కుర్రాడు.

"అవన్నీ ఎక్కడున్నాయో నాకు తెలియదు ...."

"నాకు తెలుసంకుల్. నాకీరోజు స్కూలులేదు. అమ్మ మీ యింటికి వెళ్ళమంటే ఆ పాట ఓసారి వినొచ్చుకదా అని వచ్చాను ...."

"సరే—నీ యిష్టం—పద ...." అంటూ ఆగంతకుడా కుర్రాణ్ణి డ్రాయింగ్‌రూంలోకి తీసుకునివెళ్ళాడు.

కుర్రాడు రికార్డుపెట్టాడు. వాడు పాట వింటూంటే ఆగంతకుడు పక్కగదికి వెళ్ళి యువకుడితో— "నువ్వు గదంతా బాగా గాలించు. నేనా కుర్రాణ్ణి పంపించివస్తాను."

అన్నాడు.

"భయంలేదా?"

"మనింటిలో మనమున్నాం. భయమెందుకు?"

యువకుడు సరేనన్నాడు. ఆగంతకుడు డ్రాయింగ్ రూం చేరుకున్నాడు.

చిన్నారిపొన్నారి కిష్టయ్య పాట అయిపోయింది.

"ఇక చాలా?" అన్నాడాగంతకుడు.

"ఒక్కసారి టోనీయం వింటానంకుల్ .... స్టీరియో ఎఫెక్ట్స్ చాలా బాగుంటాయి ...."

ఆగంతకుడు విసుగ్గా—"ఊఁ" అన్నాడు.

రికార్డు నడుస్తూండగా ఆగంతకుడు పక్కగదిలోకి వెళ్ళి—"ఏమైనా దొరికాయా?" అన్నాడు.

"పిల్లల ఆటవస్తువులున్నాయి. బాగున్నాయి. కొన్ని విదేశీవి అనుకుంటాను ...." అన్నాడు యువకుడు.

"పెళ్ళి చేసుకుని పిల్లల్ని కన్నాక - మళ్ళీ రావాలీ యింటికి—అదిసరే—ఇంకేంలేవా?"

"లేవు—అన్నీబట్టలు .... అవీ పిల్లలవి ...."

"అయితే యిది పిల్లలగది అయుంటుంది. ఆ మిగిలిన గది గాడియను క్రోబార్‌తో పెకలించు. చప్పుడు కాకూడదు. నీ కిది శిక్షణ అన్నమాట .... జాగ్రత్తగా పనికానీ ...." అన్నా డాగంతకుడు.

"నువ్వే ఆ పని చేయకూడదూ?"

"నేను చేస్తే నువ్వెప్పుడు నేర్చుకుంటావు? ప్రయత్నించు—ఈలోగా నే నా కుర్రాడిని వదుల్చుకునివస్తాను" అన్నాడాగంతకుడు.

యువకుడు తలాడించాడు. ఆగంతకుడు డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాడు. కుర్రాడు బ్రహ్మాండంగా తలూపుతూ

ఆనందిస్తున్నాడు. ఆగంతకుడు వాడి భుజంతట్టి—"ఇక చాల్లే—నేను పడుకోవాలి...." అన్నాడు.

"అంకుల్—మీకు పాటలు నచ్చవా?"

"ఏమో—అక్కయ్య తను నాలుగింటిదాకా రానని - హాయిగా పడుకోమంది. నా మనసంతా నిద్రమీదేఉంది."

"ఈరోజు నాకు పెలవంకుల్....ఇక్కడే కాసే పుంటాను...."

ఆగంతకు డతడితో—"అయితే ఓపని చేద్దాం. దగ్గర్లో కిళ్ళీ కొట్టేదైనా ఉందా?" అన్నాడు.

"ఎందుకు?"

"సిగరెట్లుంటే నాకు నిద్రకూడా అక్కర్లేదు. నా ఆరోగ్యం పాడవుతుందని అక్క సిగరెట్లు తాగద్దంటుంది. నువ్వు నాకో ప్యాకెట్ సిగరెట్లు తెచ్చిపెట్టావంటే నీతోనే కూర్చుని పాటలు వింటాను...."

"అంకుల్ - సిగరెట్లు తాగడం తప్పు. నాకు పాటలు వద్దులెండి. మీ ఆరోగ్యంకంటె పాటలు వినడం ముఖ్యం కాదు...." అన్నాడాకుర్రాడు.

"ప్లీజ్ - సిగరెట్లు తెచ్చిపెట్టు...."

"లేదంకుల్....నేను వెళ్ళిపోతున్నాను...." అంటూ తుర్రుమన్నాడాకుర్రాడు.

ఆగంతకుడు కంగారుగా యువకుడివద్దకు వెళ్ళాడు. యువకుడప్పుడే గడియ పెకలించాడు.

"ఇంతసేపా?" అన్నా డాగంతకుడు.

"చప్పుడు కాకుండా తీయాలన్నావు. చాలా కష్టంగా ఉంది. మొత్తంమీద సులువు తెలిసింది. ఇంకోసారైతే సులభంగా తీయగలను...."

"సరే—మనకాట్టే టైము లేదు. ఆ కుర్రాడొచ్చి మన టైము పాడుచేశాడు. మనం మరోసారి పద్ధతి మార్చాలి. తలుపు గడియ పెకలించేక—ఒకరు లోపలకు వెడితే—ఇంకొకరు మళ్ళీ తలుపుకు గడియ అతికించి ఉంచాలి. అదెలాగో తర్వాత చర్చిద్దాం కానీ ముందు గదిలోకి పద" అన్నా డాగంతకుడు.

గదిలో రెండు మంచాలున్నాయి—దగ్గిరగా జేర్చి మంచాలు, పరుపులు, దుప్పట్లు—అన్నీ ఖరీదైనవి.

డ్రెస్సింగ్ టేబిల్. దానిమీద పౌడర్ డబ్బా, క్రీమ్సు ఉన్నాయి. పక్కగా ఒక లేడీస్ వాచి ఉంది.

వాచీ తీసుకున్నా డాగంతకుడు.

"ఇది అలారం టైంపీసుకంటె ఖరీదైనదా?" అన్నాడు యువకుడు.

"ఖరీదు కాదిక్కడ. అభిరుచి. ఇంత మంచి వాచీని తీసుకోకపోతే నా భార్యకే అవమానం...." అన్నాడాగంత కుడు.

"ఇందులో మధ్య నీ భార్య కవమానమెందుకు?"

"వాచీ చాలా బాగుంది. చూసికూడా నా భార్యకు నేనిది ప్రజంట్ చేయకపోతే ఎలా?" అన్నాడాగంతకుడు.

"ఈ గదిలో వాచీ తప్ప ఇంకేం లేవు!"

"డ్రెస్సింగు టేబిల్ అరల్లో నువ్వు వెతుకు. నేనేమో పరుపుల కింద చూస్తాను" అన్నాడాగంతకుడు.

ఇద్దరు గదంతా చిందరవందర చేసేశారు.

గదిలో రెండు బీరువాలున్నాయి. రెండూ గాడ్రెజ్ బీరువాలు. ఎంత ప్రయత్నించినా వాటి తాళాలు తొలగి రాలేదు. వాటి తాళంచెవులు వాళ్ళకు కనబడలేదు.

ఈలోగా మళ్ళీ కాలింగ్ బెల్ మ్రోగింది. ఆగంతకుడు

పరుగున వెళ్ళాడు.

"వంటింట్లో ఏదో రిపేరుందిటకదా—నేను ఎలక్ట్రిషియన్ని" అన్నాడు వచ్చిన వ్యక్తి.

"అక్కయ్య బైటకు వెళ్ళింది. మీరు మరోసారి రావడం మంచిది" అన్నాడాగంతకుడు మర్యాదగా.

ఎలక్ట్రిషియన్ వెళ్ళిపోతూ — "అయ్యగారు రేపు రమ్మనమని చెప్పారు. ఇంట్లోంచి పాటలు వినబడుతూంటేనూ—అడుగుదామని వచ్చాను" అన్నాడు.

అప్పటికి రికార్డు ఆగిపోయింది. ఎందుకైనా మంచిదని ఆగంతకుడు రికార్డు వెనక్కి తిప్పాడు.

చక్కటి సంగీతం వీనులవిందు చేస్తూంది.

ఆగంతకుడు యువకుణ్ణి పిలిచాడు.

"మనకిక వేరే—ఏమీ దక్కవు—ఇంట్లో వెండి బంగారాలు లేవు. వచ్చినందుకు బొత్తిగా ఓ వాచీతో పోలేం. స్టీరియో ముద్దుగా బాగుంది. దీన్ని మూటకట్టేస్తాను" అన్నాడు.

"నీ ఇష్టం!" అన్నాడు యువకుడు — తన భుజానికి వ్రేలాడుతున్న సంచీలోంచి ఓ గుడ్డతీశాడు. ఆగంతకుడు గుడ్డను వీధి గుమ్మం దగ్గిర పరిచాడు. స్టీరియో ప్లేయరు, స్పీకర్లు రెండు తెచ్చి అందులో పెట్టి మూటకట్టాడు. అతడు మూట కడుతూండగా అక్కడికో మనిషి వచ్చింది. ఆమె చూడ్డానికి పనిమనిషిలా ఉంది. ఆగంతకుణ్ణి చూస్తూనే ఆమె కొయ్యబారిపోయింది.

"దొంగ దొంగ...." అని అరవాలనుకుందామె. గొంతు పెగలలేదు.

ఆగంతకుడు చటుక్కున జేబులోంచి బటన్‌నైఫ్ తీసి బటన్ నొక్కాడు. చాకు వెంటనే తళతళ మెరిసింది.

"వెళ్ళిపో—నువ్విక్కడేమీ చూడలేదు. బైటకెళ్ళి గొడవచేశావా—నిన్ను వెతుక్కుంటూ వచ్చి మరీ చంపుతాను—ఫో!" అన్నాడతడు.

ఆ మనిషి చటుక్కున వెనక్కు తిరిగి చకచకా బైటకు వెళ్ళిపోయింది.

ఆగంతకుడు నెమ్మదిగా యువకుణ్ణి పిలిచి—"నన్ను చాలామంది చూశారు. నేను ముందు వెళ్ళిపోతున్నాను. నా వెనుకే నువ్వురా—మరోసారి ఏమైనా దొరుకుతాయేమో చూసి!" అన్నాడు.

యువకుడు తలూపి—"మరేమీ భయంలేదుగా!" అన్నాడు.

"నీకు ధైర్యం చెప్పాలనే కదా—నేను నిన్నిక్కడకు తీసుకొచ్చాను!" అన్నా డాగంతకుడు నవ్వి.

అతడు స్టీరియో మూటతో బైటకు వచ్చాడు. దాపుల్లో ఉన్న రిక్షాను పిలిచి—"సామాను లోపలపెట్టు—" అన్నాడు.

క్షణాలమీద రిక్షా అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

ఈలోగా యువకుడు మరోసారి లోపలంతా గాలించి బైటకు వచ్చాడు. అతడికింటిగేటు దగ్గర—బడినుంచి వస్తున్న శారద రెండో కూతురెదురయింది. యువకుణ్ణి చూసి ఆమె—"ఎవరి కోసం?" అంది.

"కుళాయి రిపేరుకు వచ్చాను—అయిపోయింది...." అన్నాడతడు మామూలుగా.

అతడి భుజానికి వ్రేలాడుతున్న సంచీని చూస్తూ—"అందులో పరికరాలేమైనా ఉన్నాయేమో" అనుకుంటూ ఆమె లోపలకు వెళ్ళింది.

ఆ యువకుడు త్వరగా నాలుగడుగులు వేశాడు. అతడి

కోసమన్నట్లుగా అతడిపక్కనే మోటారుసైకి లొకటి ఆగింది. యువకుడు మోటారుసైకిలు వెనుక కూర్చు న్నాడు.

క్షణాలమీద వాహనం తుర్రుమంది.

ఈలోగా శారద రెండోకూతురు—ఇంట్లో అడుగు పెట్టి అన్నీ చూసింది. జరిగిందేమిటో తెలుసుకునేందు కామెకు కాస్సేపట్టింది అప్పుడామె పెద్దగా కేకపెట్టింది. ఆర్తనాదం లాంటి ఆ కేక చాలాదూరం వినపడింది.

దొంగతనాల గురించి వినడమే తప్ప చూసి ఉండని ఆ చిన్నపిల్ల బాగా భయపడిపోయింది. అప్పుడందరూ పోగయ్యారు. కబురు శారదకే కాక—వామనరావు ఆఫీసు క్కూడా చేరింది.

పోలీసు కంప్లయింటిచ్చారు. పోలీసులు వచ్చి అన్నీ గమనించి రిపోర్టు రాసుకుని—అడగవలసిన వారందర్నీ ప్రశ్నలడిగి వెళ్ళిపోయారు.

డేర్ డెవిల్ రాబరీ—అని చాలామంది చెప్పుకున్నారు.

"పట్టపగలే నట్టనడివీథిలో ఇలాంటి దొంగతన మెలా జరిగిందా?" అని చాలామంది ఆశ్చర్యపడ్డారు.

2

కాలనీలో దొంగతనం గురించి రకరకాల చర్చలు జరిగాయి. తక్కువ నష్టంతో బయటపడ్డందుకు వామన రావదృష్టవంతుడని కొందరన్నారు. శారద పెత్తనాలకు వెళ్ళకుండా ఉండి ఉంటే దొంగతనం జరిగుండేది కాదని మరికొందరన్నారు.

ఉద్యోగాలు చేసుకొనే వాళ్ళకు వందరూపాయలు పోయినా అది పెద్ద నష్టమే! అందువల్ల వామనరావు తన అదృష్టాన్ని గుర్తించలేదు. అతడు దిగులుగా ఉన్నాడు.

శారదమాత్రం ఇల్లు కదలడం మానేసింది.

అయితే వాళ్ళింట్లో దొంగతనం జరిగిన నాలుగు రోజులకే కృష్ణవేణింట్లో దొంగతనం జరిగింది. దొంగలు మళ్ళీ వాళ్ళే! కానీ ఈసారి—ఇంట్లో కృష్ణవేణి ఉంది. దొంగ కృష్ణవేణిని బెదిరించి ఆమె చేతికున్న బంగారు గాజులే కాక—ఇంట్లో ఉన్న విలువైన వస్తువుల ఆచూకీ ఆమెనే అడిగితెలుసుకొని—అంతా దోచుకొని పోయాడు. కృష్ణవేణి ఇంట్లో ఉండటంవల్ల నష్టం ఎక్కువైందని అంతా చెప్పుకున్నారు.

మళ్ళీ పోలీసుల్ని పిలిచారు. వాళ్ళు వచ్చి పూర్వంలా హడావుడి చేసి వెళ్ళారు.

కాలనీలో సంచలనం ప్రారంభమయింది.

"ఊళ్ళో కొత్తగా దొంగల ముఠా ఒకటి దిగింది. వాళ్ళు బీహార్నుంచి వచ్చారు. అన్ని భాషలూ మాట్లాడతారు. జాగ్రత్తగా ఉండండి. మేం చేయగలిగింది మేం చేస్తాం. మీరు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది" అని పోలీసులు కాలనీ వారిని హెచ్చరించారు.

కృష్ణవేణింట్లో దొంగతనం జరిగిన పదిరోజులకి—దొంగలు మళ్ళీ రాధ ఇంట్లో ప్రవేశించారు. ముందు వాళ్ళు దొంగలని రాధకు తెలియదు.

ఏదో యింటికోసం వాకబు చేస్తున్నట్టుగా వాళ్ళు తిరుగుతూ తిరుగుతూ వచ్చి రాధ ఇంటిముందు ఆగారు. ఒకడు రాధ యింట్లో ప్రవేశించి మంచినీళ్ళడిగాడు. ఆమె మంచినీళ్ళు తేవడానికి లోపలకు వెడితే—ఆ సమయంలో మిగతా యిద్దరూ కూడా యింట్లో ప్రవేశించారు.

రాధ మంచినీళ్ళు తెచ్చేసరికక్కడ ముగ్గురి చేతుల్లోనూ

కత్తులున్నాయి. వాళ్ళామెతో—"అరిస్తే చస్తావు...." అన్నాడు.

"ఎవరు మీరు?" అంది రాధ.

"దొంగలం" అన్నారు వాళ్ళు.

"మీరేనా మా కాలనీలో రెండు దొంగతనాలుచేశారు!" అంది రాధ భయపడకుండా.

"అవును" అన్నాడు వారిలో ఆగంతకుడు గర్వంగా.

"ఒకే ప్రదేశానికి మళ్ళీ మళ్ళీ వస్తున్నారు. మీకు భయం లేదూ?" అంది రాధ ఆశ్చర్యంగా.

"భయ మెందుకు? దొంగతనానికి మీ కాలనీకి మించి నది లేదు. ఇళ్ళన్నీ విసిరేసినట్లు దూరం దూరంగా ఉన్నాయి. సెక్యూరిటీ బాగా తక్కువ. కాలనీ చుట్టూ మూడు గేట్లున్నా - గేట్ల దగ్గర కాపలావాళ్ళుండరు. ఎవ రయినా లోపలకు వచ్చి పోతూండవచ్చు. ఇలాంటి ప్రైవేట్ కాలనీలు అరుదుగా ఉంటాయి. అందుకే మేమీ కాలనీని ఎన్నుకున్నాం...."

"కానీ ఒక రోజున పోలీసులు మిమ్మల్ని పట్టు కుంటారు...."

"మాటలు తర్వాత....ముందు నీ వంటిమీదున్న బంగారం వలిచివ్వు...." అన్నా డాగంతకుడు.

"ఇవ్వకపోతే?" అంది రాధ.

"బలవంతంగా తీసుకుంటాం...."

"తర్వాత...."

"ఇల్లంతా దోచుకుంటాం...."

"అలాగా...." అంది రాధ.

అంతే!

ఆమె మెరుపు వేగంతో కదిలింది. ఆమె చేతులు కంటికి కనబడని వేగంతో వాళ్ళ చేతుల్ని తాకాయి. ముగ్గురి చేతుల్లోని కత్తులూ ఎగిరి కిందపడ్డాయి. వాళ్ళవి అందుకునేలోగా రాధ మళ్ళీ వాళ్ళను దెబ్బ తీసింది.

ముగ్గురూ నేల కూలారు.

"ఇక మీ ఆట కట్టు...." అంది రాధ.

ముగ్గురూ ఆమె వంక అసహాయంగా చూశారు.

"కాలేజీ రోజుల్లో నేర్చుకున్న కరాటే ఇలా పని కొచ్చింది...." అంది రాధ గర్వంగా.

"మమ్మల్ని వదిలిపెట్టు. నీపేరు చెప్పుకుంటాం!" అన్నారు వాళ్ళు.

"మిమ్మల్ని పోలీసులకి వదిలిపెడతాను. ఇంతవరకూ మీరు తీసుకుని వెళ్ళినవన్నీ వాళ్ళు మీచేత కక్కిస్తారు...." అంది రాధ.

తర్వాత ఆమె చుట్టుపక్కలవాళ్ళను పిలిచింది.

దొంగలు పట్టుబడ్డారు. పోలీసులు పిలవబడ్డారు.

అప్పుడు కాలనీలో శారదకు, కృష్ణవేణికి - యింకా యితరులకు పిలుపులు వెళ్ళాయి.

శారద పనిమనిషి రెండో కూతురు, ఓ కుర్రాడు, ఎలక్ట్రిషియను, మరో పనిమనిషి, కృష్ణవేణి వగైరా అందరూ దొంగల్ని గుర్తుపట్టారు.

"ఇక్కడే నాలుగు తన్ని దొంగలచేత నిజం కక్కించండి...." అన్నారందరూ.

పోలీసు కానిస్టేబులొకడు లాఠీ ఎత్తాడు.

"మమ్మల్ని కొట్టకు...." అన్నాడాగంతకుడు.

"అయితే తీసుకున్న వస్తువులన్నీ ఎక్కడున్నాయో

చెప్పు" అన్నాడు పోలీసు కానిస్టేబుల్.

ఆగంతకు డతని పక్కనే వున్న ఇన్‌స్పెక్టర్ వంక చూసి - "ఇన్‌స్పెక్టర్‌గారూ! మీరు మీవాడికి చెప్పండి మమ్మల్ని కొట్టవద్దని...." అన్నాడు.

"ఏమిటీ - మమ్మల్నే శాసిస్తున్నావు...." అన్నాడు ఇన్‌స్పెక్టర్. అతడు కానిస్టేబుల్ వంక చూస్తూ-"నాలుగు తగిలించు. చూస్తూ వూరుకుంటావేం?" అన్నాడు.

"ఆగండి" అన్నాడాగంతకుడు. అతడు తమ చుట్టూ మూగిన కాలనీ జనాన్ని చూసి—

"అయ్యలారా - మాదీ ఊరు కాదు: దూర ప్రాంతాల నుండి వచ్చాం. రాగానే రివాజు ప్రకారం పోలీసుల్ని కలుసుకున్నాం. మేము మొత్తం తొమ్మండుగురం. మూడు జట్లుగా విడిపోయాం. ఊళ్ళో సెక్యూరిటీ తక్కువగా వున్న మూడు ప్రాంతాలనీ పోలీసులే మాకు చెప్పారు. మూడు జట్లకూ మూడు ప్రాంతా లమ్మేశారు. మేమీ ప్రాంతాన్ని పది వేల రూపాయలకు కొన్నాం. పెట్టుబడికి నాలుగింత లేనా లాభం లేకపోతే ప్రాణాలకు తెగించిన మాబోటి వాళ్ళకేం కిడుతుంది? ఇంతవరకూ గిట్టినది పెట్టుబడికే చాలదు. మేమింకా ఈ కాలనీకి రెండు మూడుసార్లైనా రావలసింది.

"దొంగతనం చేయడం మా తప్పుకాదు. పట్టుబడ టమే మేము చేసిన తప్పు. అయితే ఫలానా యింట్లో కరాటే తెలిసిన ఆడమనిషి ఉంటుందని హెచ్చరించక పోవడం ఈ పోలీసుల తప్పు. వాళ్ళ తప్పుకి మేమెందుకు శిక్షంపబడాలి?...." అన్నాడు.

ఇది విని అంతా తెల్లబోయారు.

"దొంగ మనల్ని తప్పుదారి పట్టిస్తున్నాడు. పోలీసుల మీద నింద వేస్తున్నాడు. నాలుగు తగిలించరా...." అన్నాడినస్పెక్టర్ కానిస్టేబులుతో.

"నేను చెబుతున్నది నిజం. అందుకు ఋజువు లున్నాయి. మేము దొంగలం. ప్రజల్ని మోసం చేసి బ్రతుకుతున్నాం. కానీ యీ పోలీసులు ఇటు ప్రజల్నీ అటు దొంగల్నీ కూడా మోసం చేస్తున్నారు...." అంటూండగా ఆగంతకుడి వంటి మీద ఓ దెబ్బ పడింది.

ఆగంతకుడి కళ్ళెర్రబడ్డాయి. "నా డబ్బుతో రెండు కోళ్ళు తినుంటావు. దెబ్బ బలంగా వేస్తున్నావు" అన్నా డతడు.

"నువ్వు చెప్పేది నిజమే అనుకుందాం. అలాంట ప్పుడు నీ కథ దొంగలందరకూ గుణపాఠ మవుతుంది. పోలీసుల మీద దొంగతనానికాధారపడ్డం నువ్వు చేసిన తప్పు...." అన్నాడినస్పెక్టరు.

"నా కున్నది మొండిధైర్య మొక్కటే. రక రకాల యుద్ధ విద్యల్లో నన్ను ప్రవీణుణ్ణి చేయాలని ప్రయ త్నించి విఫలు డయ్యాడు నాన్న. నేను మా కుటుం బంలో ఎందుకూ పనికిరానివాణ్ని. దొంగల్లో క్లాస్ ఫోర్ అంటే నాలుగో తరగతివాణ్ణి. అందుకే పోలీసుల సాయం తీసుకున్నాను. వాళ్ళ సాయం, ధైర్యం లేకపోతే నేను దొంగతనాలెలా చేయగలను?

"ఇదుగో-పోలీసులూ! మీరు మీ గుండెల మీద చేయి వేసుకుని చెప్పండి. లేకుంటే నా శాపం మిమ్మల్నీ మీ పిల్లల్నీ కుటుంబాన్నీ కొడుతుంది. మేమిప్పుడిక్కణ్నించి పారిపోతాం-కృతజ్ఞతా బంధం మిమ్మల్ని కట్టేస్తుంది. మీరు మా జోలికి రారు...." అంటూ ఆగంతకుడ్క

ణ్నించ ఉన్నట్టుండి పరుగు పెట్టాడు. మిగతా యిద్దరూ అతణ్ననుసరించారు. అక్కడున్న జనం తేరుకునేలోగా వాళ్ళు ముగ్గురూ సమీపంలోని ఆటో ఎక్కారు.

“పట్టుకోండి ...పట్టుకోండి....” అన్నారు జనం.

“పట్టుకోండి....పట్టుకోండి....” అన్నారు పోలీసులు.

దొంగలు పట్టుబడ లేదు. అందుక్కారణం పోలీసులు కృతజ్ఞతాబంధానికి కట్టుబడిపోవడమా అన్నది కాలనీలో యిప్పుడు చర్చాంశమయింది.

కాస్త కరాటే తెలిసిన ఆడదాన్ని కూడా ఎదుర్కోలేని బలహీనులు మొండి ధైర్యంతో డేర్ డెవిల్ రాబరీకి పూనుకున్నారంటే - అందుకు పోలీసులమద్దతుండి ఉండాలనే చాలామంది నిర్ణయించారు. అందులో తప్పుండవచ్చు. కానీ అలాంటి దొంగల నరికట్టలేని పోలీసులే తరగతికి చెందుతారు? □

పదహారేళ్ల అవ్వా?



మహాప్రస్థానం ప్లైన్

రంగబాబు

"అంకుల్! అంకుల్!" తలుపు తట్టింది డాలి.

రెండు నిమిషాల తర్వాత ఆ గది తలుపులు తెరుచుకున్నాయ్. ఆ గదిలో శ్రీరామ్ ఉంటున్నాడు.

"గుడ్ మార్నింగ్" నవ్వుతూ అన్నాడు.

మూడేళ్ళ డాలితోపాటు ఆ పాప తండ్రి రమణారావు కూడా అక్కడ ఉన్నాడు. అతని చేతిలో ఓ పింగాణీ

ప్లేటువుంది. అందులో ఘుమఘుమలాడే చక్కెర పొంగలి కనిపించింది.

"కమిన్" అన్నాడు. ఆ తర్వాత ...."ప్రతి రోజూ నా కోసం ఏదో ఒక టిఫిన్ తెస్తుంటారు, మీ కెందుకీ శ్రమ."

"ఇందులో శ్రమేముంది శ్రీరామ్. ఒంటరివాడివి. ఇరుగుపొరుగు అన్నాక ఆ మాత్రం చొరవలేకుండా ఎలా ఉండగలం ....అందులోనూ నువ్వొక అభ్యుదయ రచయిత వయ్యే!"

ఆ మాటకు కొంచెం నవ్వాడు శ్రీరామ్.

"శ్రీవారం వారపత్రికలో పడిన మీ కథ చదివాను. నా కెంతగానో నచ్చింది. సామాజిక స్పృహ కలిగి వాడే సరైన రచయితని నా అభిప్రాయం. అందుకే, నేను నీ అభిమానినయ్యాను" అన్నాడు రమణారావ్.

"అంకుల్, టిఫిన్ చల్లారిపోతుంది. మా మమ్మీ చక్కెరపొంగలి బాగా చేస్తుంది తిను." ముద్దుగా అన్నది డాలి శ్రీరామ్ చేయి పుచ్చుకుంటూ.

"ఈ విధంగా రోజూ తీసుకురావడం నా కిష్టంలేదు" మళ్ళీ అన్నాడు శ్రీరామ్.

"నాకంటే చిన్నవాడివి. చిన్నవయసులోనే రచయితగా ఎంతో పేరు తెచ్చుకున్నావ్. మా ఇంటిల్లిపాదికీ అభిమాన రచయితవి అయ్యావ్...." అన్నాడు రమణారావ్.

"అది మీ అభిమానం"

"మొహమాటపడకు. బ్రహ్మచారి యిబ్బందులేవిటో నాకు తెలుసు" అన్నాడు రమణారావ్. ఆ తర్వాత ఇద్దరూ ఎక్కువగా మాట్లాడుకోలేదు. డాలి అక్కడే ఆడుకొంటానంటే వదిలి వెళ్ళిపోయాడు.

ఒకరోజు —

రమణారావ్ ఆఫీసునుంచి తిరిగివచ్చే సమయం అది.

భర్త స్కూటర్ చప్పుడు విని శ్రీరామ్ గదిలోంచి బయటకు వచ్చింది లలిత.

రమణారావ్ చూశాడు. అతని హృదయం కలుక్కుమంది.

భర్తకి కాఫీయిచ్చి రోజు మాదిరిగానే ప్రక్కన కూచుంది లలిత.

"ఏవిటీ అట్లా ఉన్నారు?" అడిగింది.

"ఏం, నీ మొగుళ్ళా లేనా?" అన్నాడు. అతనిగొంతు కఠినంగా పలికింది. అయితే, లలిత అంతగా పట్టించుకో లేదు.

"ఛ! సభ్యతగా మాట్లాడండీ?"

"నేర్చుకొంటాలే శ్రీరామ్ దగ్గిర" అని లేచి వెళ్ళి పోయాడు గదిలోకి. భర్త వెనుకే వెళ్ళింది లలిత.

"మధ్యలో అతని ఊసెందుకు?....ఈ మధ్య ఎందుకట్లా ఉంటున్నారు? కనీసం రాత్రి సమయంలో కూడా.... ఇబ్బందిగా కనిపిస్తున్నారు." అడగాలనుకొంటున్న విషయాన్ని అడిగేసింది లలిత.

"ప్లీజ్! నన్ను విసిగించకు." డ్రస్ మార్చుకుని మంచంమీద వాలిపోయాడు రమణారావ్. భోజనానికి పిలిచినా లేవలేదు అతను. ఆ రాత్రి భార్య ఎంతగా కవ్వించినా, ఉలకలేదు, పలకలేదు.

ఆ తర్వాత ఇంకోరోజు—

రమణారావ్ ఆలస్యంగా నిద్రలేస్తాడు. అతను నిద్ర లేచి కిటికీలోంచి పెరటిలోకి చూశాడు. లలిత, శ్రీరామ్ మాట్లాడుకొంటూ కనిపించారు. నవ్వుకొంటున్నారు

ఇద్దరు. లలిత అతని మాటల్ని తన్మయత్వంగా వింటోంది.

రమణారావ్‌కి వంటిమీద కారం పూసినట్లయింది. తన భార్యతో బయట మగాళ్లెవరు మాట్లాడినా సహించలేడు అతను. అందుకే అతని ఇంటికి స్నేహితు లెవరూ రారు. అయితే, శ్రీరామ్ దూరపుబంధువు; రచయిత అనే గౌరవం ఉండటంవల్ల అతని గురించి అంతగా పట్టించుకో లేదు. అయినా అప్పుడప్పుడూ ఓ కంట గమనిస్తూనే ఉన్నాడు.

ఆ రోజు భార్యచేత్తో కాఫీ కూడా తాగకుండా ఆఫీసుకు వెళ్ళిపోయాడు. ఆఫీసులో పని చెయ్య బుద్ధి కాలేదు. మనసులో ఎన్నోరకాల ఆలోచనలు....గజిబిజిగా కదులు తున్నాయి.

లలిత, శ్రీరామ్!

శ్రీరామ్, లలిత!

లలిత - శ్రీరామ్!!

రమణారావ్‌కి హఠాత్తుగా తలనొప్పి మొదలై, ఎక్కువ యింది. ఆఫీసులో ఉండలేక ఇంటికని బయల్దేరి మధ్యలో బార్‌లోకి ప్రవేశించాడు. చాలా సేపటివరకూ తాగుతూ గడిపేశాడు. భార్య అంటే ఎంతో ప్రేమ. అపు రూపంగా చూసుకొంటూ వచ్చాడు యింతకాలం.... మరిప్పుడు?

ఒకేఒక్క కూతురు డాలి. పెళ్ళయిన అయిదు సంవ త్సరాలకిగానీ సంతానం కలగలేదు. అందుకే డాలి అంటే అంతప్రేమ. క్రింద నడిస్తే పాదాలు కందిపోతాయేమో అన్నంత ప్రేమగా కూతుర్ని చూసుకొంటున్నాడు.

ముచ్చటైన సంసారం. మంచి ఉద్యోగం. ఇంతవరకూ

ఎటువంటి యిబ్బందీ లేకుండా బ్రతికేడు. అర్ధరాత్రి కావస్తుండగా యింటికి వెళ్ళాడు. లైట్లు వెలుగుతున్నాయి ఇంటిలో. స్కూటర్ స్టాండ్ వెయ్యబోయి పడిపోయాడు. లలిత పరుగెత్తుకొంటూ వచ్చింది.

ఆ చప్పుడుకి శ్రీరామ్‌కూడా తన గదిలోంచి వచ్చాడు. రమణారావ్ బాగా తాగివున్నాడని యిద్దరూ తెలుసుకున్నారు.

భార్యనీ, శ్రీరామ్‌ని కలిపి చూశాడు రమణారావ్. అతని మనసు ఉడికిపోయింది. శ్రీరామ్ సాయంతో భర్తని ఇంటిలోకి తీసుకువెళ్ళింది లలిత.

శ్రీరామ్ తన గదిలోంచి వింటున్నాడు.... భార్యా, భర్తలు ఎందుకో గొడవపడుతున్నారు. లలితని కొట్టినట్టు కూడా అర్థమైంది శ్రీరామ్‌కి. కారణం వూహించుకోలేకపోయాడు. తాగి రావడంవల్ల జరిగిన గొడవని సరిపెట్టుకొన్నాడు అతను.

రమణారావ్ ఆ రాత్రే తన డైరీలో ఏదో రాసుకొన్నాడు.

* * *

రెండురోజుల తర్వాత—

అప్పుడు సమయం రాత్రి పదిగంటలు కావస్తోంది. బస్‌స్టాండులోఉన్న పబ్లిక్ టెలిఫోన్‌నుంచి ఎవరికో ఫోన్ చేయసాగాడు రమణారావ్.

"నా పేరు రమణారావ్! మా ఇంట్లో వుండే శ్రీరామ్ అన్న వ్యక్తి చనిపోయాడు. అతనికి బంధువులు నేను తప్ప ఎవరూ లేరు. వ్యాన్‌ని ఉదయం పదిగంటలకి పంపించండి" అన్నాడు ఫోన్‌లో తన అడ్రెస్ చెప్పి—

కార్పొరేషన్‌కి ఫోన్‌చేశాడు మహాప్రస్థానం వ్యాన్ కోసం.

శ్రీరామ్ శవాన్ని ఘనంగా వూరేగించి సాగనంపడానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేశాడు. ఆ ఉదయం తెల్లవారు జామునే లేచి తలారా స్నానంచేసి కొత్తబట్టలు కట్టుకున్నాడు రమణారావ్. భర్త ప్రవర్తన లలితకి అర్థం కాలేదు. "ఏవిటలా చూస్తున్నావ్! ఈరోజు నా బర్త్ డే! గుర్తులేదా!" అడిగేడు

ఆ మాటకు మరింత ఆశ్చర్యపోయింది లలిత.

ఏడుగంటలు కావస్తుండగా ఓ ప్లేట్లో నాలుగు స్వీట్స్ పెట్టుకుని శ్రీరామ్ గదివద్దకు వెళ్ళాడు రమణారావ్. తలుపు మీద టకటక కొట్టాడు. రమణారావ్‌ని వింతగా చూశాడు శ్రీరామ్.

"ఆశ్చర్యపడకండి—ఈరోజు నా బర్త్ డే. ముందుగా చెప్పకూడదని...." అంటూ స్వీట్స్ ప్లేటు అందించాడు.

బర్త్‌డే గ్రీటింగ్స్ చెబుతూ ప్లేట్ తీసుకున్నాడు శ్రీరామ్.

రిస్ట్‌వాచ్‌లో టైం చూసుకుని వెళ్ళిపోయాడు రమణారావ్. ఏడుగంటలు అయింది.

సెకెన్లు, నిమిషాలు గడుస్తున్నాయి. తన గదిలో కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాడు రమణారావ్.

లలిత వంటగదిలోంచి భర్తని చూస్తోంది. ఆమెకు కొత్తగా కనిపిస్తూంది భర్త ప్రవర్తన.

గదిలోంచి బయటకు, బయటనుంచి గదిలోకి తిరుగుతూ మధ్యలో టైం చూసుకుంటున్నాడు రమణారావ్.

టైం ఎనిమిదిగంటలు దాటుతోంది. ఒకసారి కిటికీ

లోంచి బయటకు చూశాడు. ఏ క్షణంలోనైనా మహాప్రస్థానం వ్యాన్ వచ్చెయ్యవచ్చు.

భర్త కొద్దిరోజులుగా తనపట్ల సీరియస్‌గా ఉండటంవల్ల ఎక్కువగా మాట్లాడలేకపోతోంది లలిత.

తొమ్మిది కావస్తూండగా మహాప్రస్థానం వ్యాన్ వచ్చింది.

రమణారావ్ గుండెలు దడదడలాడుతున్నాయి. ధైర్యంగా ఉన్నాడు. 'తన ప్లాన్ ఈపాటికి జరిగే ఉంటుంది....' అనుకుంటూ శ్రీరామ్ గదివేపు మెల్లిగా అడుగులువేశాడు.

కిటికీలోంచి చూశాడు—గదిలో లేడు శ్రీరామ్.

కొంచెం ముందుకు వెళ్ళి తొంగిచూశాడు. అంతే! అతని గుండెల్లో ఈటెలా దిగబడింది కనిపించిన ఓ దృశ్యం తాలూకు నిజం!

ముద్దుల కూతురు డాలి స్వీట్స్ తింటోంది. అవి శ్రీరామ్‌కని రమణారావ్ ఇచ్చిన స్వీట్స్.

శ్రీరామ్ వరండాలో షేవింగ్ చేసుకుంటున్నాడు.

"బేబీ!" గట్టిగా అరిచి ఒక్క అంగలో గదిలోకి వెళ్ళబోయి గుమ్మంలో నిలబడిపోయాడు రమణారావ్. అప్పటికే డాలి వళ్ళంతా చెమటలు పట్టాయి. మెలమెల్లగా కుర్చీలో వాలిపోతోంది. కనురెప్పలు బరువుగా అనిపిస్తున్నాయి ఆ చిన్నారి పాపకి.

కాన్సంట్రేటెడ్ పాయిజన్ కలిపిన స్వీట్స్ అవి. తెల్లటి లేలేత చర్మంమీద పాయిజన్ తన ప్రభావాన్ని చూపిస్తూంది.

డాలిని గుండెలకు హత్తుకుని కూలబడిపోయాడు

రమణారావ్.

శ్రీరామ్‌కి, లలితకి జరిగిందేవిటో అర్థంకాలేదు. కాని జరగరానిదేదో జరిగిపోయిందనిమాత్రం గ్రహించ గలిగారు.

ఆ తర్వాత—

డాలి శవాన్ని పోస్టుమార్టం చేసిన తర్వాత అందరికీ తెలిసిన నిజం—

భార్యమీద అనుమానంతో శ్రీరామ్‌ని చంపాలనుకున్నాడు రమణారావ్. కానీ ప్లాన్ వూహించని రీతిగా బెడిసికొట్టి ఒక్కగానొక్క కూతుర్ని బలిగొంది!

'అతనితో స్నేహం చెయ్యాలనుకున్నపుడు, అతని భార్యతో ఒంటరిగా మాట్లాడకు' కొటేషన్ గుర్తుకి వచ్చి ఆ ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాడు శ్రీరామ్. □

ఐస్ వాటర్!



సీరియల్



వసుంధర

(గత సంచిక తరువాయి)

కుమారస్వామి ఆశ్చర్యంగా—"మీరీ పెట్టెనెందుకు తెచ్చారు?" అన్నాడు.

"బయటపని చేసుకుంటున్నాం సర్.........ఎందుకో వెనక్కి తిరిగిచూసేసరికి ఓ కారుడిక్కీ తనంతటదే పైకి లేస్తూంది. చూడగానే భయమేసింది సార్....డిక్కీలో ఈ తోలుపెట్టె వుంది. ఇంతలో అలా ఓ మనిషొచ్చాడు. అంతకుముందెన్నడూ అతణ్ణిక్కడ మేము చూడలేదు. అతడు మాతో—'డిక్కీ తెరిచుంది. పెట్టె కనిపిస్తూంది. తీసుకెళ్ళి లోపల పెట్టండి. అందులో ఏమైనాపోతే మీమీద కొస్తుంది—' అన్నాడు సార్ — వెంటనే పెట్టెను లోపలకు మోసుకొచ్చాం...."

"అతడేడీ?"

"హడావుడిగా వెళ్ళిపోయాడు సర్...."

"సరే—మీరు వెళ్ళండి...." అన్నాడు కుమారస్వామి.

ఆ మనుషులిద్దరూ వెళ్ళిపోయారు.

"అంతా ఏదో నాటకంలాగుంది...." అన్నాడు ఛోటేలాల్.

"మీకిది కొత్త. మాకలవాటైపోయింది—" అన్నాడు కుమారస్వామి.

"నా కారు డిక్కీ ప్రత్యేకమైనది. నా తాళంతోతప్ప తెరుచుకోదు...." అంటూ ఛోటేలాల్ లేచి నిలబడ్డాడు.

"ఎదురుగా కనబడుతున్న ఆ తోలుపెట్టె నీదా, కాదా?" అన్నాడు నాయుడు.

"నాదే—" అన్నాడు ఛోటేలాల్.

"అందులో ఏముంది?"

"నా దృష్టిలో మామూలు ఆడది—మీ దృష్టిలో మిస్ మిస్టరీ...."

"ఎవరో ఒకరు....ముందు చూపించు...." అన్నాడు నాయుడు.

ఛోటేలాల్ పెట్టెను సమీపించబోయి ఉలిక్కిపడి ఆగాడు.

అతడు చూస్తూండగా పెట్టె అటూ ఇటూ కూడా పొడవై ఉన్న సైజుకు మూడింతలయింది.

"ఏమిటిది?" అని అతడంటుండగా పెట్టెమూత రకీమని తెరచుకుంది.

అప్రయత్నంగా ఛోటేలాల్ వెనుకడుగువేశాడు.

అక్కడున్న వారంతా కుర్చీల్లోంచి లేచి నిలబడ్డారు.

ఏదో జరుగుతుందని అంతా ఊపిరి బిగబట్టారు. కానీ ఏమీ జరగలేదు. నెమ్మదిగా అందరూ ఆ పెట్టెని సమీపించి చుట్టూ మూగారు.

పెట్టెలోపల పడుకుని ఉందో యువతి. ఆమె కళ్ళు మూసుకుని ఉంది. మనిషిలో చలనంలేదు.

"విచిత్ర!" అన్నాడు ఛోటేలాల్.

"మిస్ మిస్టరీ!" అన్నాడు కుమారస్వామి.

"జేబులో తాళాలు జేబులో ఉండగానే నా కారు డిక్కీ ఎలా తెరుచుకుంది?" అన్నాడు ఛోటేలాల్ ఆశ్చర్యంగా.

"అంతకంటే ఆశ్చర్యం—మన కళ్ళముందే ఈ పెట్టె సైజు మూడింతలయింది—" అన్నాడు నాయుడు.

"అదేమిటో ఇప్పుడే తేల్చేస్తాను—" అన్నాడు ఛోటేలాల్.

సరిగ్గా అప్పుడే టప్‌మన్న శబ్దమయింది.

అంతా ఉలిక్కిపడ్డారు.

పెట్టెలోని యువతి కళ్ళు తెరుచుకున్నాయి. ఆమె చేతులతో కళ్ళు నులుముకుని చుట్టూ ఉన్న మనుషుల్ని చూసి అదోలా నవ్వింది.

పళ్ళు బైటకక్కనిపించేలా — హిస్‌మన్నట్లు నవ్విన-ఆమె నవ్వు ఎంతటి ధైర్యవంతులకూ గుండెలు జలదరింపచేసేలా ఉంది.

అందరూ ప్రమాన్పడి ఆమెనే చూస్తున్నారు.

ఆమె పెట్టెలోంచీ లేచి నిలబడింది నెమ్మదిగా పాదాలు బయటపెట్టి నేలమీదకు వచ్చి — "ఎందరో మహానుభావులు—అందరికీ వందనాలు—" అంది.

ఎవ్వరూ బదులు పలకలేదు.

"నిలబడే ఉన్నారు. అంతా కూర్చోండి—" అందామె మళ్ళీ.

అందరూ మంత్రముగ్ధుల్లా తమ తమ సీట్లలోకి వెళ్ళి కూర్చున్నారు.

"మీ అందరి గౌరవార్థం ఒక పాట పాడతాను...." అంటూ వారిమధ్యన కూర్చుందామె నేలపై.

ఆ వెనువెంటనే పాట ప్రారంభమయింది.

మా వద్ద ప్రముఖ రచయిత[త్రు]ల
సాంఘిక నవలలు డిటెక్టివ్ రచనలు,
బాలసాహిత్యం, హిందీ. ఇంగ్లీషు నవలలు,
పురాణేతిహాసగ్రంథములు హోల్‌సేల్
మరియు
రిటైల్‌గా ఆకర్షణీయమైన కమీషన్ పై
లభించును

స్కూలు, కాలేజి అచ్చుపుస్తకములు
మరియు జనరల్ పుస్తకములు విద్యార్థు
లకు కావలసిన నోటు పుస్తకములు
సరసమైన ధరలకు లభించును

నేడే సంప్రదించండి

శ్రీ గణేశ్ బుక్ హౌస్

పాత కూరగాయల మార్కెట్ వద్ద
మెయిన్ రోడ్డు రాజమండ్రి
PHNO : 3444

"ఎందరో మహానుభావులు.... అందరికీ వందనములు"

ఛోటేలాల్ ఉలిక్కిపడ్డాడు.

ఆమె పాట వెనుక తంబుర వినపడుతోంది. పాటతో పాటే మృదంగధ్వనులు కూడా వస్తున్నాయి. అన్నింటికీ మించి ఆ గొంతామెది కాదు....

మంగళంపల్లి బాలమురళీకృష్ణది!

ఆమె పెదవులు కదులుతున్నాయి. ఆమె చేతులు తాళం వేస్తున్నాయి.

కానీ-ఒక రికార్డు కామె అభినయం చేస్తున్నట్లుంది తప్ప-ఆమే పాట పాడుతున్నట్లు లేదు.

పాట పామరులను కూడా తన్మయుల్ని చేసేవిధంగా కొనసాగుతోంది.

"హొయలుమీరి నడలుగల్గు సరసుని సదా కనుల జూచుచు పులక శరీరులయ్యానందపయోధి నిమగ్నులై ముదంబునను యశముగలవారెందరో మహానుభావులు.."

పాట వారిని నిజంగా పులకశరీరులను చేస్తోంది. ఆమెను వారించాలన్న స్పృహ ఎవరికీ కలుగడంలేదు.

"ప్రేమ ముప్పిరిగొనువేళా నామమును తలచువారు రామభక్తుడైన త్యాగరాజ నుతునికి దాసులైనవారెందరో మహానుభావులు...."

పాట ఆగిపోగానే ఏదో రసమయ ప్రపంచానికి దూరమైన అనుభూతి అక్కడున్నవారందరికీ కలిగింది.

ఛోటేలాల్ ఆశ్చర్యంగా ఆమెవంక చూస్తున్నాడు.

ఎవరీమె?

నిన్నటికీ ఈరోజుకీ ఈమెలో ఎంత తేడా?

నిన్న కుమారస్వామి నాయుడికి ఫోన్ చేశాడు. ఆయనీ రోజు సమావేశం ఏర్పాటుచేశాడు.

అపరాధ పరిశోధన పోటీ-235

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ. 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-2-'88 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఏప్రెల్'88 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఏడుగురు ఐ.ఏ.ఎస్. అధికారులను నక్సలైట్లు ఎత్తుకు పోయిన గ్రామం ఇది—? (రంపచోడవరం, గొర్తేడు)
2. 'గ్రాండ్ మాస్టర్' టైటిల్ సాధించిన తొలి భారతీయుడు—? (విశ్వనాథన్ ఆనంద్, సునీల్‌గవాస్కర్.)
3. జాతీయ క్రీడలలో ఆంధ్రప్రదేశ్ స్థానం—? (ఏడవది, పన్నెండవది.)
4. ఇటీవల అన్ని పరాజయాలనే చవిచూస్తున్న రాజకీయ పార్టీ—? (తెలుగుదేశం, బి.జె.పి.)
5. వీటి బెడద ప్రజలకు తప్పటంలేదు—? (నకిలీ మందులు, దోమలు.)

రాత్రంతా ఈమె తన గదిలోనే ఉంది. తనతో ఎంతో అభిమానంగా ప్రేమగా మసిలింది.

తన కామెపై మనసైతే-ఒకే ఒక్కరోజు గడు వడిగింది.

"ఎవరో నా మనసును ప్రభావితం చేస్తున్నారు. రేపేం జరుగుతుందోనని నాకు భయంగా ఉంది. ఆ భయంతో నాకు మనస్థిమితం లేదు. రేపే విశేషమూ జరక్కపోతే-అది నీ గొప్పతనంగా భావించి నాకు నేనే నీ కర్పితమైపోతాను. ఈరోజు నన్ను బలవంతం చెయ్యొద్దు-" అని వేడుకుందామె.

తనందు కంగీకరించాడు కానీ ఎందుకైనా మంచిదని ఆమెను మంచానికి బంధించే ఉంచాడు - రాత్రి తను నిద్రలో ఉన్నప్పుడు పారిపోకుండా.

ఉదయం నిద్రలేచాక ఆమె తనతో - "నా కిప్పుడెంతో సంతోషంగా ఉంది. నీ కారణంగా నాకు ముక్తి లభిస్తుందేమో-" అంది.

ఆమె సంతోషం తన కెంతో తృప్తినిచ్చింది.

కానీ యిప్పుడు....

డిక్కీ తనంతట తానే తెరుచుకోగా - పెట్టి పొడవు దానంతటదే పెరగ్గా-అందులోంచీ ఈమె లేచి-తనది కాని గొంతులో, దగ్గర్లోలేని తాళవాద్యాలను తంబురనాదంతో సహా వినిపింపజేస్తూ - ఈ పాట పాడట మేమిటి?

"నా పాట మీకు సంతోషం కలిగించే ఉండాలి. ఈ పాటకు తగిన గొంతు ననుకరించడంలో నేను విజయం సాధిస్తే-అదిమీ అదృష్టం-" అందామె.

అంతా ఈ లోకంలోకి వచ్చారు.

"ఎవర్నువ్వు?" అన్నాడు నాయుడు.

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే-జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే **M. O.** చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై-మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా మరియు రెండేసి నెలలకు **V.P.** ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెల కానెల రు. 19-60 లు, రెండేసి నెలలకు రు. 30/-లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం ఏది కావలసినా మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

"ఇనస్పెక్టర్ మిమి-" అందామె.

"ఇప్పుడు పాటెందుకు పాడావు?"

"ఇకముందు నా నోట్లోంచి వెలువడబోయే అక్షరాల్లో ఒక్కటీ మీకు నచ్చదు. అందుకే ముందుగా మీకు నచ్చే అక్షరాలు వినిపించాను...." అంటూ ఆమె ఛోటేలాల్ వంక తిరిగి - "మిస్టర్ ఛోటేలాల్....నా కిప్పుడు నీ అయిదుగురు స్నేహితుల వివరాలూ కావాలి. అందుకే ఈ సమావేశాని కొచ్చాను. వెంటనే చెప్పు...." అంది.

"నీ వేషాలూ, నాటకాలూ నాముందు సాగవు-" అన్నాడు ఛోటేలాల్.

"నా శక్తిని చూస్తావా?" అందా యువతి. బదులు కోసం ఎదురుచూడకుండానే ఆమె తన కుడిచేతిని ముందుకు చాపింది. ఆ చేయి-ఆమె శరీరంనుండి విడివడి వెళ్ళి బలంగా ఇనస్పెక్టర్ ఈశ్వర్రావును తాకింది. అతడు వెంటనే ఉన్నవాడున్నట్లు కుప్పలా కూలిపోయాడు.

"ఆమె స్పర్శలో వెయ్యివోల్టుల కరెంటు షాకు...." అన్నమాట గుర్తు తెచ్చుకున్నాడు ఛోటేలాల్.

ఆమె చేయి వెనక్కువచ్చి యధాస్థానంలో అతుక్కుపోయింది.

అందరూ నిశ్చేష్టులై ఈ విడ్డూరం చూస్తున్నారు.

"చెప్పు....నీ స్నేహితుల వివరాలు చెప్పు...."

"నేను చెప్పను-" అన్నాడు ఛోటేలాల్.

"అయితే గుర్తుంచుకో-ఈ క్షణంనుంచి సరిగ్గా ఇరవై నాలుగు గంటల వ్యవధి నీకు. ఎక్కడున్నాసరే-నీ ప్రాణాలు నీవికాదు...." అందామె.

"మిస్ మిస్టరీ-మమ్మల్ని సాధించకు. నీకేం కావాలో చెప్పు...." అన్నాడు నాయుడు.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-2-'88 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు ఏప్రెల్'88 నెల సంచికలో ప్రకటిస్తాము. ●

డిసెంబరు'87 పోటీ ఫలితాలు

(1) డిసెంబరు '87 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

కురిసెను వలపుల జల్లు !
పారెను రక్తపు టేర్లు !!

పంపినవారు: శ్రీమతి ఎన్. ఉష, టి. 2-481, 3 వ సెక్టర్ కాలనీ, గోదావరిఖని (కరీంనగర్ జిల్లా)

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

కక్ష్యలోకి ప్రయాణం !
పక్షులతో ప్రమాదం !!

పంపినవారు: శ్రీ వి.వి.యస్. మూర్తి, ఇంజనీర్, ఎఇ/23, ఎల్.ఎమ్.డి. కాలనీ - 505 527.

"నాయుడూ-నీ చరిత్ర బైటపడేరోజు దగ్గిర్లోనే ఉంది. నీ ఆస్తిపాస్తుల్ని త్వరగా అందరికీ నీకు తోచినవిధంగా పంచిపెట్టుకో...." అందామె.

కుమారస్వామి ఏదో అనబోగా - "నువ్వంటే నా కసహ్యం. మాట్లాడకు-" అందామె. అతడవమానపడి నోరు మూసుకోగానే ఛోటేలాల్ వంక తిరిగి- "ఛోటే లాల్-ఏం నిర్ణయించుకున్నావ్?" అనడిగింది.

"నేను నీకేమీ చెప్పను...." అన్నాడతడు.

"సరే—మీకర్మ-" అందామె. అప్పుడామె శరీరం నుండి రెండుచేతులూ విడివడి మెరుపు వేగంతో ఒకొక్క-రినే తాకాయి.

కొద్ది క్షణాల్లో మొత్తమందరూ స్పృహతప్పి పడి పోయారు.

* * *

అందరికంటే ముందు ఛోటేలాల్‌కి స్పృహవచ్చింది. అతడొకసారి కళ్ళు నులుముకుని చుట్టూ ఉన్నవారందర్నీ కలయజూసి ముందు కుమారస్వామిని తట్టిలేపాడు.

కుమారస్వామి కళ్ళు నులుముకుంటూ— "ఏం జరిగింది?" అన్నాడు.

"నీ అనుభవం నా అనుభవంలోకి వచ్చింది—" అన్నాడు ఛోటేలాల్.

నెమ్మదిగా కుమారస్వామికి జరిగిందందా గుర్తు కొచ్చింది.

"ఆమె ఏదీ?" అన్నాడతడు.

అప్పుడామె కోసం చూశాడు ఛోటేలాల్.

ఈశ్వర్రావు, ముత్యాలమూర్తి, నాయుడు - ఇంకా స్పృహతప్పి పడిఉన్నారు. మిస్‌మిస్టరీ అక్కడలేదు.

శ్రీ మహాలక్ష్మివారి వైరెటీ నవలలు

విడుదలైనవి!

1. నిశాంత — యద్దనపూడి సులోచనారాణి — 25-00
(డైరెక్టు నవల)

2. ప్రమాదాల్లో - ప్రమదలు — నవీన్ — 30-00
(స్వాతి వీక్లి సీరియల్)

3. అన్వేషణ — వి. యస్. రావ్ — 20-00
(అపన సీరియల్)

4. మానసిక సమస్యలు సమాధానాలు — డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి — 20-00

తప్పక చదవండి!

నేడే అడ్వాన్సుతో పాటు ఆర్డర్సు పంపండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ - 520 002.

తోలుపెట్టి కూడా అక్కడలేదు.

అప్రయత్నంగా జేబులు తడుముకున్నాడతడు. చేతికి తాళాలగుత్తి తగలగానే తృప్తిగా నిట్టూర్చాడు.

"ఆమె వెళ్ళిపోయింది." అన్నాడు ఛోటేలాల్ కుమార స్వామి ప్రశ్నకు బదులిస్తూ.

"ఎక్కడికి?"

"నీకు తెలుసేమో నాకు తెలియదు. నాకు మాత్రం తెలియదు...."

"ఇదంతా నీవల్లే జరిగింది. ఆమె సామాన్యురాలని వాదించి ఇక్కడకు తీసుకొచ్చావు...."

"నా గదిలో ఆమె సామాన్యురాలు. నీ యింట్లో ఆమె మిస్‌మిస్టరీ. తేడా నీలోనే ఉంది ఉండాలి...."

"మళ్ళీ నన్నే అనుమానిస్తున్నావా?"

"అందుకో కారణముంది." అన్నాడు ఛోటేలాల్. "నా కారు డిక్కీ తాళాలు నా జేబులోనే ఉన్నాయి. తాళాలు వేరే ఎవరిదగ్గరైనా ఉన్నా ఆ డిక్కీ తెరవడం నావల్లతప్ప సాధ్యపడదు. అలాంటి నా డిక్కీ దానంతటదే ఎలా తెరుచుకుంది?"

"ఆ డిక్కీ తెరవడం నావల్ల నవుతుందనా నీ అనుమానం?"

"కాదు." అన్నాడు ఛోటేలాల్. "ఆ డిక్కీ తెరవడం ఎవరివల్లాకాదు. అసలు నా కారు డిక్కీయే తెరవబడలేదని నా అనుమానం...." (సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY 3-4-554 Narayanaguda, Hyderabad-500 029, and Printed at Kranti Press, Madras - 600 001.

Blank Page


Regd.no: H/HD-48
PRABHAKAR